


పరీక్షా పే చర్చకు గ్లామర్

మోడీతో పాటు దీపికా పడుకొనే, మేరీకోమ్

వివరాలు 3లో


అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 07-02-2025

సమగ్ర తెలుగు దినపత్రిక



వివరాలు 10లో

ప్రయివేటీకరణకు ఆజ్యం

విద్యపై రాష్ట్రాల నియంత్రణకు అడ్డుకట్ట

యూనివర్సిటీలపై 'షట్‌డౌన్' కత్తి


హెచ్‌ఈసీఐ బిల్లుపై పార్లమెంటరీ ప్యానెల్

సంపుటి : 10 సంచిక : 349

Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar

12 పేజీలు వెల : 6.50

ట్రంప్ మళ్లీ యూటర్న్



పాలస్తీనియన్ల తరలింపుపై వెనక్కి తగ్గిన అమెరికా

పునర్నిర్మాణ పనులు జరిగే వరకేనంటూ వివరణ

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు మరోసారి యూటర్న్ తీసుకున్నారు. టారిఫ్‌ల పెంపుదల విషయంలో కెనడా,మెక్సికో దేశాలకు హెచ్చరికలు చేసిన ట్రంప్ వెనకడుగువేశారు. తాజాగా గాజాను స్వాధీనం చేసుకుంటానని ప్రకటించాక..మధ్యప్రాచ్యదేశాలనుంచి వ్యతిరేకత రావటంతో అబ్బే అది తాత్కాలికమేనంటూ వైట్‌హౌస్ ప్రకటన చేయకతప్పలేదు.

ట్రంప్ వివాదస్పద వైఖరి..

గాజా నుంచి పాలస్తీనియన్లను శాశ్వతంగా ఖాళీ చేయిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన విదేశాల్లోనే కాక స్వదేశంలోనూ తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. చివరికి రిపబ్లికన్ పార్టీ శాసనకర్తలు సైతం ట్రంప్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలస్తీనాను కబళించి, దానిని అమెరికాలో కలిపేసుకోవాలని ట్రంప్ కోరుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఆలోచనతో రిపబ్లికన్లు పూర్తిగా విభేదిస్తున్నారు. ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తుతుండడంతో నాలిక కరుచుకున్న ట్రంప్ ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రిబియో, శ్వేతసౌధం పత్రికా కార్యదర్శి ...11లో



మోడీ మౌనమేల?

భారతీయుల తరలింపులో అమెరికా చర్యలు అమానవీయం

- కేంద్రం తీరుపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన..దద్దరిల్లిన పార్లమెంట్
- చేతులకు బేడీలు వేసుకొని వినూత్న నిరసన
- స్తంభించిన లోక్‌సభ...రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

భారతీయుల తరలింపులో అమెరికా అమానవీయతపై ప్రధాని మోడీ మౌనమేలనంటూ ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. మౌనం వీడి స్పందించాలని, భారతీయుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశాయి. భారతీయుల తరలింపులో అమెరికా అమానవీయంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ ఆందోళనకు దిగాయి. గురువారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు మకర ద్వారం ఎదురుగా ఇండియా బ్లాక్ పార్టీల ఎంపీలు చేతులకు బేడీలు వేసుకొని వినూత్న నిరసన తెలిపారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ, ఎన్సీపీ, సీపీఐ(ఎం), సీపీఐ, ఆప్, ఆర్జేడీ, జెఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, ఆర్ఎస్పీ, ఐయూఎంఎల్, వీసీకే, ఎండీఎంకే తదితర పార్టీల ఎంపీలు ఆందోళన చేపట్టారు. అమెరికా భారతీయులను స్వదేశానికి పంపిన తీరులో కేంద్ర వైఫల్యానికి వ్యతిరేకంగా ప్లకార్డులు చేబూని నినాదాలు హోరెత్తించారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాది పార్టీ ఎంపీలు అఖిలేశ్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, సీపీఐ(ఎం) ఎంపీలు జాన్ బ్రిట్టాస్, కె.రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. ఈ



సందర్భంగా ప్రియాంక గాంధీ మాట్లాతుడూ విశ్వ గురువుగా చెప్పుకునే ప్రధాని మోడీ ఇప్పుడెందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. 'అమెరికా అధ్యక్షులు ట్రంప్, ప్రధాని మోడీ మంచి స్నేహితులంటారు. మరి ఇలాంటి సందర్భంలో ఎందుకు ట్రంప్‌తో మాట్లాడలేదు. మనవాళ్లను తీసుకురావడానికి ఒక విమానాన్ని కూడా పంపలేమా?. మనుషులతో ఇలాగే ప్రవర్తిస్తారా? ' అని ప్రశ్నించారు. దీనిపై విదేశాంగ శాఖ మంత్రి, ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశాన్ని విశ్వగురువుగా మార్చాలనే కలను చూపిస్తోన్న వారు ఇప్పుడెందుకు ...11లో

మనోళ్లపై అమానుషం

పిరికిపందలా కేంద్రం

మోడీ సర్కార్ వైఖరి గర్హనీయం

ఆమోదయోగ్యం కాదు : అమెరికా చర్యపై సీపీఐ (ఎం) 11లో..

అది స్వర్గధామం కాదు..నరకం!

ఇండ్లు, పొలాలు అమ్మి...

అప్పు చేసి అమెరాకాకు పయనం

నిండా ముంచిన ఏజెంట్లు

దొడ్డిదారిన అగ్రరాజ్యంలో ప్రవేశం

తిప్పి పంపుతున్న అధికారులు

అప్పుల పాలై వీధిన పడిన కుటుంబాలు

వివరాలు 3లో

స్థానికమే టార్గెట్

మెజార్టీ పంచాయతీలను ఏకగ్రీవం చేయండి



ఎమ్మెల్యేలే బాధ్యత తీసుకోవాలి

ఎస్సీ వర్గీకరణపై ఉమ్మడి నల్లగొండలో భారీ బహిరంగ సభ

కులగణనపై ఉత్తర తెలంగాణాలో మరో సభ

బేధాభిప్రాయాలను పక్కనపెడదాం

కొత్త, పాత నేతలు సమన్వయంతో వ్యవహరించాలి

సమస్యలుంటే చెప్పండి : కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రతినిధులను ఆదేశించారు. రాష్ట్రంలోని మెజార్టీ పంచాయతీలను ఏకగ్రీవం చేయాలని ఆయన సూచించారు. ఆ బాధ్యతను ఎమ్మెల్యేలే తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు చేరువ చేయాలని కోరారు. వాటికి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు. సీసీ రోడ్లు, గుళ్లు, ఇతర నిర్మాణ అనుమతులు, నిధుల మంజూరు సంబంధిత విషయాల్లో మంత్రులను సంప్రదించాలని సూచించారు. నియోజక వర్గాల్లో బీసీలకు 42శాతం స్థానిక సంస్థల పదవులు కేటాయించే బాధ్యత ఎమ్మెల్యేలే తీసుకోవాలన్నారు. 90శాతానికి పైగా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని నాయకులను కోరారు. విభేదాలను పక్కన పెట్టి లక్ష్య సాధన వైపు సాగాలని సూచించారు. కొత్త, పాత నేతలు సమన్వయంతో ముందుకు పోవాలని సూచించారు. గురువారం హైదరాబాద్ ఎమ్‌సీహెచ్‌ఆర్‌డీలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌కనుగుణంగా బీసీ కులగణన చేపట్టామనీ, దీనిపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ...2లో



వర్సిటీల్లో యూజీసీ జోక్యం తగదు

రాష్ట్ర ప్రభుత్వానికి విద్యా కమిషన్ మద్దతు

విశ్వవిద్యాలయాల్లో స్వేచ్ఛ ఉండాలి

గ్రాంట్స్ ఇవ్వడానికే పరిమితం కావాలి : మేధావుల సదస్సు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తినీ, రాష్ట్ర విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తినీ, తెలంగాణ రాష్ట్ర విద్య, సాంస్కృతిక హక్కులను పరిరక్షించేందుకు వీలుగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మార్గదర్శకాలు-2025ను వ్యతిరేకించాలని విద్యావేత్తలు, మేధావుల సదస్సు పిలుపునిచ్చింది. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న వైఖరికి మద్దతునిస్తూ తీర్మానం చేసింది. " యూజీసీ నిబంధనలు-రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో జోక్యం" అనే అంశంపై తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మెన్ ఆకునూరి మురళీ అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లో ప్రముఖ విద్యావేత్తలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ యూజీసీ తన అధికారాల పరిధిని దాటి సిఫారసులు చేస్తున్నదని ఆక్షేపించారు. హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య తర్వాత దేశవ్యాప్తంగా కేంద్రీయ విద్యాలయాల్లో పరిస్థితులపై పెద్ద ఎత్తున చర్చ జరిగిందని, ఆ తర్వాత ఢిల్లీ జెఎన్‌యూ విశ్వవిద్యాలయ విద్యార్థి కన్నయ్య కుమార్‌పై కేసు నమోదవ్వడం, జెఎన్‌యూ దేశద్రోహులను ఉత్పత్తి చేస్తున్నట్టుగా వారిపై ఆరోపణలు వచ్చాయని అన్నారు. దీనిపై దేశ ...2లో

సంచారజాతి కుటుంబంపై దాడి



వీడీసీ పేరుతో ట్రాక్టర్‌తో ఇల్లు నేలమట్టం

మహిళలు, చిన్న పిల్లలకు గాయాలు

నిజామాబాద్ జిల్లా నల్లవెల్లిలో ఘటన

సంచార ఓడ్ కుల జిల్లా కమిటీ పరామర్శ

వివరాలు 10లో

డ్రైవర్ నిర్లక్ష్యం..చిన్నారి మృతి

తలపై నుంచి వెళ్లిన స్కూల్ వ్యాన్

నవతెలంగాణ-హయత్‌నగర్

ఆ చిన్నారి ప్రతి రోజూ వ్యాన్‌లో పాఠశాలకు వెళ్లి వస్తోంది. గురువారం కూడా వ్యాన్‌లో స్కూల్‌కు వెళ్లిన బాలిక తిరిగి సాయంత్రం వ్యాన్ దిగి ఇంట్లోకి వెళ్లే క్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యానికి అదే వ్యాన్ కింద పడి నలిగిపోయింది. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ ...11లో



(ఫైల్)

పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ స్కీంకు

జాతీయ హోదా ఇవ్వలేం

ప్రస్తుత పరిస్థితిలో అసాధ్యం



న్యాయపర చిక్కులు ఉన్నాయని దాటవేసిన కేంద్రం

లోక్‌సభలో ఎంపీ బలరాం నాయక్ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో ఒక ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వాలనే ఏపీ విభజన చట్టం - 2014లోని హామీకి కేంద్ర ప్రభుత్వం మరోసారి తూట్లు పొడిచింది. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు జాతీయ హోదా విజ్ఞప్తిని పక్కన పెట్టింది. న్యాయపర చిక్కులు, సాంకేతిక అంశాలను చూపుతూ గురువారం లోక్‌సభ వేదికగా తెలంగాణకు జాతీయ హోదా ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఏపీ, తెలంగాణలోని ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లకు జాతీయ హోదా కల్పించే అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ బలరాం నాయక్ లోక్‌సభలో లేవనెత్తారు. తెలంగాణలోని పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ స్కీంకు జాతీయ హోదా ఇచ్చే ఆలోచన ఉందా? లేకపోతే కారణాలు తెలపాలని ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర జలశాఖ సహాయ మంత్రి అజయ్ భూషన్ చౌదరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణలో ఏ ఒక్క ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా లేదని స్పష్టం చేశారు. అయితే తెలంగాణ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి స్కీంకు నేషనల్ ప్రాజెక్ట్ స్టేటస్ ఇవ్వాలని కోరిందని చెప్పారు. అయితే జాతీయ హోదా ఇవ్వాలంటే సెంట్రల్ వాటర్ కమిషన్(సీడబ్ల్యూసీ), ఇతర కమిటీలు ఆమోదం తెలపాల్సి ఉంటుందని చెప్పింది.

పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కోసం డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను సెప్టెంబర్ 2022లో సాంకేతిక, ఆర్థిక అంచనాల కోసం తెలంగాణ ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి పంపిందని కేంద్ర మంత్రి తన సమాధానంలో చెప్పారు. అయితే... జాతీయ హోదా ఇవ్వాలంటే ముందుగా సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) సంబంధిత ప్రాజెక్టు సాంకేతిక, ఆర్థికపరమైన అంశాలను అంచనా వేయాల్సి ఉంటుందన్నారు. ఆ తరువాత జల మంత్రిత్వ శాఖకు చెందిన నీటిపారుదల, వరదల నిర్వహణ, బహుళార్థక సాధక ప్రాజెక్టుల సలహా కమిటీ ఆమోదించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కృష్ణా నది జలాల వినియోగంపై ఆధారపడి నిర్మించనున్న ప్రాజెక్ట్ అని తెలిపారు. అలాగే కృష్ణా నది జలాల వివాద ట్రిబ్యునల్ -2 టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌లో ఉన్న అంతర్రాష్ట్ర అంశాలతో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ముడిపడి ఉందన్నారు. దీంతో కృష్ణానది వివాదాల క్రిమినల్ అంశం ప్రస్తుతం న్యాయస్థానాల పరిధిలో ఉందని వెల్లడించింది. అందువల్ల ప్రస్తుతానికి సాంకేతిక ఆర్థిక అంచనా సాధ్యం కాదని, ఈ ప్రక్రియ చేయకుండా జాతీయ హోదా సాధ్యం కాదని తేల్చి చెప్పింది. కాగా... విభజన చట్టం ప్రకారం ఇప్పటికే ఏపీలోని పోలవరం ప్రాజెక్‌కు కేంద్రం జాతీయ హోదా ప్రకటించింది. ఆ ప్రాజెక్ట్ ప్రస్తుతం నిర్మాణంలో ఉండగా... ఈ ప్రాజెక్ట్‌కు 2023-24లో రూ. 5, 512.50 కోట్లు, తాజా బడ్జెట్ (2025-26)లో రూ.5, 936 కోట్లు కేంద్ర కేటాయించింది.

భారత్‌లో సాధారణంగా ప్రతి పదేండ్లకు ఒకసారి జనాభా లెక్కలు జరగాలి. చివరగా జనగణన 2011లో జరిగింది. ఆ జనాభా లెక్కలనే ప్రభుత్వం ఇప్పటికీ వినియోగిస్తున్నది. దీనిని బట్టి 2021లో జనగణన జరగాల్సి ఉన్నది. అయితే, కరోనా పరిస్థితుల నేపథ్యంలో కేంద్రంలోని మోడీ సర్కారు జనాభా లెక్కలను అటకెక్కించింది. ఇప్పటికీ 2011 జనాభా లెక్కలతోనే ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సరిపుచ్చుతున్నది. అయితే, దీనిపై సామాజిక కార్యకర్తలు, నిపుణులు విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దకాల జనగణన జరగకపోవటంతో దేశంలోని ఎందరో పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ లెక్కల్లోకి రాలేకపోతున్నారనీ, దీంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారని అంటున్నారు.

జనగణనలో జాప్యం

శ్రద్ధ చూపని మోడీ సర్కారు



2021లో జరగాల్సి ఉన్నా..వాయిదాలతో ఆలస్యం చేస్తున్న కేంద్రం

ఇప్పటికీ 2011 లెక్కలపై ఆధారపడుతున్న వైనం

పలు ప్రభుత్వ పథకాలు, ప్రణాళికలు, కార్యక్రమాలపై ఎఫెక్ట్

2020 నుంచి జనన, మరణాలపై పెండింగ్‌లో కీలక నివేదికలు

ఇబ్బందులను ఎదుర్కొంటున్న దేశ ప్రజలు

నిపుణులు, విశ్లేషకులు, సామాజిక కార్యకర్తల ఆందోళన





న్యూఢిల్లీ : భారత్‌లో జనాభా లెక్కల ప్రక్రియ పెండింగ్‌లో ఉండటంతో దాని ప్రభావం పలు అంశాలపై పడుతున్నది. జనన, మరణాలపై పలు కీలక నివేదికలు 2020 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. రెండు కీలక నివేదికలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గత ఐదు సంవత్సరాలుగా విడుదల చేయలేదు. ముఖ్యంగా, 'పౌర నమోదు వ్యవస్థ ఆధారంగా భారతదేశ కీలక గణాంకాలు', 'మరణ కారణ వైద్య ధృవీకరణ నివేదిక' లు చివరిగా 2020 సంవత్సరానికి విడుదలయ్యాయి. దేశంలో పౌర నమోదు వ్యవస్థ నివేదిక కీలక గణాంకాలు చాలా కీలకం. ఇది ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, కుటుంబ నియంత్రణ, తల్లి, శిశువు ఆరోగ్యం, విద్యకు సంబంధించిన పలు కార్యక్రమాలను ప్రణాళిక చేయటంలో ముఖ్యపాత్రను వహిస్తుందని నిపుణులు చెప్తున్నారు. అయితే, ఆ రెండు కీలక నివేదికలు లేని కారణంగా దాని ప్రభావం దేశ ప్రజల మీద పడుతుందని అంటున్నారు.

విడుదల కాని ఎన్సీఆర్బీ నివేదిక

జనగణనలేమి దేశంలోని పలు కీలక విభాగాల పైనా పడింది. 2023 సంవత్సరానికి గానూ నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్సీఆర్బీ).. భారత్‌లో వార్షిక నేర నివేదికను ఇంకా విడుదల చేయకపోవటం గమనార్హం. 2023లో కేంద్రం జననాలు, మరణాల నమోదు(సవరణ చట్టం)ను అమలు చేసింది. దీని ప్రకారం.. ఆ ఏడాది అక్టోబర్ 1 నుంచి దేశంలో జరిగే అన్ని జననాలు, మరణాలను ఒక సెంట్రల్ పోర్టల్ ద్వారా డిజిటల్‌గా నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే, జనగణన జరగని కారణంగా కేంద్రం వాస్తవ గణాంకాలను పొందలేదని విశ్లేషకులు అంటున్నారు. హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక, ఢిల్లీ, చండీగఢ్, మిజోరం, గోవా, ...11లో

యూజీసీ కొత్త రూల్స్ రూపొందించండి

రాష్ట్రాల హక్కులు హరించొద్దు

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కేటీఆర్ విజ్ఞప్తి

3లో..

మిడ్ మానేరు మీదుగా రోడ్ కమ్ రైల్ బ్రిడ్జికి సహకరించండి : కేంద్రమంత్రి గడ్కరీకి వినతి



సచివాలయం వద్ద నకిలీ ఎమ్మార్వో

పట్టుకుని పోలీసులకు అప్పగించిన సెక్యూరిటీ సిబ్బంది

నవతెలంగాణ - బంజారాహిల్స్

తెలంగాణ సచివాలయం వద్ద నకిలీ ఎమ్మార్వోను సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. వివరాల్లోకెళ్తే.. గురువారం కొంపల్లి అంజయ్య అనే వ్యక్తి తహసీల్దార్ ఐడీ కార్డు, స్టిక్కర్ వాహనంతో సెక్రటేరియట్‌కు వచ్చాడు. అయితే, సెక్యూరిటీ సిబ్బందికి అనుమానం రావటంతో విచారించగా.. అతని మాటల్లో స్పష్టత లేదని నిర్ధారించుకున్నారు. అనంతరం అతన్ని సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు. అంజయ్య నుంచి ఫేక్ ఐడీ స్వాధీనం చేసుకున్నారు. ఓ జిరాక్స్ సెంటర్‌లో ఫేక్ ఐడీ తయారు చేసినట్టు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్థానికమే టార్గెట్

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. వాటిని తిప్పి కొట్టేందుకు ఉత్తర తెలంగాణలో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేద్దామని సూచించారు. బీసీ కులగణనను శాస్త్రీయంగా చేపట్టామనీ, దీనిపై ప్రతిపక్షాలు లేనిపోని అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. ప్రతీ ఎమ్మెల్యే నియోజకవర్గాల స్థాయిలోనే కౌంటర్ అటాక్ చేయాలని సూచించారు. అదే విధంగా ఎస్సీ వర్గకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందనీ, దాన్ని అమలు చేసి చూపామని అన్నారు.

బీసీ సంఘాలను బీఆర్ఎస్ తప్పుదోవ పట్టిస్తోంది: మహేష్ కుమార్ గౌడ్

బీసీ జనాభాపై బీఆర్ఎస్ వాస్తవాలు తెలియక తప్పుడు ప్రచారం చేస్తోందని పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. బీసీ సంఘాలను ఆపార్టీ తప్పుదోవ పట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణనపై రాహుల్‌గాంధీతో సూర్యాపేటలో బహిరంగ సభ, ఎస్సీ వర్గీకరణపై మెదక్‌లో ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేతో మరోసభను నిర్వహిస్తామన్నారు. బీజేపీతో మాజీ మంత్రి కేటీఆర్ లోపాయకారి ఒప్పందం చేసుకునేందుకు ఢిల్లీకి పోతున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసినట్టు తెలిపారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారిగా కులగణన చేపట్టామని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ఆశయం మేరకు పరిపూర్ణంగా సర్వే చేసి ఎవరు ఎంత సంఖ్యలో ఉన్నారో తేల్చామన్నారు.తమ పార్టీకి సంబంధించి ప్రత్యేకంగా ఎమ్మెల్యేల సమావేశం జరగలేదనీ, వారు కలిసి డిన్నర్ చేస్తే తప్పేంటి? అని ప్రశ్నించారు. ఇతర సామాజిక తరగతులపై అనుచితంగా మాట్లాడిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. సమాధానం వచ్చాక చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశం ద్వారా ఎమ్మెల్యేలకు ఉన్న అనుమానాలు నివత్తి చేశామన్నారు.

బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకే కేటీఆర్ ఢిల్లీ వెళ్లారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రెండు మూడు రోజుల్లో పీసీసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

ఢిల్లీకి బయలుదేరిన సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు

బీసీ కులగణన, ఎస్సీ, వర్గీకరణ తదితరాంశాలపై సీఎల్పీలో చర్చించిన విషయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు తదితరులు ఢిల్లీకి బయలుదేరారు. కొంత మంది ఎమ్మెల్యేలు కూడా వారివెంట ఉన్నారు.

అ పది మంది దూరం...

సీఎల్పీ సమావేశానికి కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, గూడెం మహిపాల్ రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, సంజయ్‌కుమార్, కృష్ణమోహన్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరు కాలేదు. వారికి అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేయడం, కేసు సుప్రీంకోర్టులో ఉండటంతో టెక్నికల్‌గా ఏ సమస్యా రాకుండా, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారు ఈ సమావేశానికి గైర్హాజరైనట్టు తెలిసింది. కాగా 56 మంది ఎమ్మెల్యేలు, తొమ్మిది మంది ఎమ్మెల్సీలు భేటీకి హాజరయ్యారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ఫైళ్లతో సమావేశానికి హాజరయ్యారు. తనపై వస్తున్న ఆరోపణలకు ఆయన వివరణ ఇచ్చారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య

ఆ కుటుంబానికి న్యాయం చేస్తాం : జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ జానకి



నవతెలంగాణ- బాలానగర్

బాలికల గురుకుల వసతి గృహంలో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండల కేంద్రంలోని బాలికల గురుకుల వసతి గృహంలో గురువారం జరిగింది. ఎస్ఐ లేనిన్ గౌడ్, రూరల్ సీఐ నాగార్జునగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని చుక్కనపల్లి గ్రామానికి చెందిన రమేష్ - రజిత కుమార్తె ఆరాధ్య(16). ఆమె గురుకుల బాలానగర్ బాలికల గురుకుల పాఠశాలలో నాలుగు సంవత్సరాలుగా చదువుతోంది. ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో ఉదయం సుమారు 7.30 గంటల సమయంలో పాఠశాలలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాలిక ఆత్మహత్యపై అన్ని రకాలుగా విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ జానకి అన్నారు. అనంతరం పాఠశాలను జిల్లా అధికారులు పరిశీలించారు. బాలిక కుటుంబానికి నాగర్‌ర్నూల్ జిల్లాలో ఉద్యోగం, ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, బాలిక కుటుంబానికి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనంతరెడ్డి తక్షణమే తమ కార్యకర్తల ద్వారా రూ.50 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ సెల్ చైర్మెన్ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శంకర్ నాయక్, సీనియర్ నాయకులు వెంకటేశ్వర రెడ్డి తదితరులున్నారు.

వర్సిటీల్లో యూజీసీ జోక్యం తగదు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవడం లాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. విశ్వవిద్యాలయాల ఆర్థిక అవసరాలు తీర్చేందుకే యూజీసీ ఏర్పడింది గానీ, యూనివర్సిటీలను ఆదేశించేందుకు వాటిపై నిర్ణయాలు చేసేందుకు కాదని వివరించారు. వైస్ ఛాన్సలర్లు యూనివర్సిటీలో భాగం కాదని, అలాంటప్పుడు యూనివర్సిటీల్లో సబార్డినేట్ల కోసం ఏర్పడిన యూజీసీ వీసీల నియామక ప్రక్రియపై ఏ విధంగా సిఫారసు చేస్తుందని ఆయన ప్రశ్నించారు. సబార్డినేట్ లెజిస్లేషన్‌కు సంబంధించి రాజ్యాంగంలో పరిమితులు ఉన్నాయని వివరించారు. ఛాన్సలర్లు, వైస్ ఛాన్సలర్లు యూనివర్సిటీలో భాగం కాదని, వారు అధికారులు మాత్రమేనని తెలిపారు. దేశంలో 1,800 యూనివర్సిటీలు ఉండగా, వీటి నుంచి ప్రతి ఏటా 3.5 మిలియన్ల మంది గ్రాడ్యుయేట్లు బయటికి వస్తున్నారని తెలిపారు. దీన్ని పెట్టుకుని యూజీసీ మార్గదర్శకాలను తీవ్రమైన సమస్యగా గమనించాలన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో స్వేచ్ఛ ఉండాలనీ, యూజీసీ జోక్యం తగ్గాలని డిమాండ్ చేశారు. యూజీసీ కేవలం గ్రాంట్స్ ఇవ్వడానికి మాత్రమే పరిమితం కావాలనీ, కానీ ప్రస్తుతం అది యూనివర్సిటీల్లో జోక్యం చేసుకుంటుందని విమర్శించారు. అది ఎందుకు పాలసీలను మారుస్తోందని ప్రశ్నించారు. గవర్నర్లు కేంద్ర రాజకీయాలకు అనుగుణంగా పని చేస్తారనీ, అలాంటప్పుడు వీసీల నియామకాన్ని గవర్నర్లకు అప్పగించడమేంటని నిలదీశారు. ఏ దేశంలోనైనా, ఎవరైనా ఎప్పటికప్పుడు విద్యార్హతలను పెంచుతారనీ, వీసీల నియామక అర్హతను తగ్గించడమేంటని ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విశ్వవిద్యాలయాల్లో జోక్యం చేసుకోవద్దని సూచించారు. ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండ రామ్ మాట్లాడుతూ యూజీసీ మార్గదర్శకాలను విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తికి గొడ్డలిపెట్టుగా అభివర్ణించారు. దాన్ని కాపాడాల్సిన యూజీసీనే విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బకొట్టేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. ఒక రాజకీయ పార్టీ అభిప్రాయాల మేరకే కేంద్ర విశ్వవిద్యాలయాల్లో నియామకాలు జరుగుతున్నాయనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమ వుతున్నాయని విమర్శించారు.ప్రొఫెసర్ శాంతా సిన్హా మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల నుంచి వస్తున్న మేధావి వర్గంతో ప్రభుత్వం ఇబ్బంది పడుతోందనీ, అందుకే ఆ వర్గం లేకుండా చేసేందుకు యూజీసీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. యూజీసీ చట్టాలు చేయదనీ, కానీ ఇలా మార్గదర్శకాలు విశ్వవిద్యాలయాలపై రుద్దడమేంటని ప్రశ్నించారు.

వీటిని అమలు చేస్తే..ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, అఘోరాలే వీసీలు : -ఆకునూరి మురళి హెచ్చరిక

తెలంగాణ విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళీ మాట్లాడుతూ యూజీసీ మార్గదర్శకాలను అమలు చేస్తే భవిష్యత్‌లో రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, అఘోరాలు కూడా వీసీలుగా మారే ప్రమాదం ఉన్నదన్నారు. కేంద్రం యూజీసీ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలపై దాడి చేస్తోందని మండిపడ్డారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సీబీఐ, ఈడీ ఎన్నికల కమిషన్ సంస్థల తరహాలోనే యూజీసీని కూడా కేంద్రం తన రాజకీయాలకు వాడుకుంటోందని ఆరోపించారు. త్వరలోనే నూతన జాతీయ విద్యా విధానంపై కూడా మేధావులతో సదస్సు నిర్వహిస్తామని సదస్సులో ఒకరు వేసిన ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు.

యూజీసీ ముసాయిదా నిబంధనలకు నెల గడువు మాత్రమే ఉండటంతో ముందుగా ఆ సదస్సును నిర్వహించి నట్టు వివరణ ఇచ్చారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ పద్మజాషా, ప్రొఫెసర్ తిరుపతిరావు తదితరులు మాట్లాడారు.

పరీక్షా పే చర్చకు గ్లామర్

న్యూఢిల్లీ: విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని పోగొట్టేందుకు కేంద్రం ప్రధాని ద్వారా ఏటా 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దీనికోసం కోట్లాది రూపాయలను ఖర్చుపెడుతోంది. అయితే ఇప్పటి వరకు మోడీ వన్‌మ్యాన్ షో నిర్వహించేవారు. అయితే ప్రధానిని చూసి విద్యార్థులకు బోరుకొడుతుందా.?లేక మోడీ చరిష్మా తగ్గుతుందా..?ఏది ఏమైనా ఈసారి గ్లామర్ జోడించి మరీ పరీక్షా పే చర్చకు మోడీ సర్కార్ సిద్ధమవుతున్నది. ఫిబ్రవరి 10న ఢిల్లీలోని భారత్ మండపం టౌన్ హాల్‌లో ఏర్పాటు చేయగా, ఎప్పటి మాదిరిగా కాకుండా ఈసారి 'పరీక్షా పే చర్చ 2025 ను కొత్త ఫార్మాట్‌లో సరికొత్తగా నిర్వహించనున్నట్టు లీకులిచ్చింది. ఈ ఏడాది ప్రధాని మోడీతో పాటు బాలీవుడ్ నటీనటులు, ఇతర రంగాల ప్రముఖులు కూడా ఇందులో పాల్గొననున్నట్టు అధికారులు వెల్లడించారు. జగ్గీ వాసుదేవ్, నటీనటులు దీపికా పడుకొనే, విక్రాంత్ మస్సే, భూమి పడ్నేకర్, దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్, పారా అథ్లెట్ అవని లేఖరా, రచయిత రుజుతా దివేకర్, ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ రాధికా గుప్తా, మానసిక నిపుణురాలు సోనాలీ సబర్వాల్, ఫుడ్ ఫార్మర్ రేవంత్ హిమత్‌సింగ్కా, టెక్నికల్ గురూజీ గౌరవ్ చౌదరీ వంటి ప్రముఖుల పాడ్‌కాస్ట్ ఎపిసోడ్స్‌ను ప్రదర్శించనున్నారు. వీరు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకుని వారిలో స్ఫూర్తి నింపనున్నట్టు ప్రకటించారు. బాలీవుడ్ నటి దీపికా పడుకొనే ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. జేఎన్‌యూలో జరిగిన దేశద్రోహంపై చర్చకు హాజరైన దీపిక పడుకొనేకు వ్యతిరేకంగా బీజేపీ శ్రేణులు పెద్ద క్యాంపెన్ నిర్వహించాయి. ఆమెను మానసికంగా క్షోభపెట్టిన బీజేపీ పాలకులు..ఇపుడు పరీక్షాపే చర్చకు పిలవటం విశేషం. ఇక పరీక్షా పే చర్చ కోసం గతేడాది డిసెంబర్ 14న రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాగా... జనవరి 24 ఉదయం 10గంటల వరకు వరకు దేశవ్యాప్తంగా 9.72 లక్షల మంది విద్యార్థులు, 1.01 లక్షల మంది టీచర్లు, 24,289 మంది తల్లిదండ్రులు రిజిస్టర్ అయినట్టు అధికారులు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. ఈ ఈవెంట్‌లో పాల్గొనేందుకు 2500 మందిని ఎంపిక చేస్తారు. వారికి కేంద్ర విద్యాశాఖ నుంచి పీపీసీ కిట్‌లు అందిస్తారు. పరీక్షా పే చర్చలో పాల్గొనేవారిని ఎంపిక చేసేందుకు **https:// innovateindia1.mygov.in/**లో ఆన్‌లైన్ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్న(ఎంసీక్యూ) లతో ఓ పోటీ నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థులు ప్రధానితో నేరుగా జరిగే చర్చా కార్యక్రమంలో పాల్గొంటారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మోడీ సమాధానమిస్తారు. విద్యార్థులకు తగిన సూచనలు చేస్తారు.

యూజీసీ కొత్త రూల్స్ రూపొందించండి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని, హక్కులను హరించకుండా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నూతన నిబంధనలను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి గురువారం నాడిక్కడ పార్లమెంట్‌లో కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, నితీన్ గడ్కరీలతో కేటీఆర్ సమావేశం అయ్యారు. తొలుత యూజీసీ నూతన నిబంధనలకు సంబంధించిన అంశంపై ధర్మేంద్ర ప్రధాన్‌తో కేటీఆర్ బృందం భేటీ అయింది. తరువాత నేషనల్ హైవే 365 - విస్తరణపై నితీన్ గడ్కరీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం కేటీఆర్ విజయ్ చౌక్‌లో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూజీసీ నిబంధనలో చేయదలచిన మార్పులపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ తరఫున ఆలోచనలను ఆరు పేజీల లేఖ రూపంలో తెలిపామన్నారు. దేశంలో రాష్ట్రాల హక్కులను హరిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర పరిధిలోని వర్సిటీల వైస్ చాన్సలర్స్ నియామకానికి వేసే సెర్చ్ కమిటీలకు బాధ్యతను పూర్తిగా రాష్ట్ర గవర్నర్‌కు అప్పగిస్తూ కేంద్రం తీసుకురానున్న యూజీసీ నిబంధనలు సరికాదన్నారు. ఈ నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలను గవర్నర్ల రూపంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకోవడమేనని ఆరోపించారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అలాగే నో సూటబుల్ క్యాండిడేట్ ఫౌండ్ అనే ఒక నిబంధనను తీసుకురావడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీలు రిజర్వేషన్లను కోల్పోతారని చెప్పారు. అభ్యర్థులు దొరకలేదనే సాకుతో ఆ ఉద్యోగాలు ఇతర కేటగిరీలకు భర్తీ చేసే ప్రమాదముందన్నారు. ఇది భారత రాజ్యాంగం ఆయా సామాజిక వర్గాలకు ఇచ్చిన రాజ్యాంగబద్ధమైన హక్కును హరించడమే అవుతుందని ఫైర్ అయ్యారు. యూనివర్సిటీ ఉద్యోగాల భర్తీలో కేవలం విద్యార్హతలపైన మాత్రమే కాకుండా పరిశోధనలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర మంత్రికి సూచించినట్టు చెప్పారు. సిరిసిల్ల వరకు నిర్మాణం అవుతున్న నేషనల్ హైవే-365ని వేములవాడ నుంచి కోరుట్ల వరకు విస్తరించాలని కేంద్ర మంత్రిని గడ్కరీని కోరినట్టు కేటీఆర్ తెలిపారు. ధవళేశ్వరం బ్రిడ్జ్ మాదిరిగా... మిడ్ మానేరుపై రోడ్ కమ్ రైల్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి, వేములవాడ మీదుగా కోరుట్లలో జాతీయ రహదారి 63ని కలిపేలా విస్తరించాలని విజ్ఞప్తి చేశామన్నారు.


మైనారిటీలకు మళ్లీ మొండిచేయే

సంక్షేమ పద్దులకు బడ్జెట్‌లో భారీ కోతలు



కనుమరుగైన అనేక పథకాలు, కార్యక్రమాలు | కేటాయింపులనూ ఖర్చు చేయని వైనం

న్యూఢిల్లీ : 'సబ్‌కా సాత్...సబ్‌కా వికాస్'... ప్రధాని నరేంద్ర మోడీ నినాదమన్న విషయం తెలిసిందే. మైనారిటీల అవసరాలన్నీ తీరుస్తానని, కేంద్ర బడ్జెట్ల ద్వారా వారిని జాతీయ ప్రధాన స్రవంతిలో చేరుస్తానని ఆయన గతంలో అనేక హామీలు ఇచ్చారు. కానీ ఆ నినాదం, హామీలు ఉత్తుత్తి కబుర్లేనని తేలిపోయింది. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్టే దీనికి ప్రత్యక్ష సాక్షి. హిందూత్వ సిద్ధాంతాన్ని ఒంటపట్టించుకున్న మోడీ ప్రభుత్వానికి దేశంలోని మైనారిటీ యువత విద్య, అభివృద్ధిపై ఆసక్తి లేదని అర్థమైపోయింది. ముఖ్యంగా రెండు కోట్ల మంది ముస్లింల సంక్షేమాన్ని మోడీ ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోంది. ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులను ఈ ప్రభుత్వం దేశ ఆంతరంగిక శత్రువులుగా చూస్తోంది.



స్కాలర్‌షిప్పుల్లో కోతలు

తాజా బడ్జెట్‌లో తొలి 'కోత' పడింది మైనారిటీలకు అందజేస్తున్న ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్పుల పైనే. మైనారిటీలకు చెందిన చిన్నారులు పాఠశాలల్లో ప్రవేశాలు పొందేందుకు ఈ పథకం ఎంతో కీలకమైనది. 2023-24 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.433 కోట్లు కేటాయించారు. 2024-25లో ఆ మొత్తాన్ని రూ.326.16 కోట్లకు తగ్గించారు. తాజా బడ్జెట్‌లో మరింత కోత పెట్టి రూ.195.70 కోట్లుగా చూపారు. కేటాయించిన నిధులను కూడా పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేదు. 2023-24లో రూ.95.83 కోట్లు, 2024-25లో రూ.90 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మైనారిటీల పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్పుల విషయంలోనూ ఇదే ఉదాశీనత కన్పిస్తోంది. తాజా బడ్జె ట్‌లో కేటాయింపులను గత సంవత్సరంతో పోలిస్తే 65 శాతం తగ్గించి రూ.413.99 కోట్లకు కుదించారు. వృత్తి విద్య, సాంకేతిక కోర్సులకు (అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్) సంబంధించిన మెరిట్-కమ్-మీన్స్ స్కాలర్‌షిప్పుల విషయంలోనూ ఇంతే. గత సంవత్సరం రూ.33.80 కోట్లు కేటాయించగా ఇప్పుడు రూ.7.34 కోట్లు ఇచ్చారు. విదేశీ విద్య అభ్యసించే వారికి అందించే రుణాలపై వడ్డీ సబ్సిడీని కూడా రూ.15.30 కోట్ల నుండి రూ.8.16 కోట్లకు తగ్గించారు. మదర్సాలపై మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న శతృత్వ వైఖరి ఇటీవలి బడ్జెట్లలో స్పష్టంగా కన్పిస్తోంది.

మాటలకే పరిమితమైన 'సబ్‌కా సాత్... సబ్‌కా వికాస్'

2023-24లో మదర్సాలు, మైనారిటీల విద్యా పథకాలకు నిధుల కేటాయింపును ఏకంగా 93 శాతం తగ్గించి కేవలం రూ.10 కోట్లు విదిల్చారు. 2024-25లో దానిలో మరింత కోత పెట్టి రూ.2 కోట్లకు కుదించారు. ఈ ఏడాది పథకానికి కేటాయించింది కేవలం 0.01 కోట్లు మాత్రమే. మైనారిటీలకు అందించే స్కాలర్‌షిప్పుల్లో కూడా కోతలు పడుతున్నాయి. 2024-25లో మైనారిటీ విద్యకు సంబంధించి ఆరు పథకాలకు ప్రభుత్వం రూ.1,575.72 కోట్లు కేటాయించింది. కానీ విడుదల చేసింది మాత్రం రూ.517.20 కోట్లే. ఖర్చుకు సంబంధించిన గణాంకాలు మరింత ఆందోళన కలిగించవచ్చు. ఉదాహరణకు 2023-24లో రూ.1,689 కోట్ల బడ్జెట్ ప్రకటించారు. విడుదల చేసింది రూ.1,500 కోట్లు. అందులోనూ ఖర్చు చేసింది రూ.428.74 కోట్లు మాత్రమే. పథకాల అమలు కోసం ఈ ఏడాది ప్రభుత్వం రూ.678.03 కోట్లు కేటాయించింది.

ఇందులో ఎంత విడుదల చేస్తారు, ఎంత ఖర్చు చేస్తారు అనేది చూడాల్సి ఉంది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోడీ మైనారిటీ విద్యార్థుల స్కాలర్‌షిప్పుల రాజ్యాంగబద్ధతను ప్రశ్నించారు. గుజరాత్‌లో అనేక సంవత్సరాల పాటు మైనారిటీలకు కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్పులను నిరాకరించారు.

పథకాలకు చెల్లుచీటీ

మైనారిటీల కోసం ఉద్దేశించిన అనేక ముఖ్యమైన పథకాలను మోడీ ప్రభుత్వం శాశ్వతంగా ఆపేసింది. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, నై మంజిల్, ఉస్తాద్, మైనారిటీ మహిళల్లో నాయకత్వ సామర్థ్యాన్ని పెంచే పథకం, హమారీ ధరోహర్ వంటి కార్యక్రమాలు ఇప్పటికే నిలిచిపోయాయి. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే ప్రిలిమ్స్ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ విద్యార్థులకు మద్దతుగా అందిస్తున్న కీలక కార్యక్రమాలు కూడా ఆగిపో యాయి. మౌలానా ఆజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, నేషనల్ మైనారిటీ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు గత సంవత్సరం బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయింపు జరగలేదు. ఈ ఏడాది కూడా అదే తంతు కొనసాగింది.

వక్ఫ్ పథకాలకు కూడా...

స్కాలర్‌షిప్పుల విషయం ఇలా ఉంటే వక్ఫ్ పథకాలకు కూడా బడ్జెట్‌లో కోతలు పెట్టారు. వీటిలో క్వామీ వక్ఫ్ బోర్డ్ తరఖియతి, షహీ వక్ఫ్ సంపత్తి వికాస్ యోజన ఉన్నాయి. ప్రారంభంలో ఈ రెండు పథకాలకు వేర్వేరుగా నిధులు కేటాయించే వారు. 2020-21లో మోడీ ప్రభుత్వం బడ్జెట్‌ను తగ్గించి, ఈ రెండింటినీ కలిపేసింది. 2023-24లో ఈ పథకాలకు రూ.17 కోట్ల కేటాయించారు. అందులో రూ.8 కోట్లు విడుదల చేశారు. కానీ వాస్తవానికి ఖర్చు చేసింది రూ.0.10 కోట్లే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోరూ. 16 కోట్ల బడ్జెట్‌ను ప్రకటించి, రూ.3.07 కోట్లు మాత్రమే విడుదల చేశారు. తాజా బడ్జెట్‌లో ఈ రెండు పథకాలకూ కేటాయింపును రూ.13 కోట్లకు కుదించారు.

కేటాయింపు ఘనం...విడుదల స్వల్పం

గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది మైనారిటీల బడ్జెట్ స్వల్పంగా పెరిగిన మాట వాస్తవమే. అయితే మైనారిటీల కోసం అమలు చేస్తున్న అనేక పథకాలకు గణనీయంగా కోత పెట్టారు.

పైగా కేటాయింపులకు, నిధుల విడుదలకు మధ్య బాగా వ్యత్యాసం ఉంటోంది. 2024-25లో మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు రూ.3,183.24 కోట్లు కేటాయించి సమీక్ష అనంతరం రూ.1,868.18 కోట్లు మాత్రమే విడుదల చేశారు. తాజా బడ్జెట్‌లో రూ.3,350 కోట్ల కేటాయింపులు జరిగాయి. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ పథకాలకు కేటాయింపుల్లో పెడుతున్న భారీ కోతలను గమనిస్తే అసలు ఆ శాఖనే పూర్తిగా రద్దు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నదేమో అనిపిస్తుంది.

అది స్వర్గధామం కాదు...నరకం !

ఇళ్లు, పొలాలు అమ్మి... అప్పు చేసి అమెరికాకు పయనం

నిండా ముంచిన ఏజెంట్లు

దొడ్డిదారిన అగ్రరాజ్యంలో ప్రవేశం

తిప్పి పంపుతున్న అధికారులు

అప్పుల పాలై వీధిన పడిన కుటుంబాలు



చండీఘర్ : నిరుద్యోగ యువతకు అమెరికా ఓ స్వర్గధామం. అక్కడికి వెళితే చాలు...కోట్లు కూడబెట్టి జీవితంలో హాయిగా స్థిరపడి పోవచ్చునని కలలు కంటారు. చట్టబద్ధంగా అమెరికా వెళ్లి ఉద్యోగాలు చేసుకుంటూ సుఖవంతమైన జీవితం గడుపుతున్న వారు కొందరైతే అక్రమ మార్గాల్లో అక్కడికి చేరుకొని నానా ఇబ్బందులు పడుతూ క్షణక్షణం భయంభయంగా గడుపుతున్న వారు ఎందరో. వీరందరూ ట్రావెల్ ఏజెంట్ల తీపి కబుర్లు నమ్మి నిండా మునిగిపోతున్నారు. ఇళ్లు, పొలాలు అమ్ముకునో...వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసో ఆ డబ్బును ఏజెంట్ల చేతిలో పోసి దారుణంగా మోసపోతున్నారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకొని ఏం ప్రయోజనం? అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ చూపు ఇప్పుడు ఈ అక్రమ వలసదారులపై పడింది. ఇంకేముంది? వారు ఎక్కడున్నా జల్లెడ పట్టి బంధించి స్వదేశానికి పంపుతున్నారు. ఓ వైపు అప్పుల భారం, మరోవైపు అగమ్యగోచరంగా కన్పిస్తున్న భవిష్యత్తు...ఆ కుటుంబాలను వీధిన పడేస్తున్నాయి. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయ వలసదారులను ట్రంప్ ప్రభుత్వం బుధవారం బలవంతంగా సైనిక విమానాల్లో స్వదేశానికి పంపిన విషయం తెలిసిందే. తమ పిల్లల్ని అమెరికా పంపడానికి అప్పులు చేశామని, భూములు, ఇళ్లు అమ్ముకున్నామని తల్లిదండ్రులు వాపోతున్నారు. కలలన్నీ కల్లలవడంతో ఇప్పుడు ఆ అప్పులు ఎలా తీర్చాలంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. పిల్లల్ని దొడ్డిదారిన అమెరికా పంపడానికి వారు రూ.40-60 లక్షలు అప్పు చేసి ఏజెంట్ల చేతిలో పోశారు. అదే ఇప్పుడు కొంప ముంచింది. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయుల్ని గుర్తించి స్వదేశానికి పంపాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. అక్రమ వలసదారుల్ని జల్లెడ పడుతున్న అమెరికా అధికారులు వారిని గుర్తించిన వెంటనే అమానుషంగా కాళ్లను తాళ్లతో కట్టేసి సైనిక వాహనాల్లో భారత్‌కు పంపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమను ఇక ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఎవరిని కదిలించినా కన్నీటి కథలు, వ్యథలే వినిపిస్తున్నాయి. గురుప్రీత్ సింగ్ అనే యువకుడు ఆరు నెలల క్రితమే అమెరికా వెళ్లాడు. అతనిని వెనక్కి పంపుతున్నారని కుటుంబానికి బుధవారమే తెలిసింది. 'ఇప్పుడు మాకు ఇల్లు లేదు. బంధువులు, స్నేహితుల నుండి రూ.45 లక్షలు అప్పు తీసుకొని అతనికి పంపాము. ఇప్పుడు ప్రభుత్వం ఆదుకుంటేనే బతకగలం. లేకుంటే అంతే' అని కుటుంబ సభ్యుడొకరు తెలిపారు.

అమెరికా వెళ్లిన ఆకాశ్‌దీప్ సింగ్ అనే యువకుడి ఆచూకీ తెలియడం లేదు. తన కుమారుడిని పంపడానికి రూ.60 లక్షలు ఖర్చు చేశామని అతని తండ్రి తెలిపారు. డబ్బు పోయినా ఫర్వాలేదు...వాడు తిరిగి వస్తే అదే పదివేలు అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. జస్వీందర్ సింగ్ అనే యువకుడు రూ.50 లక్షలు అప్పు చేసి జనవరిలో అమెరికా వెళ్లాడు. అక్కడ బాగా సంపాదించి తమ కష్టాలు తీరుస్తాడని తల్లిదండ్రులు ఆశించారు. కానీ ఇలా జరుగుతుందని అనుకోలేదని వాపోయారు. తన భర్త హర్వీందర్ సింగ్ 10 నెలల క్రితం అమెరికా వెళ్లాడని అతని భార్య చెప్పారు. 'నా భర్త ఎప్పుడు తిరిగి వస్తాడు? చట్టబద్ధంగానే తన భర్తను పంపానని ఏజెంట్ చెబుతున్నాడు. కానీ దొడ్డిదారిన పంపాడని ఇప్పుడు అర్థమవుతోంది. అమెరికాలో నా భర్త పరిస్థితి భయానకంగా ఉంది' అని ఆమె వివరించారు. భర్తను అమెరికా పంపడం కోసం అప్పు చేశానని, ఇప్పుడు ఇంటి వద్ద ఇద్దరు పిల్లలు, మామ, భర్త సోదరుడు ఉన్నారని, కొద్దిపాటి భూమి, పాడి గేదెలు మినహా తమకు మరేమీ లేవని తెలిపారు. ప్రదీప్ అనే యువకుడిని అమెరికా పంపడానికి అతని తల్లిదండ్రులు అర ఎకరం పొలం అమ్మేశారు. కొంత అప్పు కూడా చేశారు. 'ఇప్పుడు మా కుటుంబమంతా ఆందోళనలో ఉంది. మేము ఏం చేయాలి? ఆరు నెలల క్రితం అమెరికా వెళ్లాడు. ఏజెంట్‌ని అడిగితే అంతా బాగానే ఉందని చెప్పాడు' అని ప్రదీప్ తల్లి తెలిపారు. తిరిగి వచ్చిన వారితో మాట్లాడానని, దుబాయ్‌కి చెందిన ట్రావెల్ ఏజెంట్లు తమను అమెరికా పంపారని వారు చెప్పారని ఎన్ఆర్ఐ వ్యవహారాల పంజాబ్ మంత్రి కులదీప్ సింగ్ ధాలీవాల్ తెలిపారు. ఒప్పందాలన్నీ ఫోన్ ద్వారానే జరిగాయని అన్నారు. 'ఇక్కడి యువతను ముందుగా దుబాయ్ పంపారు. ఆ తర్వాత బ్రిటన్ సహా వేర్వేరు దేశాల మీదుగా అమెరికా పంపారు. వారిలో కొందరి వద్ద కెనడా వీసా కూడా ఉంది' అని చెప్పారు.

ఇక పనామా కాలువలో ప్రయాణానికి చార్జీల్లేవు

- ప్రకటించిన ట్రంప్ సర్కార్
- అలాంటిదేమీ లేదన్న పనామా అథారిటీ
- నేడు మరో విడత చర్చలు

వాషింగ్టన్ : అధ్యక్షుడు ట్రంప్ తీసుకువచ్చిన ఒత్తిడి నేపథ్యంలో పనామా కాలువ గుండా అమెరికా నౌకలు ఇక చార్జీలు లేకుండా ప్రయాణించవచ్చని ప్రభుత్వం బుధవారం తెలిపింది. ఇకపై ఎలాంటి ఛార్జీలు లేకుండా అమెరికా ఓడలు కాలవ గుండా ప్రయాణించవచ్చని, తద్వారా ఏడాదిలో లక్షలాది డాలర్లు ఆదా చేయవచ్చని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. ఆదివారం తాను జరిపిన చర్చల సందర్భంగా పనామా రాయితీలు ఇవ్వడానికి అంగీకరించిందని విదేశాంగ మంత్రి మార్కో రూబియో చెప్పారు. అయితే ఈ ప్రకటనను పనామా కాలవ అధికార యంత్రాంగం తిరస్కరించింది. ఎలాంటి ఒప్పందం కుదరలేదని స్పష్టం చేసింది. అట్లాంటిక్, పసిఫిక్ మహా సముద్రాలను కలిపే ఈ కీలమైన కాలువను నిర్వహించే పనామా కెనాల్ అథారిటీ ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. కాలువ గుండా వెళ్ళే ఓడలకు టోల్స్, ఇతర ఫీజులు వసూలు చేసే అధికారం ఈ యంత్రాంగానికి వుంది. ట్రంప్ సర్కార్‌కు ఫీజుల విషయంలో తామెలాంటి సద్దుబాట్లు చేయలేదని స్పష్టం చేసింది. అమెరికా అధికారులతో చర్చలు జరపడానికి సిద్ధంగా వున్నామని తెలిపింది. కీలకమైన ఈ జల మార్గాన్ని పరిరక్షించే స్థానంలో వున్న అమెరికా నుండి ఇలా ఫీజులు వసూలు చేయడం సరైన చర్య కాదని పనామా అథారిటీకి స్పష్టం చేసినట్లు రూబియో తెలిపారు. శుక్రవారం కాలవపై కొత్తగా చర్చలు జరపడానికి ఇరు పక్షాలు సిద్ధంగా వున్నాయి. గత నవంబరులో అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుండి బల ప్రయోగంతోనైనా కాలువను స్వాధీనం చేసుకునే అవకాశం వుందని ట్రంప్ చెబుతూ వస్తున్నారు. ఈ కాలువ గుండా 40శాతం అమెరికన్ కంటెయినర్లు ప్రయాణిస్తాయి.

గాజాలోకి 10వేలకు పైగా సహాయ ట్రక్కులు

జెనీవా : గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 10వేలకు పైగా సహాయ ట్రక్కులు గాజాకు చేరుకున్నాయని ఐక్యరాజ్య సమితి మానవతా సహాయ చీఫ్ టామ్ ఫ్లెచర్ గురువారం తెలిపారు. కేవలం రెండు వారాల్లోనే ఈ ట్రక్కులను పంపినట్లు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. సాయం తీసుకెళుతున్న కాన్వాయ్‌తో పాటు తాను కూడా ఉత్తర గాజాకు వెళ్లినట్లు ఆయన తెలిపారు. కీలకమైన, ప్రాణాధార మందులు, ఆహారం, శిబిరాలను ఈ ట్రక్కుల్లో పంపడాన్ని సాధ్యం చేసిన అనేకమందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలని ఆయన పేర్కొన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం రెండో దశపై చర్చలు జరపడానికి ఇజ్రాయిల్, హమాస్ సన్నద్ధమవుతున్న వేళ ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. గత 15మాసాలుగా సాగిన ఈ దాడుల్లో గాజాలో 47,518మంది మరణించారు. లక్షకు పైగా క్షతగాత్రులయ్యారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదరడానికి ముందు చాలా స్వల్ప మొత్తంలోనే సాయం అందుతుండడంతో గాజాలో



ముఖ్యంగా ఉత్తర గాజాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని అంతర్జాతీయ సహాయ సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. తాజాగా ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఆహారం, ఇంధనం, వైద్య, ఇతర రకాల సాయం అందడంతో పాటూ ఇతర ప్రాంతాలకు తరలివెళ్ళిన వారు పెద్ద సంఖ్యలో స్వస్థలాలకు తిరిగి రావడానికి సాధ్యమైంది.

సంపాదకీయం

'కూలి'న బతుకులు



పొట్టచేతబట్టుకుని.. పట్టెడన్నానికి పట్నానికి వచ్చి.. ఉండటానికి నీడలేక.. అద్దె ఇంట్లో ఆపసోపాలు పడుతూ.. అడ్డా కూలీలుగా మారి.. దొరికిన పనులతో కాలం వెళ్లదీస్తున్న బడుగు జీవులు.. ఎండను లెక్క చేయకుండా.. చెమటతో తడుస్తూ... భార్యాపిల్లలను తలచుకుంటూ మట్టిలో మట్టిలా కలిసి పనిచేస్తున్న వారిని ఆ మట్టే కనికరంలేని మృత్యువుగా కబళించింది. అప్పటివరకు సందడిగా ఉన్న ఆ ప్రాంతంలో క్షణాల్లో విషాదం అలుముకుంది. తేరుకునేలోపే మట్టిపెల్లల కింద మూడు ప్రాణాలు సజీవ సమాధయ్యాయి.

నగరంలో భవన నిర్మాణాల్లో నాణ్యత, నిర్మాణ కూలీల భద్రత గాలిలో దీపంలా మారుతున్నాయి. అనుమతులు లేకుండా నిర్మించే భవనాలు, సెల్లార్ తవ్వకాలు ప్రమాదకరంగా మారి ప్రాణాలను కబళిస్తున్నాయి. ఎల్బీనగర్‌లో బుధవారం చోటుచేసుకున్న సెల్లారు ప్రమాదంలో అధికారుల, నిర్మాణదారుల నిర్లక్ష్యం మరోసారి బహిర్గతమైంది. నగరంలో అటు రోడ్డు అంచు వరకు, ఇటు పక్కనున్న ప్లాటు పునాదుల వరకు సెల్లారును తవ్వడం షరామామూలైంది. నెల కిందట గచ్చిబౌలి సిద్ధిఖీనగర్‌లో ఇలాగే చేయడంతో పక్కనున్న ఐదంతస్తుల భవనం నేలమట్టమైంది. ఇలాంటి సందర్భాల్లో అధికారులు తాఖీదుల పేరుతో తమ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకుంటున్నారు. ముందు తేదీలతో నోటీసులిస్తున్నారు. అనుమతులను ఆన్‌లైన్‌లో ఇచ్చి.. నోటీసులను భౌతికంగా ఇవ్వడమే అందుకు నిదర్శనం. అక్రమ నిర్మాణాల రిజిస్టరు నిర్వహణ, డిజిటల్ నోటీసులకు ప్రణాళిక విభాగం ప్రాముఖ్యత ఇవ్వట్లేదు. ఏదేనీ నిర్మాణాన్ని కూల్చివేసే ముందు.. పాత తేదీలతో నోటీసులిచ్చి.. ఒకేసారి కూల్చడం పరిపాటిగా మారిపోయింది. ఇది సర్వత్ర ఆందోళన కలిగిస్తోంది.


స్థలం మొత్తాన్ని వినియోగించుకోవాలనే దురాశతో సెల్లార్ కోసం మట్టిని ప్లాటు అంచుల వరకు తవ్వేస్తున్నారు. పిల్లరు బెడ్డుల కోసం.. 25అడుగుల లోతున, ఒకటిన్నర మీటరు పొడవున ఎలుకలు బొరియలు పెట్టినట్టుగా మట్టిని తొలగిస్తున్నారు. ఇవేవీ తవ్వకం ఇంజినీరు పర్యవేక్షణలో జరగటం లేదు. అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. భవన నిర్మాణాల్లో బిల్డర్ల ఉల్లంఘనలు, అధికారుల ఆమ్యామ్యాలు అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. ఏదైనా జరిగితే మొక్కుబడి నోటీసులివ్వడం, నాలుగు రోజులు హడావిడి చేయడం తరువాత చేతులు దులుపుకుంటున్నారే తప్ప కనీసం పశ్చాత్తాపం కూడా చెందడం లేదు. బిల్డర్లు, అధికారులకు మధ్యనున్న "ఆర్థిక సంబంధాలే" ఇందుకు కారణమనే ఆరోపణలు షరా"మామూలు"గా మారాయి.

అసంఘటిత కార్మికులు నగరాలపై ఆధారపడ్డ తర్వాత భార్యా భర్తలిద్దరూ పని చేయాలి. చాలీచాలని జీతం.. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి. చాలామంది తమ పిల్లల్ని చదివించలేక మధ్యలోనే చదువు ఆపేసి పనుల్లో పెడుతున్నారు. దాంతో మంచి చదువులు చదువుకుని ఉద్యోగాలు చేయాల్సిన యువత కార్మికులుగా మిగిలిపోయి కష్టం చేసి బతుకుతున్నారు. అనారోగ్యం.. అనుకోని దుర్ఘటన జరిగినా ఇక వారి పరిస్థితి.. వారి కుటుంబ పరిస్థితి దయనీయమే. నిన్నటి ఎల్బీనగర్ ఘటనలో కూడా అదే జరిగింది. ఒకే కుటుంబం ముగ్గురిని కోల్పోయింది. రెక్కల కష్టంపై ఆధారపడి జీవనం సాగించే కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసింది. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం చూడాల్సిన కార్మికశాఖ వారికి కనీసమాత్రంగా కూడా భరోసా ఇవ్వలేకపోతోంది. కనీస వేతన చట్టం సవరణ చేయకుండా, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకుండా, కనీస పనిగంటలు అమలు చేయకుండా, కార్మికుల సామాజిక, ఆర్థిక భద్రతను కాపాడకుండా ఉత్పత్తి, సేవా రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను వంచిస్తూ కేంద్రంలోని బీజేపీ సర్కారు కార్పొరేట్, ప్రయివేట్ సంస్థలకే కొమ్ముకాస్తున్నది.

అసలు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం, అభివృద్ధి తమ పని కాదన్నట్టుగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. పని ప్రదేశంలో, నిత్య జీవితంలో కార్మికులు ఎదుర్కొనే చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కరించలేని దీనావస్థకు చేరాయి. కార్మికుల న్యాయమైన కోర్కెలు, డిమాండ్లను కూడా పరిష్కరించలేనంతగా కార్మిక శాఖ నిర్వీర్యమైపోతోంది. గ్రామాల నుంచి బతుకు తెరువు కోసం వలసలు వచ్చిన కార్మికులకు నగరాల్లో కూడా బతుకు గగనమే అవుతుంది. కనీస గుర్తింపు కార్డులు కూడా లేని వారు ఎంతోమంది. ఇలాంటి వారందరిని ప్రభుత్వం గుర్తించి డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, రేషన్ కార్డులు, విద్యా, వైద్య సౌకర్యాలు కల్పించాలి. నగరాల్లో కూడా ఉపాధి హామీ పథకం అమలు చేస్తే ఇటువంటి అసంఘటిత కార్మికులకు కొంతపని దొరుకుతుందన్న మేధావులు సూచనలను కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకోవాలి. అన్నిటికీ మించి ఇలాంటి ఘటనలు, మరణాలు సంభవించకుండా నిబంధనలను కఠినంగా అమలుచేయాలి. నిర్మాణాల్లో ఆక్రమాలనూ అవకతవకలను నివారించాలి. అప్పుడైనా ఇలాంటి బతుకులకు భరోసా దొరుకుతుందని ఆశిద్దాం.

అసంఘటిత కార్మికులు నగరాలపై ఆధారపడ్డ తర్వాత భార్యా భర్తలిద్దరూ పని చేయాలి. చాలీచాలని జీతం.. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి. చాలామంది తమ పిల్లల్ని చదివించలేక మధ్యలోనే చదువు ఆపేసి పనుల్లో పెడుతున్నారు. దాంతో మంచి చదువులు చదువుకుని ఉద్యోగాలు చేయాల్సిన యువత కార్మికులుగా మిగిలిపోయి కష్టం చేసి బతుకుతున్నారు. అనారోగ్యం.. అనుకోని దుర్ఘటన జరిగినా ఇక వారి పరిస్థితి.. వారి కుటుంబ పరిస్థితి దయనీయమే. నిన్నటి ఎల్బీనగర్ ఘటనలో కూడా అదే జరిగింది. ఒకే కుటుంబం ముగ్గురిని కోల్పోయింది.

లలైసింగ్ జీవన సంఘర్షణ మనకు ఆదర్శం!



డాక్టర్ దేవరాజు మహారాజు

భీడ్ హమేషా తమాషా దేఖ్‌తీ హై
క్రాంతి తో ఏక్ హీ వ్యక్తి లాతా హై

సమూహం ఎప్పుడైనా తమాషా చూస్తుంది. మార్పు, పరివర్తన, విప్లవం వంటివి తేవడం ఒకే ఒక్కవ్యక్తికి సాధ్యమవుతుంది! సత్యాన్వేషణలో ఎంతకైనా తెగించడం, దేశభక్తి కలిగి ఉండటం, తర్కబద్ధంగా ఆలోచిస్తూ అంధ విశ్వాసాల్ని అంతం చేయడం, మానవత్వానికి ఉదాహరణగా నిలవడం.. లలైసింగ్ బౌద్ధ జీవన సంఘర్షణ మనకు తెలియజేస్తుంది.

మనుషుల్ని ముట్టుకుంటే అపవిత్రులవు తున్నారంటే- దేవుడు లేడని అర్థం - అని అన్నాడు లలైసింగ్ బౌద్ధ (1 సెప్టెంబర్ 1911-7 ఫిబ్రవరి 1993). ఉత్తరభారత పెరియార్‌గా ప్రసిద్ధుడైన ఆయన గురించి దక్షిణ భారత ప్రజలకు పెద్దగా తెలియదు. పెరియార్ ఇ.వి. రామసామి ఉత్తర భారతదేశంలో పర్యటిస్తున్నప్పుడు లలైసింగ్ రెండు మూడు పర్యాయాలు ఆయన్ను కలిశాడు. ఆయన రచనలకు ప్రభావితుడై, ఆయనకు అనుయాయుడై పోయాడు. మరోవైపు మహాత్మాఫూలే, సావిత్రీబాయిఫూలే, డా.బి.ఆర్.అంబేద్కర్‌ల ఆలోచనా ధోరణిని, జీవన విధానాన్ని, సంఘర్షణల్ని ఆదర్శంగా తీసుకుని తను కూడా సామాజికరంగంలో స్వేచ్ఛ, సమానత్వం కోసం నిరంతరం సంఘ ర్షించాడు. వ్యక్తిగతంగా ఎన్ని కష్టాలెదురైనా తన ధ్యేయం నుండి దృష్టి మరల్చలేదు. పెరియార్ ఇ.వి. రామసామి రచన 'రామాయణ్ పార్ట్ థెరంగల్'(ద రామాయణ ఎ ట్రూ రీడింగ్)ను హిందీలోకి తొలిసారి అనువదించి ప్రచురిస్తే- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పుస్తకాల ప్రతుల్ని జప్తుచేసింది. లలైసింగ్ హైకోర్టు, సుప్రీంకోర్టులలో రెండుచోట్లా రాష్ట్ర ప్రభుత్వంపై విజయం సాధించి, ఒక వైపు బహుజన నాయకుడిగా - మరోవైపు స్వాతంత్ర్యయోధుడిగా నిలిచాడు. సామాజికన్యాయం కోసం జీవితాంతం మొక్కవోని ధైర్య సాహసాలతో ఒంటరిగా పోరాడుతూ వచ్చాడు. ప్రచురణ కర్తలెవరూ ప్రచురించకపోవడంతో 'సచ్చి రామాయణ్' ప్రచురణ కోసం తన పదిహేనెకరాల భూమిని అమ్మి, తనే ఒక ప్రెస్‌ను ఏర్పాటు చేసుకున్నాడు.

మారుమూల గ్రామమైన తన కఠారాలో కాకుండా అక్కడికి కొన్ని మైళ్ల దూరంలో ఉన్న ఒక రైల్వేస్టేషన్ ప్రాంతంలో వరుసగా మూడు గదులు కట్టించాడు. ఒక దాంట్లో ప్రెస్, మరోగదిలో పుస్తకాల షాపు, ఇంకో గది తను ఉండడానికి ఏర్పాటు చేసుకున్నాడు. ప్రెస్‌పేరు 'సస్తాప్రెస్' ; పుస్తకాల షాపు అశోకచక్రవర్తి పేరుతో 'అశోకా పుస్తకాలయ్'- అని పెట్టాడు. ఈయన అచ్చేస్తున్న పుస్తకాలు, చెపుతున్న విషయాలు మనువాదులకు భరించలేనివిగా ఉండేవి. అనేకసార్లు దొంగచాటుగా దెబ్బతీయాలని, చంపాలని కుట్రలు పన్నారు.

కుటుంబంలో తనకంటూ ఎవరూ లేకపోయినా, తనను, తన ఆలోచనలను బలపరిచేవారు సమాజంలో చాలామంది ఉన్నారన్న ఆత్మవిశ్వాసంతో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఒంటరిగానే తిరిగేవాడు. ఎప్పుడూ భుజానికి ఒక సంచి ఉండేది. అందులో పుస్తకాలు, తెల్ల కాగితాలు పెన్ను ఉండేవి.

పెరియార్ ఆలోచనా విధానంలో పడిపోయి ఆధోరణిలోనే లలైసింగ్ తన స్వీయరచనలు కూడా వెలువరిస్తూ వచ్చాడు. శంభుక వధ, అంగులీమల, ఏకలవ్య, సిపాయీ క త బాహీ, ఆదివాసోంకి పహిచాన్; ఆర్యోంక నైతిక్ మల్ ప్రకాశ్; సోశితోం పర్ ధార్మిక్ డెకాయిటీ (అణగారిన వర్గాల మీద ధార్మిక దోపిడీ) సోశితం పర్ నైతిక్ డెకాయిటీ; సామాజిక విలంబిత్ కైసే సమాప్త్? సామాజిక న్యాయం కోసం జరిగే ఈ ఆలస్యం ఎలా సమాప్త మౌతుంది?); సచ్చీ రామాయణ్‌కి చాబి (వాస్తవ రామాయణాన్ని తెరవడానికి తాళం చెవి) ఇవన్నీ నాటకాల రూపంలో, సంభాషణల రూపంలో ఉన్నాయి గనక గ్రామీణ ప్రజలకు బాగా నచ్చేవి. నవలలు, వ్యాసాల కన్నా నాటికల రూపంలో అయితే గ్రామీణుల్ని చైతన్యపరచడానికి బావుంటాయని ఈ రచయిత భావన. క్షేత్రస్థాయిలో జనంతో ఉండి జీవితాంతం సంఘర్షించిన ఈ సామాజిక విప్లవకారుడి గురించి ప్రముఖ పత్రికలేవీ రాయలేదు. వికీపీడియాలో గాని, గుగూల్‌లో గానీ సమాచారం లేదు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడెమీలు ఈయన రచనల్ని పట్టించుకోలేదు. అయితే లలైసింగ్ జీవన సంఘర్షణను ప్రజాగాయకులు గానం చేశారు. ప్రజాకళాకారులు కొంత వరకు ఆయనను పరిచయం చేస్తూ వచ్చారు. మొత్తానికి మొత్తంగా బ్రాహ్మణవాదానికి భజన చేసే రచయితలు, పత్రికలు, రాజకీయ నాయకులు ప్రబలిపోయిన కారణంగా, అందుకు విరుద్ధంగా పనిచేసే లలైసింగ్ లాంటి వారి గూర్చి ఎవరైనా ఎందుకు పట్టించుకుంటారూ?

మాన్యవర్ కాన్షీరామ్ లలైసింగ్ గురించి తెలుసుకుని, అతని ఫొటోలు- తన పోస్టర్స్‌లో ముద్రించడం వల్ల, తన ప్రసంగాలలో తరచూ అతని ప్రసక్తి తెస్తూ ఉండడం వల్ల కొంత ప్రచారం జరిగింది. 'మిలే ములాయం కాన్షీరాం/ హవా మె ఉడ్ గయె జై శ్రీరామ్' అనే నినాదం ఉధృతమై బహు జనులకు రాజ్యాధికారం దక్కుతుందన్న ఆశాభావం బలపడింది. ఉత్తరప్రదేశ్‌లో యాదవులకు అధికారం కూడా దక్కింది. కానీ, వారు వారి స్వార్థ ప్రయోజ నాలు చూసుకున్నారే తప్ప, బహుజనుల ప్రయోజనాల్ని పట్టించుకోలేదు. బ్రాహ్మణవాదానికి వ్యతిరేకంగా పోరాడనూ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో లలైసింగ్ జీవన సంఘర్షణను మొత్తానికి మొత్తంగా వెలుగులోకి తేవడానికి ఒక పరిశోధక విద్యార్థి పూనుకున్నాడు. అతని పేరు ధరమ్ వీర్ యాదవ్. పెరియార్ ఇ.వి.రామసామి, లలైసింగ్‌ల అడుగుజాడల్లో నడిచే ఈ పరిశోధకుడు కులం గుర్తింపు యాదవ్‌ను వదిలేసి తనకు తానే ధరమ్ వీర్ గగన్ అని పెట్టుకున్నాడు. ఢిల్లీలో పి.జి., హైద్రాబాద్ యూనివర్సిటీలో యం.ఫిల్ చేసిన ఈ యువ పరిశోధకుడు లలైసింగ్ పనిచేసిన సంస్థలన్నీ సందర్శించి, అతనితో కలిసి పనిచేసిన సహ ఉద్యోగుల్ని ఇంటర్వ్యూ చేసి, ఎందరో ప్రజా కళాకారుల ప్రదర్శనలు చూసి, సుదీర్ఘకాల శోధించి ఢిల్లీ జె.ఎన్.యూ నుండి పిహెచ్.డి సాధించాడు. ఆయన సేకరించిన సమాచారమంతా ఒక క్రమపద్ధతిలో పెట్టి ఐదు సంపుటాలుగా రెండు వేల పేజీల్లో నమోదు చేశాడు. ఆ సంపుటాలు పాఠకులకు అందుబాటులోకి వచ్చాయి. ఉత్తర భారత పెరియార్' గా గుర్తింపు పొందిన లలైసింగ్ జీవిత సంఘర్షణ కాలగర్భంలో కలిసిపోకుండా డాక్టర్ ధరమ్ వీర్ గగన్ అడ్డుకున్నాడు.

లలైసింగ్ మానవత్వం గురించి చెప్పుకోవడానికి ఒక సంఘటన చూద్దాం - ఒకసారి ఆయన స్వగ్రామం కఠోరాలో నీటి ఎద్దడి ఏర్పడింది. లలైసింగ్ మిత్రుడు మంగల్ సింగ్ అని ఉండేవాడు. అతను వాల్మీకి, పైగా సఫాయి కర్మచారి. అతనంటే ఊరి పెద్దలకు చిన్నచూపు. అతణ్ణి ఒరేయ్ మంగలియా అని పిలిచేవారు. ఆ కరువు రోజుల్లో మంగలియా బావి ఎండిపోయింది. అతను నీటి కోసం యాదవ్‌ల బావి దగ్గరికి వెళ్లాడు. యాదవులు చూసి ఈసడించుకున్నారు. తక్కువ జాతివాడు అందులో సఫాయి కార్మికుడు. మంగలియా గనక తమ బావిని ముట్టుకుంటే అది అపవిత్రమౌతుందనే నానా మాటలని వెనక్కి పంపించారు. విషయం తెలుసుకుని లలైసింగ్ యాదవ్ తన వంతు నీరు తోడుకుని తెచ్చి, తన ఇంట్లో పెట్టేవాడు. మళ్లీ తన ఇంటి నుండి మంగలియాకు ఇచ్చేవాడు. అలా ఆ కరువు రోజుల్లో వాల్మీకి జాతి కుటుంబాలను లలైసింగ్ ఆదుకున్నాడు. ఈ వివక్షను అంతం చేయాలని మనసులో దృఢంగా అనుకున్నాడు. ఓరోజు బ్లాక్ ఆఫీసుకు వెళ్లి, అధికారులతో మాట్లాడి వాల్మీకి కుటుంబాలకు నీరులేదని వెంటనే అక్కడ ఒక బావి తవ్వించాలని అప్లికేషన్ పెట్టాడు. ప్రభుత్వం పూనుకుంటే తను కూడా వ్యక్తిగతంగా కొంత ఆర్థిక సహాయం చేస్తానని కూడా చెప్పాడు. అధికారులు అందుకు సమ్మతించి మంగల్‌సింగ్ వాల్మీకి ఇంటి దగ్గరలో ఎక్కువ లోతు బావి తవ్వించారు. కొద్దికాలానికే పరిస్థితి తిరగబడింది. ఈసారి యాదవుల బావి ఎండిపోయింది. దగ్గరలో మంగలియా కొత్తబావి తప్ప మరో బావి లేదు. విధి లేక యాదవులు మంగలియా దగ్గరికి వెళతారని ముందే ఊహించి, లలైసింగ్ మంగలియాకు ఒక సూచన చేశాడు. యాదవులు అతని బావిని ముట్టుకుంటే అపవిత్ర మౌతుందనీ, వారిని బావి దగ్గరకు రానివ్వద్దనీ చెప్పాడు.

"అయ్యో! నేను చిన్న కులం వాణ్ణి! అలా అని నేనెలా చెప్పగలనూ?"- అని మంగలియా కంగారుపడ్డాడు. "ఏం ఫరవాలేదు. అలాగే చెప్పు - ఊళ్లో ఈ వివక్ష, అస్పృశ్యత సమసిపోవాలంటే మనం ఒక్కోసారి కఠినంగా ఉండాలి" అని - ధైర్యం చెప్పాడు. అనుకున్నట్టుగానే యాదవులు బిందెలు, కుండలు తీసుకుని మంగలియా బావి దగ్గరికి వెళ్లారు. మంగల్‌సింగ్ అడ్డగించాడు. "నేను ముట్టుకుంటే మీ బావి అపవిత్రమైపోతుందని అన్నారు కదా? మరి ఇప్పుడు మీరు ముట్టుకుంటే నా బావి అపవిత్రమైపోదా? - వెళ్లండి! వెళ్లండి!!" - అని ఈసడించుకున్నాడు. యాదవులు అసలు విషయం గ్రహించారు. వీడికి ఇలా మాట్లాడే ధైర్యం లేదు. లలైసింగ్ వెనక ఉండి వీడితో ఇలా చెప్పిస్తున్నాడని గ్రహించి - అందరూ కలిసి లలైసింగ్ దగ్గరకు వెళ్లారు.

"మంగల్ సింగ్ అన్న దాంట్లో న్యాయం ఉంది కదా?" అన్నాడు లలైసింగ్- అతడు గొంతు తడుపు కోవడానికి గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వకుండా మీరు అప్పుడు అతణ్ణి తన్ని తరిమేశారు కదా? మరి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని నీళ్లకోసం అతని దగ్గరికి వెళ్లారూ?- అని ప్రశ్నించాడు. ఆ రోజుల్లో నేను బావి నుండి నీళ్లు- నా ఇంటికి మోసుకెళితే, నా ఇంటికొచ్చి మంగల్ సింగ్ నీళ్లు తీసుకుపోయేవాడు తెలుసా? అయినా, అంటూ, ముట్టూ, అపృశతా ఎక్కడ ఉన్నాయి? మీ మెదళ్లలో ఉన్నాయి. మీ మూర్ఖత్వంలో ఉన్నాయి. అవన్నీ ఆర్షబ్రాహ్మణులు కల్పిం చినవి. వాటిని అనుసరించడం మనకు అవసరమా? అందరం మనుషులమన్నది గ్రహిస్తే పరిష్కారం దొరుకుతుంది" అని చెప్పాడు లలైసింగ్. " ఏదో ఒకటి చేసి మా అందరి ప్రాణాలు నిలుపు. మాకు నీరు కావాలి!"- అన్నారందరూ.

అందుకు ఒకటే షరతు - ఊళ్లో అస్పృశ్యత పాటించగూడదు. అన్ని కులాల, అన్ని మతాలవారు కలిసిపోయి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలి. అందరి ఇళ్లకు అందరు వెళ్లాలి. మనమంతా మనుషులం- ఒకే జాతి వాళ్లమనేది అందరూ గ్రహించాలి!" - అన్నాడు లలైసింగ్. విషయం అర్థమై కొందరు, విధిలేక మరికొందరు "అలాగే. అలాగే చేద్దాం" అని అన్నారందరూ. లలైసింగ్ వెళ్లి మంగలియా బావిలోంచి యాదవులందరికీ మంచినీళ్లు ఇప్పిం చాడు. ఇలాంటి సంఘ సంస్కర్తలు ఎంతోమంది ఎన్నోరకాలుగా క్షేత్రస్థాయిలో ప్రయత్నిస్తూ ఉంటే కదా ఇప్పుడు మనం ఉంటున్న ఈ సమాజం ఏర్పడింది? దీన్ని మళ్లీ వెనక్కి నడిపించే వారిని పసిగట్టి, వారికి గట్టిగా బుద్ధి చెప్పాల్సిన తరుణం వచ్చేసింది!

'ఇతరులకు ఇవ్వడం వల్ల మనసులో ఒక రకమైన విశాలమైన భావన కలుగుతుంది. మనం జీవించే ప్రపంచాన్ని మన చర్యలే సృష్టిస్తాయి కాబట్టి, ఇవ్వడం అనే చర్య ద్వారా విశాలమైన ప్రపంచసృష్టి జరుగుతుంది!'- అని చెప్పింది బౌద్ధ ద్ధమ్మం.

- సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

మాన్యవర్ కాన్షీరామ్ లలైసింగ్ గురించి తెలుసుకుని, అతని ఫొటోలు- తన పోస్టర్స్‌లో ముద్రించడం వల్ల, తన ప్రసంగాలలో తరచూ అతని ప్రసక్తి తెస్తూ ఉండడం వల్ల కొంత ప్రచారం జరిగింది. 'మిలే ములాయం కాన్షీరాం/ హవా మె ఉడ్ గయె జై శ్రీరామ్' అనే నినాదం ఉధృతమై బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందన్న ఆశాభావం బలపడింది. ఉత్తరప్రదేశ్‌లో యాదవులకు అధికారం కూడా దక్కింది. కానీ, వారు వారి స్వార్థ ప్రయోజ నాలు చూసుకున్నారే తప్ప, బహుజనుల ప్రయోజనాల్ని పట్టించుకోలేదు. బ్రాహ్మణవాదానికి వ్యతిరేకంగా పోరాడనూ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో లలైసింగ్ జీవన సంఘర్షణను మొత్తానికి మొత్తంగా వెలుగులోకి తేవడానికి ఒక పరిశోధక విద్యార్థి పూనుకున్నాడు. అతని పేరు ధరమ్ వీర్ యాదవ్. పెరియార్ ఇ.వి.రామసామి, లలైసింగ్‌ల అడుగుజాడల్లో నడిచే ఈ పరిశోధకుడు కులం గుర్తింపు యాదవ్‌ను వదిలేసి తనకు తానే ధరమ్ వీర్ గగన్ అని పెట్టుకున్నాడు.

"మంగల్ సింగ్ అన్న దాంట్లో న్యాయం ఉంది కదా?" అన్నాడు లలైసింగ్- అతడు గొంతు తడుపు కోవడానికి గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వకుండా మీరు అప్పుడు అతణ్ణి తన్ని తరిమేశారు కదా? మరి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని నీళ్లకోసం అతని దగ్గరికి వెళ్లారూ?- అని ప్రశ్నించాడు. ఆ రోజుల్లో నేను బావి నుండి నీళ్లు- నా ఇంటికి మోసుకెళితే, నా ఇంటికొచ్చి మంగల్ సింగ్ నీళ్లు తీసుకుపోయేవాడు తెలుసా? అయినా, అంటూ, ముట్టూ, అపృశతా ఎక్కడ ఉన్నాయి? మీ మెదళ్లలో ఉన్నాయి. మీ మూర్ఖత్వంలో ఉన్నాయి. అవన్నీ ఆర్షబ్రాహ్మణులు కల్పిం చినవి. వాటిని అనుసరించడం మనకు అవసరమా? అందరం మనుషులమన్నది గ్రహిస్తే పరిష్కారం దొరుకుతుంది"

కేంద్ర బడ్జెట్ సామాన్యులకా, సంపన్నులకా?



కొండపల్లి శ్రీధర్
8639295777

77 సంవత్సరాల స్వాతంత్ర్యం, 75 వసంతాల గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్న వేళ ఇంకా భారతదేశం అసమానతలు, పేదరికం, నిరుద్యోగం, ఆహార భద్రత, విద్యావైద్యం అంశాల్లో అన్ని సూచికలు మన దేశ వెనుకబాటుతనాన్ని బయటపెడుతున్నవి ఈ నేపథ్యంలో సంక్షేమ పథకాల అమలు, ఆవశ్యకత, ఆర్థిక, సామాజిక అంశాల ప్రభావంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉన్నది. 1991లో ప్రపంచీకరణ విధానాలు దేశంలో ప్రారంభమైనప్పటి నుంచి ప్రజల జీవనస్థితిగతులు పడిపోయాయన్నది వాస్తవం. మోడీ నాయకత్వంలోని బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ పదకొండేండ్లలో ఈ విధానాలు మరింత వేగంగా అమలవుతున్నది కూడా అంతే నిజం. బుల్లెట్ ట్రెయిన్ ఇండియాలో ప్రవేశపెట్టకపోయినా కార్పొరేట్ అనుకూల విధానాలు మాత్రం బుల్లెట్ ట్రెయిన్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నవి. ఫలితంగా అసమానతలు విపరీతంగా పెరుగుతున్నవి. ఫోర్బ్స్ మ్యాగజైన్ ప్రకటించిన దాని ప్రకారం ప్రపంచ సంపన్నుల్లో ముకేశ్ అంబానీది 83.40 బిలియన్ డాలర్ల సంపదతో 9వ స్థానం. అదానీది 82.53 మిలియన్ డాలర్ల సంపద. అమెరికాలో అత్యంత శ్రీమంతుల్లో ఏడుగురు మనవారే. మన దేశ ఒక శాతం సంపన్నుల దగ్గర 40శాతం దేశ సంపద కలిగి ఉన్నది. మరోపక్క భారతదేశ అభివృద్ధి 5.4శాతం తగ్గింది. 2014లో నిరుద్యోగుల సంఖ్య సుమారు 4.7 కోట్లుగా ఉంటే 2025కు వచ్చేసరికి 5.8 కోట్లకు చేరింది. ఆకలి కేకల్లో 125 దేశాల్లో భారత దేశం 111 స్థానం.. యునైటెడ్ నేషన్స్ డెవలప్మెంట్ ప్రోగ్రాం (యూఎన్‌డీపీ) నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా పేదరికం తగ్గించడం, సమానత్వం పెంపొందించడం, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించటంలో చేసిన 175 దేశాల అధ్యయనంలో భారతదేశం దశా బ్దకాలంగా 130 నుండి 135 స్థానాల్లోనే కొనసాగుతున్నది. ఇంతకన్నా ఏంకావాలి? దేశం అసమానతల్లో ఉందని, అభివృద్ధిలో వెనుకబడిందని చెప్పడానికి.

మోడీ గెలిచింది దేశాన్ని పాలించడం కోసం కాదన్న విషయం తెలియనిది కాదు. ఎందుకంటే, ఆయన వంతపాడేది, అభివృద్ధికి పాటుపడేది కార్పొరేట్ల కోసమేనన్నది మరువకూడదు. ఈ రోజు ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, భూములు, గనులు, నదులు, సముద్ర జలాలతో పాటు సమస్త ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నది మోడీ సర్కార్. మరోవైపు సామాన్యులపై భారాలు వేస్తూ సంక్షేమ పథకాలకు కోతలు పెడుతున్నది. ఈ ఆర్థిక అసమానతల భారత్‌లో సంక్షేమ పథకాలు పేదప్రజలకు కొంత ఉపశమనం కలిగిస్తున్నవి. అవి కూడా అందకుండా చేసే కుట్ర కేంద్ర పాలకుల్లో ఉండటం నిజంగా మన దౌర్భగ్యం. కేంద్ర ప్రభుత్వ పథకాలైన గ్రామీణ ఉపాధి చట్టం, ప్రధానమంత్రి కళ్యాణ్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆహార భద్రతకు నిధులు చాలా అవసరం. ఎందుకంటే, మనదేశంలో 143 కోట్ల జనాభాలో 42శాతం అంటే 29.39 కోట్ల మంది ఆకలితో అలమటిస్తున్నారు. ఆహార భద్రత ఇంతటి ప్రమాదకరస్థాయికి దిగజారడం ఆందోళన విద్యావంతులు, మేధావి వర్గానికే ఆందోళన కలిగిస్తున్నది. ఆహార భద్రత చట్టం 2013 ప్రకారం ప్రతి వ్యక్తికి తగినంత సురక్షితమైన పౌష్టికాహారం అందించాల్సి ఉండగా వీటి అమల్లోనూ అనేక లోపాలు కొనసాగుతున్నాయి. పేరుకు మాత్రం బియ్యం ఇస్తున్నట్టుగా కనిపిస్తున్నా లబ్దిదారులకు నాణ్యమైన బియ్యం అందడం లేదన్నది వాస్తవం. 2024 -25 కేంద్ర బడ్జెట్‌లో ఆహారభద్రతకు రూ.2.05 లక్షల కోట్లు కేటా యించగా ప్రస్తుత బడ్జెట్‌లో 2.03 లక్షల కోట్లు మాత్రమే ప్రకటించారు. నిధుల్ని ఏడాదికేడాది తగ్గిస్తూ రావడం ప్రజల పట్ల బీజేపీ నిర్లక్ష్యం తెలుస్తున్నది. 25 కోట్ల మందిని పేదరికం నుండి విముక్తి చేశామని చెప్పుకుంటూనే ఎనభైకోట్ల మందికి ఉచిత రేషన్ అందించామని చెప్పడం వెనుకున్న వాస్తవాల్ని గ్రహించాలి.ఆహారభద్రత తీరుతెన్నుల్లో భారత్‌కు సంబంధించి పౌష్టికాహారం లభించని వారు 196.4 మిలియన్లు ఉన్నారని ప్రపంచ నివేదిక పేర్కొంది. ఇది ప్రపంచంలోనే అత్యధికం. మానవాభివృద్ధిలో 170 దేశాల్లో ఇండియా 130 నుంచి 150 స్థానంలో ఉంది. దీనికి కారణం నిరక్షరాస్యత, విద్యలో వెనకబాటు తనమే.గ్రామీణ ఉపాధి చట్టం గ్రామాల్లోని పేదలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. వందరోజులు పని కల్పించడం వల్ల వలసలు తగ్గుతాయి. అయినా కూడా ఈ పథకానికి కేంద్రం నిధులు పెంచలేదు.

గతేడాది కేంద్ర బడ్జెట్ రూ.45.20 లక్షల కోట్లుంటే ఇందులో 70శాతం కార్పొరేట్లకు రాయితీల రూపంలో పోయింది. ఇక మిగిలింది దేశ అభివృద్ధికి ఏం సరిపోతుంది? 2019లో కార్పొరేట్ పన్నులు 30 శాతం నుంచి 21కి, మ్యానుఫ్యాక్చర్ రంగంలో 25 నుంచి 15శాతం తగ్గించింది. దీంతో 18.40 లక్షల కోట్ల రాబడి కేంద్రం కోల్పోయింది. కార్పొరేట్ సంస్థలకు 14.46 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను రద్దు చేసింది. స్విస్ బ్యాంకులో మూడు లక్షల కోట్ల రూపాయల నల్లధనం ఇప్పటికీ మూలుగుతూనే ఉంది. మొత్తం బడ్జెట్లో 70శాతంగా ఈ మొత్తాన్ని వీరి వద్ద నుంచి రాబడితే లోటు బడ్జెట్‌ను అధిగమించి భారత్ మిగుల్లో ఉంటుంది. ప్రభుత్వానికి వచ్చే అత్యంత పన్నుల ఆదాయంలో ప్రజలదే అధికం. కానీ, భారం వేసేది వీరిమీదైతే, రాయితీలు కల్పిస్తూ, వారి అప్పుల్ని రద్దుచేస్తూ దేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకరంగా మారుస్తున్నది మోడీ సర్కార్. ప్రస్తుత కాలంలో అత్యంత ప్రాధా న్యత కలిగిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఉపశమనం కల్పిస్తున్నాయి. దారిద్ర్యం నుంచి బయటపడేందుకు తోడ్పడుతున్నాయి. కానీ ఆ పథకాలకే బడ్జెట్‌లో కోతలు విధించడం చూస్తే మోడీ పాలన సాగిస్తున్నది ఎవరికోసం, ఎందుకోసమన్న విషయం ఇట్టే అర్థమవుతున్నది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంతా కూడా పేదల్ని దోచి పెద్దలకు పెట్టే విధంగానే ఉన్నది. ఇది పేదరికం నుంచి ప్రజల్ని విముక్తి చేయకపోగా మారింత అసమానతలకు దారి తీస్తుందనడంలో సందేహం లేదు. కేంద్రం ఉదారవాద విధానాలను తిప్పికొట్టా లన్నా, సంక్షేమ పథకాలు కోతలకి గురికాకుండా అమలు చేసుకోవాలన్నా ప్రజల ఐక్య పోరాటాలే మార్గం.





PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

వ్యవసాయ చట్టాలతో కార్పొరేట్ల అక్రమ చొరబాటు

వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన పత్రం (ఎన్.పి.ఎఫ్.ఎ.ఎమ్) పేరిట కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఆరెస్సెస్, బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వ కుత్సిత ఉద్దేశాలను బహిర్గతం చేస్తున్నది. రైతుల ప్రయోజనాలను బలిపెట్టి కార్పొరేట్ లాభాలను అత్యధిక స్థాయికి చేర్చడం కోసం పన్నిన పన్నాగమిది. రైతాంగ ఉద్యమం ముందుకు తెచ్చిన ఏ ఒక్క కోర్కెనూ కేంద్రం తీవ్రంగా తీసుకోలేదని ఈ ముసాయిదా స్పష్టం చేస్తుంది. గరిష్ట మద్దతు ధర (ఎం.ఎస్.పి)ను చట్టబద్ధం చేయడం, వ్యవసాయం పై ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం, రైతాంగానికి అనుకూలమైన పరపతి సదు పాయాలు కలిగించడం వంటి కోర్కెలను అసలు పట్టించు కోలేదని తెలుస్తున్నది. రాజ్యాంగం 246వ అధికరణం ప్రకారం వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్ర ప్రభుత్వ జాబితా లోనిదని కంటితుడుపుగా ఒప్పుకుంటూనే ఆ ముసాయిదా ప్రధాన శైలి మాత్రం సమాఖ్య విధానంపై రాష్ట్రాల అధికారాలపై దాడి చేసేదిగా వుంది. రాష్ట్రాల ప్రాయోజితమైన మార్కెట్ మౌలిక సదుపాయాలను నిర్మూలించడం, ఎ.పి.ఎం.సి ల పాత్రను రద్దు చేయడం, చిన్న మధ్యతరహా రైతాంగాన్ని ప్రయివేటు వ్యాపార కూటములకు విపరీతంగా లోబడిపోక తప్పని పరిస్థితి కల్పించడానికి దారితీసేదిగా వుంది.

ప్రధానంగా ప్రయివేటు కోసమే!

ప్రయివేటు హోల్‌సేల్ మార్కెట్ల ఏర్పాటు, ముఖద్వారంలోనే కార్పొరేట్ వ్యాపారులు, ఎగుమతిదారులు కొనుక్కునే అవకాశం కల్పించడం వంటి అంశాలు ఈ ముసాయిదా ప్రధానంగా సూచిస్తున్నది. సంప్రదాయక వ్యవసాయ మార్కెట్ యార్డుల స్థానంలో కార్పొరేట్ అధీనంలోని గోదాములు, సిలోలు తీసుకురావడం, రాష్ట్ర వ్యాపిత మార్కెట్ ఫీజును వాణిజ్య ఫీజును ప్రవేశ పెట్టడం వంటివి ఈ ముసాయిదాలో ప్రధానంగా సూచించిన సంస్కరణల్లో వున్నాయి. బడా కార్పొరేట్లు ఎ.పి.ఎం.సి మార్కెట్ యార్డులను తోసిపుచ్చి తామే నేరుగా రైతుల ఉంచి కొనుగోలు చేయాలని ఆ ముసాయిదా ప్రతిపాదిస్తున్నది. రిలయన్స్, అదానీలతో సహా బడా కార్పొరేట్ కంపెనీలకు విస్తారమైన గోదాము వ్యవస్థ వుంది. హర్యానాలోని సిర్సా, పంజాబ్‌లోని లుధియానాలలో ప్రయివేటు రైల్వే నెట్‌వర్క్ కూడా వుంది.

ఎం.ఎస్.పి ఎందుకు గిట్టదు?

ఎం.ఎస్.పి అనే దానికి కార్పొరేట్ లాబీ, అలాగే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులు పచ్చి వ్యతిరేకతతో వున్నారు. ఎందుకంటే వ్యవసాయోత్పత్తులను కారుచౌకగా కొనేయడమే ఎప్పుడూ వారి వ్యూహంగా వుంటున్నది. దానికి కొంత నాణ్యత జోడించి బ్రాండు వేసి మార్కెట్‌లో అమ్ముకోవడమే వారి లక్ష్యం. ఈ క్రమంలో విపరీతమైన లాభాలు గుట్టలు పోగు పోసుకోవాలని చూస్తారు. ఈ విధంగా బడా వ్యాపార వర్గాలు రైతులనూ అలాగే వినియోగదారులను కూడా దోచుకుంటున్నాయి. మార్కెట్ సామర్థ్యం పేరుతో కేంద్రం వ్యవసాయోత్పత్తులను కార్పొరేట్ లూటీకి అనుకూలమైన వాతావరణం ఏర్పాటు చేస్తున్నది. కార్పొరేట్ పరిశ్రమలు, వాణిజ్యవేత్తలు ప్రాథమిక ఉత్పత్తిదారులైన రైతుల నుంచి తాము కబళించిన అదనపు లాభంలో కొంత శాతాన్నయినా వారు అందించిన ముడి సరుకుకు గిట్టుబాటు ధరగా కలపాలని ముసాయిదాలో ఎలాంటి నియంత్రణ నిబంధన పెట్టలేదు. ఈ విధంగా బీజేపీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలకు లొంగిపోతున్నది. రైతాంగ ఆత్మహత్యలు, రుణభారం కొనసాగడానికి కారణమవుతున్నది. రైతాంగం దివాళా తీసే పరిస్థితిని సృష్టిస్తున్నది.

ఎ.పి.ఎం.సి చట్టాన్ని రద్దు చేయడంతో బీహార్‌లో మండీలుపోయాక ఎలాంటి శోచనీయ పరిస్థితులు ఏర్పడ్డాయో ఈ నివేదిక డాక్యుమెంటుగా నివేదించడం చెప్పుకోదగిన అంశం. ఇదెంతో వైరుధ్యభరితం. పరాకాష్ట. ఎందుకంటే ఢిల్లీలో రైతాంగ పోరాటం తారా స్థాయిలో వుండగా ఆరెస్సెస్- బీజేపీ వర్గాలు, కేంద్ర ప్రభుత్వానికి సన్నిహితులైన కార్పొరేట్ వర్గాలు ఎ.పి.ఎం.సి చట్టం రద్దును వ్యవసాయ మార్కెట్ల నియంత్రణ ఎత్తివేతకు గొప్ప ఉదాహరణ అన్నట్టు కథనాలు ప్రచారంలో పెడుతూ వచ్చాయి.

వ్యవసాయం కార్పొరేటీకరణ

వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయాలని ఈ ముసాయిదా సుస్పష్టంగా చెబుతోంది. వ్యవసాయాన్ని సంస్కరించడానికి అదొక్కటే మార్గమని చూపిస్తున్నది. ఉదాహరణకు ఈ ముసాయిదా ఎంతో గొప్పగా చెప్పబడిన మోడీ అత్యంత ప్రియ పథకమైన ఎఫ్.పి.వో పథకం కార్పొరేట్ చొరబాటుకు మార్గంగా ఊహిస్తున్నది. దీని ప్రకారం ఎఫ్.పి.వోలు క్లస్టర్ల ప్రాతిపదికగా బడా వ్యాపార సంస్థలతో కాంట్రాక్టు ఏర్పాట్లు చేసుకుని రంగంలోకి దిగడానికి సానుకూల వాతావరణం సృష్టించాల్సి వుంటుంది. ఎఫ్.పి.వో పథకాన్ని ముందుకు తీసుకుపోవడానికి వీలుగా సి.ఐ.ఐ, ఎఫ్.ఐ.సి.సి.ఐ వంటి కార్పొరేట్ గ్రూపులు చూపి స్తున్న మహా ఆరాటం ఇప్పుడు ఆవిష్కృతమ వుతున్నది.

ఫ్యూచర్స్ బహిరంగ మార్కెట్ ద్వారా పెట్టుబడుల ప్రవేశాన్ని మరింత లోతుకు తీసుకుపోవాలన్న సూచనను కూడా ఇదే బడా వ్యాపార సంస్థల ఉచ్చుగా మాత్రమే చూడవలసి వుంటుంది. దీనివల్ల బహుళజాతి కంపెనీలు, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు దేశీయ ఆహార పరిశ్రమలోకి ప్రవేశించి ఆధిక్యత సంపాదించి నియంత్రించేందుకు అవకాశం లభిస్తుంది. తద్వారా భారతీయుల ఆహార భద్రత ప్రమాదంలో పడుతుంది.ఈ ముసాయిదాకు ఇప్పటికే గట్టి ప్రతిఘటన మొదలైంది. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుపై ఈ ముసాయిదాను దగ్ధం చేస్తూ దేశ వ్యాపితంగా వేలాది మంది రైతులను డిసెంబరు 23న ప్రదర్శనలో సమీకరించింది. అదే విధంగా జనవరి 26న ట్రాక్టర్లు/వాహనాల ర్యాలీల్లోకి తీసు కొచ్చింది. హర్యానాలోని తొహనాలోనూ పంజాబ్ లోని మోగాలోనూ జరిగిన రెండు మహా కిసాన్ పంచాయత్‌లలోనే 75 వేల మంది రైతులు సమీక్య తులైనారు. ఇటీవలనే ఢిల్లీలో జరిగిన ఎస్.కె.ఎం జాతీయ సమావేశాలు ఈ పోరాటాన్ని మరింత తీవ్రం చేయాలని ప్రతినబూనాయి.భారత దేశ వ్యవసాయ రంగాన్ని దేశ విదేశీ కార్పొరేట్లకు బంగారు పళ్లెంలో పెట్టి అప్పగించాలని చూస్తున్న బీజేపీ, ఆరెస్సెస్ ప్రభుత్వ ప్రయత్నాలను అన్ని తరగతుల ప్రజలూ బలంగా ప్రతిఘటించడం అవసరం.

('పీపుల్స్ డెమోక్రసీ' జనవరి 29 సంపాదకీయం)

గిరిజన ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు కేంద్రం చేపడుతున్న ప్రణాళికలేంటి..?

- లోక్ సభలో ప్రశ్నించిన ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

నవతెలంగాణ- ఖమ్మం

తెలంగాణలోని గిరిజన ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీటిని పైపులైన్ల ద్వారా సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రణాళికను అమలు చేస్తోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి గురువారం లోక్‌సభలో ప్రశ్నించారు. ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్ నిర్వహణ గురించి అడిగారు. దీనికి కేంద్ర జల్ శక్తి సహాయ మంత్రి వి.సోమన్న లిఖితపూర్వక సమాధానమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం తెలంగాణలో 924 గిరిజన గ్రామాలు (40 శాతం ఎస్టీ గృహాలు) ఉన్నాయని తెలిపారు. నీటి సరఫరా, సాంకేతిక అంశాలను రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలు, మిషన్ భగీరథ ఆధ్వర్యంలో పర్యవేక్షణ కొనసాగుతోందని అన్నారు. 883 గ్రామాలు ఎంపీఎస్, ఎస్వీఎస్ పథకాల కింద ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తరపున కావలసిన సహకారం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని వివరించారు.



10న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నా జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి

నవతెలంగాణ-కల్లూరు

బడ్జెట్‌లో తెలంగాణాకు బీజేపి ప్రభుత్వం అన్యాయం చేసిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి విమర్శించారు. గురువారం డివిజన్ కమిటీ సమావేశం స్థానిక పార్టీ కార్యాలయం చింతలపూడి జగ్గయ్య భవన్‌లో తన్నీరు క్రిష్ణార్జునరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాచర్ల భారతి, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో వివిధ రంగాలకు తగిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 10న హైదరాబాద్లో మహాధర్నా కార్యక్రమం చేపట్టామని, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని నిరసనలో పాల్గొనవలసి ఉందని పిలుపునిచ్చారు.సీతారామ ప్రాజెక్టుకు కనీసం బడ్జెట్లో రూపాయి కూడా కేటాయించలేదని, బయ్యారం పరిశ్రమ ఏర్పాటు ఊసేలేదు అని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలకు నిధులు కేటాయించలేదని, బయ్యారం పరిశ్రమ ఏర్పాటుపై ఊసేలేదన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలకు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. వ్యవసాయరంగాన్ని పూర్తిగా విస్మరించారని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బడ్జెట్ రూపొందించారని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు ఫిబ్రవరి10న హైదరాబాద్ కదలిరావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండు రంగారావు, జాజిరి శ్రీనివాసరావు, చలమాల విఠల్‌రావు, కల్లూరు మండల కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, తల్లాడ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, పెనుబల్లి మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, వేంసూరు మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్‌రావు, డివిజన్ కమిటీ సభ్యులు పాకాలపాటి ఝాన్సీ, శీలం పకీరమ్మ, నాగమణి, నల్లమోతు మోహన్‌రావు, రావుల రాజబాబు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా...వ్యక్తి మృతి

నవతెలంగాణ-కొణిజర్ల

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టిన సంఘటనలో వ్యక్తి మృతి చెందాడు. మండల పరిధిలోని పెద్దగోపతి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తడికమల్ల దానియేలు కుమారుడు తడికమల్ల రవి(30) ట్రాక్టర్ వేసుకుని ఓ రైతు పొలంలో ఉన్న జనరేటర్ తెచ్చేందుకు తడికమల్ల కళ్యాణ్, మొండితోక విజయ్‌లతో కలిసి రాపల్లి మేజర్ కాలువ మీదుగా వెళుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో కళ్యాణ్ విజయ్ వెంటనే ట్రాక్టర్‌పై నుంచి దూకి తప్పించుకున్నారు. ట్రాక్టర్ తోలుతున్న రవి అదే ట్రాక్టర్ టైర్ల కింద కాలువలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సూరజ్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రవికి భార్య రాధమ్మ కుమారుడు ధనుష్ కుమార్తె నిత్యలు ఉన్నారు. రవి తండ్రి దానియేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రవి మృతదేహాన్ని టీడీపీ జిల్లా కన్వీనర్ రామనాథం మండల అధ్యక్షుడు తాతా సుధాకర్‌లు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



నిర్దిష్ట సమయానికి ముందే 'ఈనిక' దశకు వరి

- పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం రేజర్లలో యాసంగిలో వేసిన వరిసాగు ఆర్ఎన్ఆర్-15040 వరిరకం నిర్దిష్ట సమయానికంటే కంకలు రావడంతో విషయాన్ని వ్యవసాయాధికారులకు సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న సత్తుపల్లి వ్యవసాయశాఖ అధికారులు శాస్త్రవేత్తలతో కలిసి గురువారం రేజర్ల గ్రామానికి వెళ్లి గ్రామంలోని గొర్ల అంజిరెడ్డి, పులగం అంజిరెడ్డి, భీమిరెడ్డి నరసారెడ్డిలకు చెందిన యాసంగి వరిపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు వరి నాటిన తేదీ దగ్గర నుంచి సస్యరక్షణ, మందుల వివరాలు, ప్రస్తుత దుబ్బుదశలో ఈనిని కంకుల శాతం, ఎరువుల వినియోగం తదితరాంశాలను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిశీలించి తుది నివేదికను త్వరలో తెలియజేయడం జరుగుతుందని శాస్త్రవేత్తలు రైతులకు తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కృషి విజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. రవికుమార్, డాక్టర్ వి. చైతన్య, సత్తుపల్లి ఏడీఏ వి. శ్రీనివాసరెడ్డి, ఏవో వై. శ్రీనివాసరావు, విత్తన ధ్రువీకరణ అధికారి టి. వేణుమాధవ్, ఏఈవో టి. నరేశ్, సీడ్ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-కారేపల్లి

మోటర్ సైకిల్ అదుపుతప్పి వ్యక్తి రోడ్డుపై పడి మృతి చెందిన ఘటన కారేపల్లి మండల పరిధిలోని పేరుపల్లి-జమాలపల్లి గ్రామాల మధ్య రహదారిపై చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఇల్లందు మండలం చల్లసముద్రం గ్రామపంచాయతీ వేములవాడకు చెందిన కల్తి విజయ్ బుధవారం రాత్రి కారేపల్లి మండలం జమాలపల్లికి వైపు మోటర్ సైకిల్ వస్తున్నాడు. మూలమలుపు వద్ద మోటర్ సైకిల్ అదుపు తప్పి రోడ్డు పడిపోయాడు. ఈప్రమాదంలో విజయ్‌కు తలకు బలమైన గాయమై అక్కడి అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటన స్థలాన్ని కారేపల్లి ఎస్సై ఎస్.రాజారాం చేరుకొని మృతదేహాన్ని ఇల్లందు ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారాం తెలిపారు.

ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-ఖమ్మం



నెలవారీ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌ను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌లు భద్రపరిచిన గది, మొదటి అంతస్తులో భద్రపరిచిన వి.వి. ప్యాట్ గది సీల్‌లను, గోడౌన్ వద్ద బందోబస్తును పరిశీలించారు. భద్రతా సిబ్బందితో మాట్లాడుతూ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, అధికారులు తదితరులు ఉన్నారు.

అలుగుబెల్లి నర్సిరెడ్డికి టీజీజేఎల్ఏ మద్దతు

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం, నల్గొండ, వరంగల్ టీచర్ నియోజకవర్గం ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డికి తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్(టిజిజేఎల్ఏ) 475 సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుమ్మడి మల్లయ్య, కొండా వినోద్‌బాబు తెలిపారు. గురువారం ఖమ్మంలోని జిల్లా అత్యవసర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా పరిరక్షణకు నిజాయితీగా నిక్కచ్చిగా పాటుపడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డికి మద్దతు తెలుపుతున్నామని అన్నారు. నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అధ్యాపకులందరికీ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు ఐ.కృష్ణార్జునరావ్, రాష్ట్ర కౌన్సిలర్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పొలూరి మురళికృష్ణ, జిల్లా కోశాధికారి కొల్లూరు భాస్కర్, జిల్లా, రాష్ట్ర నాయకులు ఎ.తిరుపతిరావు, దోరేపల్లి శ్రీనివాసరావు, శ్రీధర్‌కుమార్, బండి ఈశ్వర్, డిగ్రీ కళాశాల సీనియర్ లెక్చరర్ మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు, కార్మికులకు తీవ్ర అన్యాయం

- కేంద్ర బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు నిధులు కుదింపు
- కేంద్ర ప్రభుత్వానికి పెట్రోల్, డీజిల్ ద్వారా రూ.16 లక్షల కోట్ల అదనపు ఆదాయం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ - బోనకల్



అంతర్జాతీయ స్థాయిలో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ, ఆ ధరలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం మన దేశ వాహనదారుల నుంచి రూ.16 లక్షల కోట్ల అదనపు ఆదాయం పొందిందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వలన సామాన్యులు, కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో పార్టీ మండల కమిటీ సమావేశం కేతినేని నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పెట్టుబడుదారుల, కార్పోరేట్‌దారులకు ఉపయోగమే తప్ప దేశ ప్రజలకు ఏరకంగానూ ఉపయోగం కాదన్నారు. ఢిల్లీ, బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు మధ్యతరగతి వర్గాలకి కొద్దిగా ఉపశమనం కలిగింది తప్ప, ఎవరికీ ప్రయోజనం లేని బడ్జెట్ అది అని విమర్శించారు. విద్య, వైద్య రంగాలకు బడ్జెట్లో కేటాయింపులు పెంచకుండా ఉన్నవాటిని యథావిధిగా ఉంచారని, దీనివలన ఆ రంగాలకు కోత విధించారని విమర్శించారు. దేశ ప్రజలకు అత్యధికంగా ఉపయోగపడే ఈ రంగాలకు బడ్జెట్‌లో నిధులు పెంచలేదన్నారు. వ్యవసాయరంగ అనుబంధం వాటికి కూడా నిధులు కేటాయించలేదన్నారు. ఉపాధి రంగానికి నిధులు కేటాయించకుండా దానిని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచినప్పుడు ఎందుకు పెంచారని ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీస్తే అంతర్జాతీయ స్థాయిలో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగాయని, అందువల్లనే ధరల పెంచామని కేంద్ర ప్రభుత్వం చెబుతదని, మరి వాటి ధరలు తగ్గినప్పుడు ధరలు ఎందుకు తగ్గియటం లేదని ఆయన ప్రశ్నించారు. భారతదేశంలో అత్యున్నత ఎల్ఐసి రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు విదేశీ సంస్థలకు 100 శాతం పెట్టుబడుల అనుమతి ఇవ్వటం పట్ల తీవ్రంగా వ్యతిరేకించారు. దీనివల్ల దేశ ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలకు, కార్మికులకు ఉపయోగపడే ఏ రంగానికి కేంద్ర ప్రభుత్వం నిధులు బడ్జెట్‌లో కేటాయించలేదన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా పథకాలను ఎలా అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా, అవి నష్టాలు రావటానికి ప్రభుత్వమే కారణమై చివరకు నష్టాల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్రలో భాగమన్నారు. ఇన్సూరెన్స్ రంగంలో 12 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని రైతాంగం దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నప్పటికీ బిజెపి ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని విమర్శించారు. 5 లక్షల ఆదాయం వరకే జీరో టాక్స్ ఉంటుందని, ఆరు లక్షల ఆదాయం దాటితే టాక్స్ విధిస్తుందని విమర్శించారు. దేశంలో అత్యధిక ప్రజల వినియోగించే వస్తువులపై జీఎస్టీ విధిస్తున్న కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎందుకు జీఎస్టీ విధించడం లేదని ఆయన ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ కూడా జీఎస్టి పరిధిలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోల్, డీజిల్ డాలర్‌తో భారతదేశం వ్యాపార లావాదేవీలు జరిగాయని, అయితే రష్యా 30 శాతం తక్కువ ధరతో క్రూడ్ ఆయిల్‌ను ఇండియా కరెన్సీ రూపంలోనే ఇస్తుందని ఆయన తెలిపారు. దీనివలన దేశానికి ఎంతో ఆదాయం ఆదా అవుతుందన్నారు. కానీ పెట్టుబడుదారులు తక్కువ ధరకు క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకొని ఆ తర్వాత పెట్రోల్, డీజిల్ లను తక్కువ ధరకు విదేశాలకు అమ్ముకుంటుందని విమర్శించారు. సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, జిల్లా సీనియర్ నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్ మాట్లాడారు. సమావేశంలో బంధం శ్రీనివాసరావు, మర్రి తిరుపతిరావు, జొన్నలగడ్డ సునీత, పసుపులేటి నరేష్, దోప్పకొరివి వీరభద్రం, పిల్లలమర్రి వెంకట అప్పారావు, దొండపాటి సత్యనారాయణ, తెల్లాకుల శ్రీనివాసరావు, కారంగుల చంద్రయ్య, చిట్టిమోదు నాగేశ్వరరావు, తుళ్లూరు రమేష్, కేతినేని నాగేశ్వరరావు, కొమ్మినేని నాగేశ్వరరావు, గుగులోత్ నరేష తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపునకు గురైన ఇండ్లకు ఇంటి పన్నును రద్దు చేయాలి

- మున్సిపల్ కమిషనర్‌కు సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్



వరద ముంపునకు గురైన ఇండ్లకు ఇంటి పన్నును రద్దు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగర మున్సిపల్ కమిషనర్‌కు వరద ముంపునకు గురైన ఇండ్లకు ఇంటి పన్నును రద్దు చేయాలని కోరుతూ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం 2024 సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు మున్నేరు వరద ఉప్పొంగి ఖమ్మం నగరంలో చాలా ప్రాంతాలలో కవిరాజు నగర్, రామన్నపేట, దాన వాయిగూడెం, సారథినగర్, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, బొక్కలగడ్డ, కాల్వొడ్డు, మోతీనగర్, రంగనాయకుల గుట్ట, పంపింగ్‌వెల్ రోడ్డు, సుందరయ్య నగర్, పెద్దమ్మ తల్లి గుడి ఏరియా, ప్రకాష్ నగర్, దంసలాపురం ఏరియాలలో నీరు ఇండ్లలోకి చేరి ఇంటి చుట్టూ ఉన్న ప్రహరీ గోడలు కూలిపోయాయి అన్నారు. ఇండ్ల లోపలికి నీరు చేరి ఇంటి లోపల ఉన్న సామాగ్రి మొత్తం పనికిరాకుండా పోయాయన్నారు. సుమారు మూడు నాలుగు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఇండ్లు కూలిపోయినాయని, ఇండ్లు కూలిపోయిన వారికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని, అలాగే ఇట్లాంటి ఇండ్లన్నింటికీ ఇంటి పన్నును రద్దు చేయాలని అన్నారు. ఆస్తి నష్టపోయిన వారికి మూడు లక్షల రూపాయలు ఇవ్వాలని, కేవలం ప్రభుత్వం 16,500 రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ఆ 16,500 కూడా ఇంకా కొంతమందికి అందలేదన్నారు. సెకండ్ లిస్టులో ఉన్న పేర్లు అందరికీ 16,500 వేయలేదని అన్నారు. మున్సిపాలిటీ నుండి జిల్లా కలెక్టర్ ఆఫీస్‌కి రెండవ లిస్టు అందలేదని, రెండో లిస్టులో పేర్లు ఉన్న వారందరికీ వెంటనే 16,500 వేయాలని వారు కమిషనర్‌ను కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యను పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజినేపల్లి శ్రీనివాసరావు, ఎస్ నవీన్ రెడ్డి, భూక్య శ్రీనివాసరావు, బత్తిని ఉపేందర్, పత్తిపాక నాగ సులోచన, 35వ డివిజన్ కార్పొరేటర్ ఖమ్మం డివిజన్ నాయకులు ఎల్లంపల్లి వెంకట్రావు, బజ్జూరి రమణారెడ్డి, షేక్ సైదులు, జే వెంకన్న బాబు, కూరపాటి శ్రీను, సిహెచ్ వీరభద్రం, షేక్ హిమామ్, యర్రా రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



తీర్థాల జాతరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- జాతరలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలి
- అధికారులు సమీక్ష సమావేశంలో ఆర్డీవో నరసింహారావు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఈ నెల 26 నుండి ఐదు రోజులపాటు జరిగే తీర్థాల సంఘమేశ్వరస్వామి జాతరకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతంగా నిర్వహించాలని ఆర్డీవో నరసింహారావు అన్ని శాఖల అధికారులకు సూచించారు. మండల పరిధిలోని తీర్థాల సంఘమేశ్వరాలయంలో గురువారం జాతరకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జాతరకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ ఏరియాలో తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రాంతంలో రోడ్లు వరదలకు కొట్టుకుపోయినందున వాటికి మరమ్మతులు చేయాలన్నారు. భక్తులకు స్నాన ఘట్టాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటుచేయాలన్నారు. వాటితో పాటు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గోళ్లపాడు, తీర్థాల రోడ్డు వరదలకు కొట్టుకుపోయినందున వాటికి వెంటనే మరమ్మతులు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. శానిటేషన్‌కు సంబంధించి పంచాయతీ అధికారులు ఎక్కువ మంది సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు మున్నేరులోకి చెక్ డ్యాం నుండి మోటర్లతో నీరు కిందకు వదిలేలా చూసుకోవాలని నీటిపారుదల శాఖాధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యార్థం ఎక్కువ బస్సులను కేటాయించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. స్వామివారి కళ్యాణ మండపం కూలిపోయినందున దానికి వెంటనే మరమ్మత్తులు చేయించాలని ఆలయ అధికారులను ఆదేశించారు. వివిఐపీ, విఐపి పాస్‌లతో ఇబ్బందులు ఎదురవుతున్నందున వాటిని రద్దు చేయాలన్నారు. ఐదు రోజుల పాటు జరిగే జాతరకు సంబంధించి అన్ని శాఖల అధికారులు వారికి సంబంధించిన పనులను ఈనెల 20వ తేదీ వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాంప్రసాద్, సీఐ రాజు, ఆలయ ఈవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

నవతెలంగాణ-కల్లూరు

పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందటంతో ఎస్సై డి.హరిత ఆధ్వర్యంలో గురువారం తనిఖీ చేసి పట్టుకున్నారు. సమాచారం ప్రకారం రాజమండ్రి నుండి హైదరాబాద్ వైపు 19 పశువులను వాహనంలో తరలిస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకుని అక్రమంగా తరలిస్తున్న మణికంఠ స్వామి, అందే నాగేశ్వరరావును అదుపులోకి తీసుకొని వాహనాన్ని సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న పశువులను పాల్వంచ గోశాలకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కాచిరాజుగూడెంలో బోగస్ ఓట్లు నమోదు చేస్తున్న బీఎల్ఓలు

- అక్రమ ఓట్లు తొలగించి, బీఎల్ఓలపై చర్యలు తీసుకోవాలి
- అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మండలంలోని కాచిరాజుగూడెం గ్రామంలో బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్ఓ) అక్రమ ఓట్లు నమోదు చేస్తూ ఒక పార్టీకి కొమ్ముకాస్తూ గ్రామంతో ఎటువంటి సంబంధం లేనివారికి ఓటు హక్కు కల్పిస్తున్నారని సీపీఐ(ఎం) ఖమ్మంరూరల్ మండల నాయకులు పొన్నం వెంకటరమణ విమర్శించారు. బీఎల్ఓ ఆగడాలను అరికట్టాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఖమ్మం రూరల్ తహశీల్దార్ రాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పొన్నం వెంకటరమణ మాట్లాడారు...కాచిరాజుగూడెం గ్రామంలో బీఎల్వోలుగా పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు ఒక పార్టీకి కొమ్ముకాస్తూ స్థానికంగా నివాసం లేని వారికి, ఊరుతో ఎటువంటి సంబంధం లేని వారికి ఓట్లు నమోదు చేయడం హేయమైన చర్య అన్నారు. ఎటువంటి పక్షపాతం లేకుండా గ్రామంలో ఉండే వారికి మాత్రమే ఓటు హక్కు కల్పించాలని, సంబంధం లేని వ్యక్తులకు గ్రామంలో ఓటు హక్కు కల్పిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పదేళ్ల క్రితం పెళ్లి అయిపోయిన వారికి, ఊరుతో ఎటువంటి సంబంధం లేని వారికి, ఓట్లు నమోదు చేస్తూ ఒక పార్టీకి సహకరిస్తున్నారని విమర్శించారు. బీఎల్ఓలను వెంటనే విధుల నుంచి తొలగించి,వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దొంగఓట్లను తొలగించాలని తహసీల్దార్ రాం ప్రసాద్, ఎలక్షన్ డీటీ రవీందర్‌లను కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు విచారణ చేస్తామని, నకిలీ ఓట్లను తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పొన్నం మురళి, పొన్నం భాస్కరరావు, ఏలూరు నాగేశ్వరరావు, షేక్.సైదులు, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు మహంకాళి ఉప్పలయ్య, తోట అప్పారావు, రవి, బీఆర్ఎస్ నాయకులు చావిడి లింగేశ్వరరావు, మండల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్చికి మద్దతు ధర, ప్రభుత్వ కొనుగోలు కోసం ఉద్యమం

- జిల్లాలో వంద గ్రామాల్లో మిర్చి రైతుల సభలు
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



మిర్చి క్వింటాళ్లకు ఇరవై ఐదు వేల రూపాయలు మద్దతు ధర నిర్ణయం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నాఫెడ్, మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లాలో వంద గ్రామాల్లో సభలు, సదస్సులు నిర్వహించి రైతుల అభిప్రాయం మేరకు, ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తామని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు అధ్యక్షతన జరిగిన రైతు సంఘం వైరా పట్టణ కమిటీ సమావేశంలో బొంతు రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మిర్చి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, మద్దతు ధర క్వింటాలుకు ఇరవై ఐదు వేల రూపాయలు నిర్ణయం చేసి ప్రభుత్వ కొనుగోలు చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మిర్చి సాగు చేస్తున్న రైతులకు తామర పురుగు తెగుళ్లు తీవ్ర నష్టం చేస్తుంటే మరొకవైపున సగానికి పైగా తగ్గిన మిర్చి ధర రైతులను ఆర్థికంగా కుంగతీస్తుందని, 2023 జనవరి సీజన్లో 25 వేల రూపాయల ధర పలికిన మిర్చి 2024 జనవరిలో 19వేలకు 2025 జనవరిలో 12 -13 వేల రూపాయలకు తగ్గిపోయి సగం ధర కూడా మార్కెట్లో రైతులకు లభించడం లేదని, భారీ పెట్టుబడులతో వ్యవసాయం చేసిన మిర్చి రైతులకు అప్పుల భారం పెరిగి ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మిర్చి సాగు 4 లక్షల ఎకరాల విస్తీర్ణం నుంచి 2,34,000 ఎకరాలకు విస్తీర్ణం పడిపోయి అందులో 30- 40 శాతం పంట తెగుళ్లతో దెబ్బతిన్న 60 -70శాతం పంట విస్తీర్ణంలో దిగుబడి వచ్చిన కనీస ధర లభించక రైతుల లక్షల రూపాయలు నష్టపోతున్నారని అన్నారు. రైతు భరోసా విడుదల అంటూ రైతులు సంబరపడిన నిమిషాలు వ్యవధిలో ఆశలు ఆవిరి అవుతున్నా పరిస్థితి నెలకొందని, ఒక ఎకరం వెంట రెండవ ఎకరాకు భరోసా విడుదల లేదు అన్నారు. రుణమాఫీ పూర్తి చేయడం లేదని రెండు లక్షల రూపాయలు పైన అప్పు ఉన్న రైతులు బ్యాంకు రుణాలు చెల్లించిన తిరిగి అప్పు ఇచ్చే పరిస్థితి లేదని, రుణమాఫీ రాదు ఆ రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని అన్నారు. జిల్లాలో ధాన్యం బోనస్ విడుదల కాకపోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని, వెంటనే రైతు భరోసా, రుణమాఫీ, ధాన్యం బోనస్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్ రైతులకు, పేదలకు, కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్ అనుకూల వైఖరితో ఉందని వ్యవసాయ రంగం సంక్షేమ రంగాలకు నిధులు కేటాయింపులు తగ్గించి కోత పెట్టి అన్యాయం చేస్తున్నారని అన్నారు. కేంద్ర బడ్జెట్ కి ప్రత్యామ్నాయ విధానాలు, సవరణలు సూచిస్తూ సదస్సులు, గ్రూపు సమావేశాలు నిర్వహించాలని ఫిబ్రవరి 10 ఛలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు బాణాల శ్రీనివాసరావు, మాజీ ఎంపిపి, జిల్లా కమిటీ సభ్యులు బొంతు సమత, పారుపల్లి శ్రీనాథ్, సంక్రాంతి పురుషోత్తం, ఎస్.డి పాషా, హరి వెంకటేశ్వరరావు, వడ్లమూడి మధు, యనమద్ది రామకష్ణ, పాసంగులపాటి చలపతిరావు, రాచబంటి బత్తిరన్న, శీలం నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఖమ్మంలో మెగా ఆర్గానిక్ మేళా

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరంలో తెలుగు దేశం పార్టీ ఆఫీస్ పక్కన ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్ ఆవరణలో గ్రామభారతి, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గత నెల మొదటి ఆదివారం నిర్వహించిన ఆర్గానిక్ మేళాకు వచ్చిన అనూహ్య స్పందన దృష్ట్యా వినియోగదారుల డిమాండుపై ప్రతి నెల రెండవ శనివారం నుండి ఆదివారం వరకు రెండు రోజుల పాటు మేళా నిర్వహించాలని ఈ సంఘాలు నిర్ణయించాయని సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లమల వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. దానిలో భాగంగానే ఈ నెల 8, 9 తేదీలలో మెగా ఆర్గానిక్ మేళా నిర్వహించబడుతుందని, ఈ మేళా ను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు 8వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని చెప్పారు.

గార్డెనింగ్ ఫెస్టివల్‌లో కలెక్టరేట్ కు ఉత్తమ గార్డెనింగ్ అవార్డ్

నవతెలంగాణ-ఖమ్మం



రాష్ట్ర ఉద్యాన శాఖ ఈ నెల 4న నిర్వహించిన గార్డెనింగ్ ఫెస్టివల్‌లో ఖమ్మం కలెక్టరేట్ ఉత్తమ గార్డెనింగ్ అవార్డ్ ను అందుకుంది. ఈ అవార్డ్ ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా ఉద్యానవ అధికారి ఎం.వి. మధుసూదన్ కు గురువారం కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో అందజేశారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ డిడి ముత్యాల రావు, ఉద్యాన సాంకేతిక అధికారిణి వి.అనితశ్రీ, ఉద్యాన అధికారిణి సి. అపర్ణ, సిబ్బంది హసీనా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో సాగు ప్రోత్సాహకానికి కేంద్రం చేపడుతున్న చర్యలేంటి..?

- అగ్రిసూర్ నిధుల ద్వారా కొత్త స్టార్టప్‌ల మద్దతు లక్ష్యాలేంటి..?
- లోక్ సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం



తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలు అత్యధికంగా ఉన్నాయని, ఇక్కడ సుస్థిర వ్యవసాయ ప్రోత్సాహకానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతోంది..? అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో ప్రశ్నించారు. అగ్రిసూర్ నిధుల ద్వారా అగ్రి స్టార్టప్‌లు, గ్రామీణ సంస్థల మద్దతుకు ఎలాంటి లక్ష్యాలు పెట్టుకున్నారని అడిగారు. దీనికి కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గురువారం లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. అగ్రిసూర్ ఫండ్ ద్వారా కచ్చితంగా సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ అగ్రి ఫ్యూర్ వంటి సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, పశు పోషణ, మత్స్య పరిశ్రమ, వ్యవసాయ యాంత్రీకరణ కు అగ్రి స్టార్టప్ లు ఎంతో సహకరిస్తున్నాయని కేంద్ర మంత్రి చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో.. సాగు ఆధారిత ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పెంపొందిస్తున్నట్లు చెప్పారు. సహకార, రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా వ్యవసాయంలో అధునాతన పద్ధతులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. వ్యవసాయ స్టార్టప్ లకు సంబంధించి.. దేశవ్యాప్తంగా ఒకే విధానం అవలంబిస్తున్నామని ఈ సందర్భంగా కేంద్రమంత్రి వివరించారు.



కేంద్రానికి బుద్ధి చెప్పే రోజులు వస్తాయి

- సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి

నవతెలంగాణ-చింతకాని

కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్రంపై చిన్న చూపు తగదని, బడ్జెట్ కేటాయింపులో మొండి చేయి చూపిన బీజేపీకి రాబోవు కాలంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు హెచ్చరించారు. గురువారం మండల పరిధిలో రేపల్లెవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం మీద ప్రజానీకం మీద కేంద్ర ప్రభుత్వం కేవలం సవితి ప్రేమ చూపిస్తుందన్నారు. 10న హైదరాబాదులో సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరగబోయే ప్రగతి ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులకు గాని ఉపాధి హామీ కూలీలకు గాని రైతు కూలీలకు గాని అనేక వ్యవస్థలో నిధులు కేటాయించకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రాచబంటి రాము, తోటకూర వెంకట నరసయ్య, కమిటీ సభ్యులు వత్సవాయి జానకి రాములు, వందనం గ్రామ శాఖ కార్యదర్శి సూర్యదేవర పర్వతలింగాచారి యజ్ఞ నారాయణ, మదిని బసవయ్య పాల్గొన్నారు.

ఈ నెల 9న నెల నెలా ఉచిత వైద్య శిబిరం

- రూ.100కే బీపీ, షుగర్ మందులు
- వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ఎన్జీఆర్ సేవా కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు పిలుపు

నవతెలంగాణ-నేలకొండపల్లి

ఈ నెల 9న సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్ రావు (ఎన్‌జిఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో జరిగే 26వ నెల నెలా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్జీఆర్ ఫౌండేషన్ చైర్మెన్ ఏటుకూరి రామారావు పిలుపునిచ్చారు. గురువారం ఎన్జీఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి సమస్యలతో పాటు ఇతర అనారోగ్య సమస్యలకు కూడా ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ సి.భారవి ఎండి, డిఎం (జీర్ణ కోశ వ్యాధి వైద్య నిపుణులు), డాక్టర్ గుడిపూడి రాజేష్ ఎంబీబీఎస్(చెవి, ముక్కు, గొంతు వ్యాధుల వైద్య నిపుణులు), డాక్టర్ కొల్లి అనుదీప్ ఎంబిబిఎస్, ఎండి (జనరల్ మెడిసిన్), డాక్టర్ సుబ్బారావు (ప్రముఖ వైద్యులు) రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. షుగర్ పరీక్షలు ముందుగా చేయించుకుని రావాలన్నారు. బీపీ షుగర్ రోగులకు వంద రూపాయలకే ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఖమ్మం శరత్ మాక్స్ విజన్ వారిచే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు మాత్రమే వైద్య శిబిరం జరుగుతుందని, ప్రజలు సకాలంలో హాజరై వైద్య సేవలు పొందాలని సూచించారు. పేదలకు వైద్యాన్ని మరింత అందు బాటులోకి తీసుకురావాలనే సేవా దృక్పథంతో నెలనెలా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్జీఆర్ సేవా కమిటీ నిర్వాహకులు గుడవర్తి నాగేశ్వరరావు, కెవి రామిరెడ్డి, కట్టెకోల వెంకన్న పాల్గొన్నారు.

సంపూర్ణ స్వస్థత ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్‌సిడి క్లినిక్‌ను ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-ఖమ్మం

సంపూర్ణ స్వస్థత ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఎన్‌సిడి విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్‌లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమం క్రింద జిల్లా ఆసుపత్రిలో ఎన్.సి.డి. క్లినిక్ విభాగం ఏర్పాటు చేసి రక్తపోటు, వృద్ధాప్య సేవలు, మానసిక సమస్యలు, కిడ్నీ, కాలేయ సమస్యలు, నోటి సమస్యలు, క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాత నివారణకు పటిష్ట చర్యలు చేపట్టామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసిన ఎన్‌సిడి క్లినిక్ ద్వారా గర్భాశయ ముఖ ద్వారం క్యాన్సర్ (సర్వికల్ క్యాన్సర్), రొమ్ము, నోటి క్యాన్సర్, మధుమేహం, పక్షవాతం, గుండెపోటుకు ఎటువంటి చికిత్స తీసుకోవాలి, వ్యాధి గుర్తింపు వంటి అంశాలపై దృష్టి సారించి పని చేస్తుందని అన్నారు.



అనంతరం జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని డయాగ్నస్టిక్ వార్డు, ఫిజియోథెరపీ, మందులు అందించే గది, క్షయ వ్యాధి నిర్మూలన కేంద్రం, ఇన్ పేషెంట్ వార్డు, గర్భిణీ స్త్రీల వార్డ్, మందులు నిల్వ చేసే స్టోర్ రూమ్ లను పరిశీలించారు. ఇన్ పేషెంట్ లో ఉన్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కలెక్టర్ ఆసుపత్రి మొత్తం తిరిగి భవనాలను పరిశీలించారు. కావాలసిన వసతి ఏర్పాట్లపై పార్కింగ్, టాయిలెట్స్ నిర్మాణాల కోసం అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. హాస్పిటల్ వద్ద ప్రధాన గెట్ ప్రక్కన పార్కింగ్ స్థలం, సఖి కేంద్రం ప్రక్కన విశాలమైన పార్కింగ్ తో ఇన్, అవుట్ గేట్లతో నిర్మాణాలకు అధికారులకు కలెక్టర్ మ్యాపింగ్ చూపెట్టారు. అనంతరం హాస్పిటల్ ప్రాగంణంలో సఖి కేంద్రంను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించారు. కోర్టు కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. కిరణ్ కుమార్, ఆర్ఎంఓ రాంబాబు, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని మీ సేవా యాప్.. ఆందోళనలో పెన్షనర్లు

- ఎస్టిపిపిటి జిల్లా యూనిట్ అధ్యక్షులు పరిశపుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్

నవతెలంగాణ-ఖమ్మం

అట్టహాసంగా ప్రారంభించిన మీ సేవా యాప్ సరిగా పనిచేయక పెన్షనర్లు ఆందోళన చెందుతున్నారని, సత్వరమే యాప్ పనిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్టిపిపిటి) జిల్లా యూనిట్ అధ్యక్షులు పరిశపుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఖజానా శాఖలో సాంకేతికత ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఆతర్వాత దాని పనితీరు సమీక్షించిన పాపాన పోలేదని, ఈ కారణంగా వందలాది పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్ గురించి ఆందోళన చెందుతున్నారని, గత సంవత్సరం వరకు టి.యాప్ పోలియో యాప్ లో చాలా తేలికగా పెన్షనర్లు తమ తమ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేవారని, యాప్‌లో సాంకేతిక సమస్యలు పేరుతో నవంబర్ నుండి జనవరి నెల గడిచినా వందలాది పెన్షనర్లు తమతమ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించలేకపోయారన్నారు. ఇప్పటికైనా ఖజానా శాఖ జిల్లా, రాష్ట్ర అధికారులు తగు చొరవ చూపాలని, మీ సేవా యాప్ సక్రమంగా పనిచేసేలాచూడాలని తద్వారా పెన్షనర్ల ఆందోళన ను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఖజానా శాఖ ఉపసంచాలకులు ఎస్. వి. ఎస్. నరసింహకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కనపర్తి వెంకటేశ్వర్లు, భాస్కరాచారి, పెదమళ్ళ సత్యనారాయణ, ఊడుగు వెంకటేశ్వర్లు, కామారపు శ్రీనివాస్ ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్త గజ్జల నాగమణి మృతి

- నివాళులర్పించిన సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో మూడవ అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తగా (టీచర్) పనిచేస్తున్న గజ్జల నాగమణి గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సీఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు ప్రాజెక్టు కార్యదర్శి పి. నాగమణి, నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, టీ.కృష్ణార్జునరావు, సర్కిల్ బాధ్యులు ప్రభావతి, వాణిశ్రీ, శ్రీదేవి, జ్యోతి, అరుణ, కల్లూరు మండల అంగన్వాడీ కార్యకర్తలందరూ భౌతిక గాయాని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు విఠల్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలు మరణిస్తే వారిని ఆదుకోవాల్సిన ఉందని, కానీ ఏళ్ల సంవత్సరాల నుండి వారికి కనీస వేతనాలు ఇవ్వటం కానీ మట్టి ఖర్చులు పెంచడం గాని చేయలేదని ఆరోపించారు. అంగన్వాడీ కార్యకర్త చనిపోతే వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వటం కానీ ఏమీ చేయకుండా చేతులు దులుపుకునే పద్ధతుల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన అంగన్వాడి కుటుంబాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఆయాలు కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వైరా మున్సిపాలిటీ పరిధిలో నిర్బంధ పన్నుల వసూళ్లు ఆపాలి

- విలీన గ్రామాల పేదలకు పన్నుల భారం తగ్గించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్
- వైరా మున్సిపాలిటీ కమీషనర్ వేణుకు వినతి

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా చుట్టు పక్కల ఉన్న లాలాపురం, పల్లిపాడు, దుద్దెపూడి, సోమవారం గండగలపాడు గ్రామాలను మున్సిపాలిటీ పేరుతో వైరాలో కలపడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు పన్నుల భారం తప్పా, అదనంగా వచ్చిన ప్రయోజనం ఏమీ లేదని, కొత్తగా ఏర్పాటు అయిన మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజూరు చేసి అభివృద్ధి చేయాల్సిందిపోయి ప్రజలపై పన్నుల భారం మోపటం సరైన పద్ధతి కాదని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ విమర్శించారు. గురువారం సీపీఐ(ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో ఇంటి పన్నుల భారం తగ్గించాలని, స్థానిక సమస్యలను పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలను గురించి ఆలోచించకుండా రాజకీయాల కోసం పాలకులు చూస్తున్నారని, ఇంటి గదులు, ఇంటి నిర్మాణ వైశాల్యంతో పని లేకుండా రెండు గదులు ఉన్న చిన్న, చిన్న ఇండ్లకు కూడా వేల రూపాయలు ఇంటి పన్ను వసూళ్ళ చేస్తున్నారని విమర్శించారు. పార్టీ ఆధ్వర్యంలో గతంలో నిరసన వ్యక్తం చేసినప్పుడు మున్సిపాలిటీ అధికారులు సర్వే చేసి ఇంటి పన్నులను తగ్గించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పి మళ్ళీ పాత పద్ధతిలో వసూలు చేయటం సమంజసం కాదన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అసంపూర్తిగా ఉన్న అంతర్గత రోడ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని, అలాగే ఖాళీ స్థలాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, కెవిసిఎం కళాశాల వెనుక ఏరియాలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, రాజశేఖర్ నగర్ రోడ్డు వెడల్పు పేరుతో స్థానికులు ఇంటి నిర్మాణం కూల్చడం ఆపాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ వెంటనే స్పందించి మున్సిపాలిటీ సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం మున్సిపాలిటీ కమీషనర్ వేణుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, నాయకులు మచ్చా మణి, పారుపల్లి కృష్ణారావు, మల్లేంపాటి రామారావు, కొంగర సుధాకర్, ఎస్.కే నాగుల్ పాషా, గుమ్మా నరసింహారావు, కామినేని రవి, సంక్రాంతి పురుషోత్తం, కురుగుంట్ల శ్రీనివాసరావు, అమరనేని కృష్ణ, రుద్రాక్షుల నరశింహాచారి, పాపగంటి రాంబాబు, పాసంగులపాటి చలపతిరావు, మచ్చా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ సామగ్రితో ప్రజలకు ఇబ్బందులు కల్గించొద్దు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం

భవన నిర్మాణ సామగ్రిని రహదారులపై ఉంచి, ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. వైరా రోడ్‌లో భవన నిర్మాణాలు జరిగే చోట, రోడ్లపై ఇసుక తదితర నిర్మాణ వస్తువులు వేయడాన్ని గమనించిన కలెక్టర్ స్పందించి హెచ్చరిక చేశారు.ఇలా ఉంటే ప్రమాదాలకు ఆస్కారం ఉందని కలెక్టర్ అన్నారు. వీటిపై మునిసిపల్ అధికారులు జరిమానా విధించడంతో పాటు, చట్టరిత్యా చర్యలు చేపడతారని పేర్కొన్నారు.

యార్లగడ్డ వరమ్మ కుటుంబాన్ని పరామర్శించిన వాసిరెడ్డి రామనాధం

నవతెలంగాణ-బోనకల్

బోనకల్ గ్రామ సమీపంలో గత నెల 31న జరిగిన కూలీల ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన బోనకల్ గ్రామానికి చెందిన యార్లగడ్డ వర్మమ్మ కుటుంబసభ్యులను గురువారం తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాధం గురువారం స్థానిక నాయకులతో కలసి పరామర్శించారు. వరమ్మ కుమారుడు ఆంధ్రప్రభ దినపత్రిక విలేకరి యార్లగడ్డ శ్రీనివాసరావుని సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి సంతాప సానుభూతి తెలిపారు.పరామర్శించిన వారిలో మండల కన్వీనర్ రావుట్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు నందమూరి సత్యనారాయణ,మండల నాయకులు మరీదు భరకయ్య, బండి రామరావు, మండేపూడి గోర్కే, తదితరులు పాల్గొన్నారు.



తీన్మార్ మల్లన్న బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు కర్నాటి లక్ష్మారెడ్డి డిమాండ్

నవతెలంగాణ-తల్లాడ

రెడ్డి సంఘాన్ని అవమానపరుస్తూ మాట్లాడిన తీన్మార్ మల్లన్న బేషరతుగా క్షమాపణ చెప్పాలని మండల రెడ్డి సంఘం అధ్యక్షులు కర్నాటి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. తల్లాడలో గురువారం పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తూ అక్రమ సంపాదనలతో ధనాన్ని కూడబెట్టి, అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. బీసీ సంఘం నాయకులు ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ నాయకులు వి.హనుమంతరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ అనేకమంది నాయకులు, ఎవరు ఈ విధంగా ప్రవర్తించలేదని, ఓ వర్గాన్ని టార్గెట్ చేస్తూ, కించపరిచే విధంగా మాట్లాడడం, సమంజసం కాదన్నారు, ఈ కార్యక్రమంలో గొడుగునూరు లక్ష్మిరెడ్డి, దగ్గుల రాజశేఖర్ రెడ్డి, వేమిరెడ్డి వెంకట్ నారాయణరెడ్డి, వేమిరెడ్డి సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఇంజనీర్ కార్యాలయం ముందు మోటార్ సైకిల్ మాయం

నవతెలంగాణ-బోనకల్

మండల కేంద్రంలోని రైల్వే ఇంజనీర్ కార్యాలయం ముందు పెట్టిన పల్సర్ మోటార్ సైకిల్ బుధవారం రాత్రి 9 గంటల సమయంలో మాయం అయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బోనకల్ గ్రామానికి చెందిన రావుట్ల లక్ష్మణాచారి రైల్వే ఇంజనీర్ కార్యాలయం వద్ద బుధవారం రాత్రి 8 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి స్థానిక సుభాష్ చంద్రబోస్ సెంటర్ వైపు ఓ పని నిమిత్తం వెళ్ళాడు. పని ముగించుకొని తిరిగి 9 గంటల సమయంలో వాహనం పార్కు చేసిన వద్దకు రాగా వాహనం కనిపించలేదు. అక్కడ సమీప ప్రాంతంలో ఎక్కడ చూసినా మోటార్ సైకిల్ కనిపించలేదు. దీంతో వాహనం అపహరణకు గురైనట్లు లక్ష్మణాచారి గురువారం విలేకరులు తెలిపారు. పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు లక్ష్మణాచారి తెలిపారు.

తరచూ చోరీకి గురైతున్న ద్విచక్ర వాహనాలు, ఆటోలు:

బోనకల్ పాత రైల్వే గేటు, రైల్వే స్టేషన్, సుభాష్ చంద్రబోస్ సెంటర్లతోపాటు ఇళ్ళ ముందు ఉన్న ద్విచక్ర వాహనాలతో పటు ఆటోలు కూడా ఇటీవల కాలంలో తరచుగా చోరీలకు గురైతున్నాయి. బోనకల్ రైల్వే స్టేషన్ కి చెందిన ఓ వ్యక్తికి చెందిన ఆటోను 15 రోజుల క్రితం రాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు దొంగలించారు. ప్రధానంగా రైల్వే స్టేషన్, బోనకల్ పాత రైల్వే గేట్ ల వద్ద ఉంచిన ద్విచక్ర వాహనాలను చోరీకి గురవుతున్నాయి. కేవలం కొన్ని సమయాలలో అర్ధగంట వ్యవధిలోనే ద్విచక్ర వాహనాలను చోరీకి గురవుతున్నాయి. ద్విచక్ర వాహనాలకు హ్యాండిల్ లాక్ వేసినప్పటికీ సునాయాసముగా దొంగలు ఎత్తుకెళుతున్నారు. సుభాష్ చంద్రబోస్, స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్, రైల్వే స్టేషన్ ప్రాంతాలలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలకు వరంగా మారింది. పట్టపగలే దొంగలు ద్విచక్ర వాహనాలను టార్గెట్ చేసుకొని అపహరించుకొని పోతున్నారు. ఇటీవల కాలంలో అనేక ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. కానీ చోరీకి గురైన ఒక్క మోటార్ సైకిల్ కూడా దొరకపోవడం విశేషం. ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానికులు, మండల ప్రజా ప్రతినిధులు, వాహనదారులు పోలీస్ శాఖ అధికారులను కోరుతున్నారు.

నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

నవతెలంగాణ - బోనకల్

ఈనెల 10న నిర్వహించే నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని అధికారులు ప్రజలు విజయవంతం చేయాలని తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఎంపీడీవో రుణావత్ రమాదేవి, మండల వైద్యాధికారిని వేముల స్రవంతి ప్రజలను కోరారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల టాస్క్ ఫోర్స్ సమావేశం ఎంపీడీవో రుణావత్ రమాదేవి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఫిబ్రవరి 10న జరుగుతుందని, 1-19సం వయస్సు ఉన్న పిల్లలకు అల్బెండజోల్ మాత్రను వేయనున్నట్లు వారు తెలిపారు. అన్ని గవర్నమెంట్, ప్రైవేట్ స్కూల్స్, అంగన్వాడీ సెంటర్‌లు, జూనియర్ కాలేజీ నందు పిల్లలకు మధ్యాహ్న భోజన అనంతరం ఈ మాత్రలను వేయనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య, ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, సిహెచ్వై ఇన్చార్జి మందా దానయ్య, ఐసీడీఎస్ సూపర్వైజర్‌లు పంతంగి రమాదేవి, కొండ సుజాత ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వంగూరి వెంకటేష్

నవతెలంగాణ ఖమ్మం

భద్రాచలంలో జరిగిన పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వంగూరి వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం అహర్నిశలు విద్యార్థులతో మమేకమై ఉద్యమాలు నిర్మిస్తామని వెంకటేష్ అన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఖమ్మం

గుర్తుతెలియని మగ వ్యక్తి శవం ఎన్ఎస్పి కాలువలో కొట్టుకొస్తుండగా, స్థానికుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న ఖానాపూర్ హవేలీ పోలీస్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం గవర్నమెంట్ హాస్పిటల్ మార్చురీకి తరలించారు. మృతుని వయసు సుమారుగా 30 సంవత్సరాలు ఉంటుందని, ఆచూకీ తెలిసినవారు ఖానాపురం హవేలీ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



నిర్వాసితుల సమస్యలు అసెంబ్లీ దృష్టికి తేవాలి

- ఎమ్మెల్యే కూనంనేనికి అఖిలపక్షం వినతి

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి జేకే 5 ఓపెన్ కాస్ట్ విస్తరణ ప్రాంత నిర్వాసితుల సమస్యలు అసెంబ్లీ దృష్టికి తేవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును అఖిలపక్షం కోరింది. జిల్లా కలెక్టర్, సింగరేణి సీ అండ్ఎండితో కలిసి మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సీపీఐ నేత కే.సారయ్య, సీపీఐ(ఎం) నాయకులు అబ్దుల్ నబీ, కాంగ్రెస్ పార్టీ నుండి హరికృష్ణ, టీడీపీ క్లింట్ రోచ్, మాజీ ఎంపీటీసీ పూణేం సురేందర్, బీఆర్ఎస్ నేత సదరం మహేష్, న్యూ డెమోక్రసీ నేత లాలు, సీపీఐ నాయకులు దేవరకొండ శంకర్, మంచాల వెంకటేశ్వర్లు, నజీర్ అహ్మద్, వడ్ల శ్రీనివాస్‌లు కొత్తగూడెంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. జేకే 5 ఓపెన్ కాస్ట్ విస్తరణ ప్రాజెక్టులో నిర్వాసితులకు నిర్వాసిత పునరావాస చట్టం 2013 ప్రకారం పరిహారం చెల్లించకుండా అక్కడ నివసిస్తున్న ప్రజలు తమ లీజులో ఉన్న ప్రాంతం కాబట్టి సింగరేణి సంస్థ ప్యాకేజీ ఇవ్వబోదని అధికారులు చెబుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. నిర్వాసితులకు సింగరేణి ప్యాకేజీ ఇవ్వాలని, నిర్వాసిత కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఈ ప్రాంతంలో సింగరేణి నిధులతో మౌళిక సదుపాయాలని కోరారు.

సాయిబాబా మందిర వార్షికోత్సవ వేడుకలో పాల్గొన్న మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట



మండల కేంద్రం దమ్మపేటలో గల శ్రీ సాయిబాబా ధ్యాన మందిర 30వ వార్షికోత్సవ వేడుక గురువారం ఘనంగా జరిగింది. ధ్యాన మందిర కమిటీ ఆహ్వానం మేరకు అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వార్షికోత్సవ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈక్రమంలో కమిటీ సభ్యులు మెచ్చాను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, మాజీ సర్పంచ్ ఉయ్యాల చిన్న వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన ఏసుబాబు, నియోజకవర్గ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీను, యువ నాయకులు పిట్టల లాలు, పానుగంటి గణేష్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఇల్లందు

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పోలారం గ్రామానికి చెందిన తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కామ్రేడ్ జటంగి వెంకన్న (జేకె) కుటుంబానికి ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ టేకులపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో కుటుంబానికి గురువారం రూ.7550 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, జిల్లా నాయకులు పందిర్లపల్లి వీరన్న, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ టేకులపల్లి మండల అధ్యక్షులు మూడు బిచ్చు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా అమ్మ కోసం కార్యక్రమం

- డాక్టర్ దుర్గాభవాని

నవతెలంగాణ-పినపాక



మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రసవానంతర వైద్యసేవల కోసం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ 'అమ్మ కోసం' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గా భవాని తెలియజేశారు. గురువారం పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసవానంతరం తక్షణం వచ్చే ఇన్ఫెక్షన్లు, కాళ్ల వాపు, నొప్పులు, ఇతర సమస్యలు, మానసిక ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు. ప్రసవం తర్వాత కొంత ఆలస్యంగా వచ్చే ఆరోగ్య సమస్యలపైనా ప్రత్యేక శ్రద్ధ ఉంటుందని తెలిపారు. అమ్మ కోసం కార్యక్రమం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల ద్వారా అమలవుతుందని మహిళలను ఏడాదిపాటు పర్యవేక్షిస్తూ సమస్యలుంటే వైద్యం అందిస్తామని జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేశారు

- ఉద్యోగవిరమణ పొందుతున్న జీఎం ప్రసాద్(మార్కెటింగ్)కు సన్మానం

నవతెలంగాణ-ఇల్లందు

మార్కెటింగ్ జీఎం డీఆర్ ప్రసాద్ సింగరేణి సంస్థలో వివిధ హోదాలలో పనిచేశారని, వారు చేసిన సేవలు మరువలేనివని, అంకితభావంతో పని చేసి అందరిమన్నలను పొందారని, ఆయన శేష జీవితం సుఖమయంగా ఉండాలని ఏరియా జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య అన్నారు. ఈ నెల పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య, ఇతర ఉన్నతాధికారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రామస్వామి, ఏజీఎం (ఐఈడీ) యం.గిరిధరరావు, ఏరియా ఇంజనీర్ నరసింహ రాజు, డీజీఎం (పర్సనల్) జి.వి.మోహనరావు, డీజీఎం (సివిల్) రవికుమార్, ఫైనాన్స్ మేనేజర్ మధుబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎంతో ఎస్టీ నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఎంపీ భేటీ

- సమస్యల ఏకరువు

నవతెలంగాణ-ఇల్లందు



ఎస్టీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎంపీలు హైదరాబాదులో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజనుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎంను కోరారు. ఆదివాసి ప్రాంతాల్లో రహదారులు ఇందిరమ్మ ఇండ్లు, బోరుబావులు, విద్యుత్తు, పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్కతో పాటు ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, రాందాస్ నాయక్ పాల్గొన్నారు.

ఐలయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ
- పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



అమరజీవి కామ్రేడ్ కాసాని ఐలయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. కామ్రేడ్ కాసాని ఐలయ్య సంతాప సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముందుగా ఐలయ్య చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మచ్చా మాట్లాడుతూ... దేశం, రాష్ట్రంలో పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్లో పేదలు, కార్మికులు, ఉద్యోగులు, రైతాంగం సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడే విధంగా బడ్జెట్‌ని రూపొందించారని, ప్రజా ప్రయోజనాలను విస్మరించారని అన్నారు. ఈ బడ్జెట్‌లో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు చూపించే మార్గం చూపలేదని అన్నారు. ఇది ఎన్నికల బడ్జెట్ లా ఉన్నదని ఎన్నికలు జరగబోయే ఢిల్లీ, బీహార్ రాష్ట్రాలకు ఎక్కువ నిధులు కేటాయించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నిధులు కేటాయించకుండా మోసగించారని అన్నారు. తెలంగాణ నుండి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా నిధులు రాబట్ట లేకపోయారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు పెంచుతూ కేంద్రం ఆమోదించిందని, ఇది ఈ ప్రాంతానికి తీవ్ర నష్టమని అన్నారు. భద్రాచలంకు బీజేపీ తీవ్ర ద్రోహం చేస్తుందని దుయ్యబట్టారు. రానున్న కాలంలో అమర జీవి కామ్రేడ్ కాసాని ఐలయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి.నర్సారెడ్డి, కే.బ్రహ్మాచారి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, సీనియర్ నాయకులు బిబిజి తిలక్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకట రామారావు, డి.సీతాలక్ష్మి, పట్టణ కమిటీ సభ్యులు యు.జ్యోతి, జీవనజ్యోతి, డి.రాఘవయ్య, అజయ్ కుమార్, కోరాడ శ్రీనివాస్, సిహెచ్ మాధవరావు, ఎస్‌డీ.ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

మార్చి 3న కాసాని సంస్మరణ సభ : మచ్చా



సుజాతనగర్ : సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్ కాసాని అయిలయ్య సంస్మరణ సభ మార్చి మూడో తారీఖున నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కమిటీ సమావేశం నర్రా శివరామకృష్ణ అధ్యక్షతన నిర్వహించగా మచ్చా హాజరై మాట్లాడారు. ఈ సంస్మరణ సభకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ బి.వి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర, జిల్లా నాయకత్వం పాల్గొంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ, పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్, కాట్రాల తిరుపతిరావు, గండమాల భాస్కర్, బచ్చలికూర శ్రీనివాస్, చప్పిడి వెంకటేశ్వర్లు, గూని నాగచందర్, కొండె కృష్ణ, పుల్లయ్య, వీర్ల మల్లేష్, సత్యం, శ్రీకాంత్, శంకర్, కుమారి, జ్యోదిరామ్, గోవర్ధన్, బాలు, వెంకటేశ్వర్లు, నాగేష్, నాగరత్నమ్మ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు లోగా మున్సిపాల్టీకి తుది రూపు

- కమిషనర్ కే.సుజాత

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఈ నెలాఖరు లోగా అశ్వారావుపేట మున్సిపాల్టీకి పరిపాలన, భౌగోళికంగా తుది రూపు సంతరించుకోనుందని కమిషనర్ కే.సుజాత గురువారం నవతెలంగాణకు తెలిపారు. ఇప్పటికే మూడు పంచాయతీలకు చెందిన గణాంకాలు, గత కాలం ఆర్థిక లావాదేవీలకు చెందిన నివేదికలు, స్థిర చరాస్తుల వివరాలను సేకరించడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఈ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న కార్యదర్శులు, కార్యనిర్వాహణ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల వివరాలతో కూడిన సమాచార నివేదికను మున్సిపల్ శాఖకు పంపుతాం అని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం సిబ్బందికి విధులు కేటాయిస్తామని అన్నారు. త్వరలో మున్సిపాలిటీ భౌగోళిక పటం రూపొందించి, వార్డుల విభజన చేపట్టి ఓట్లు కేటాయించి నమూనా ప్రకటించి అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. వారివెంట పీఏ చావా రవి ఉన్నారు.

10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం రోజున 1 నుండి 19 సంవత్సరాల వయసు గల వారందరికీ నులిపురుగులను నివారించే ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో ప్రతి విద్యార్థులకు మాత్రలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మాత్రల ద్వారా పిల్లల్లో రక్తహీనత, బుద్ధిమధ్యం నివారించవచ్చు, చదువుల పట్ల ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. విద్యాశాఖ, ఏఎన్ఎం, అంగన్వాడీలు సమన్వయంగా పనిచేసి జిల్లాలోని విద్యార్థులందరికీ మాత్రలను అందివ్వాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు, అంగన్వాడీ పిల్లలకు మాత్రలు అందించాలన్నారు. అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చి వయసుల వారీగా మాత్రల డోస్ ఇవ్వాలన్నారు. భోజనం తర్వాతనే ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. మాత్రలు వేసే ప్రదేశంలో తగినంత తాగునీరు అందుబాటులో ఉంచుకోవా లన్నారు. జిల్లాలో 336,212 మంది ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల వారు ఉన్నారని ఆయన తెలిపారు. వారందరికీ మాత్రలు అందించాలని తెలిపారు. ప్రత్యేక షెడ్యూల్‌ని ఏర్పరచుకొని నులిపురుగుల నిర్మూలన మాత్రలు అందివ్వాలి అన్నారు. ప్రజలకు అల్బెండజోల్ మాత్రల ఉపయోగాలపై కళా జాతర బృందాలు, మహిళా సమాఖ్యల ద్వారా విస్తృత అవగాహన కల్పించి, పిల్లలందరూ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. 10వ తేదీన మాత్రలు తీసుకొని వారికి 17వ తేదీన మాప్ అఫ్ డే నిర్వహించి మాత్రలు అందించాలన్నారు. ప్రయివేటు విద్యాసంస్థలు అన్ని విద్యార్థులకు మాత్రలు అందేలా చూడాలని, అనంతరం నివేదికలు సమర్పించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, డీసీహెచ్ఓ రవిబాబు, మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, ఎస్సీ డెవలప్మెంట్ అధికారి అనసూయ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కడుపు మాడుస్తున్న ప్రభుత్వం

- సీఐటీయూ కన్వీనర్ ఎం.బి.నర్సారెడ్డి
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆసుపత్రి కార్మికుల ధర్నా
- సూపర్డెంట్ రామకృష్ణకి వినతి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు గత ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా వాళ్ల కడుపులు మాడుస్తూ, అనేక ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల చర్యలను నిరసిస్తూ ఏరియా హాస్పిటల్ ముందు శానిటేషన్ పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది ముకుమ్మడిగా హాస్పటల్ గేటు ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతూ... హాస్పటల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చే అరకొర వేతనాలు కూడా సక్రమంగా సకాలంలో ఇవ్వకపోవడం వలన వారి ఆర్థిక పరిస్థితి మరింత దిగజారి అప్పులు కూడా దొరకక ఇంటిలో ఉన్న వస్తువులను తనకా పెట్టుకుని జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఇంటి అద్దె, పిల్లల స్కూలు ఫీజులు కట్టలేక నిత్యావసర వస్తువులు ఇచ్చే కిరాణాల్లో ఇవ్వకపోవడం వలన ఏమి చేయాలో పాలు పోని పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. గత ప్రభుత్వంలో కూడా ఇదే విధానం కొనసాగినప్పటికీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఏమాత్రం మార్పు లేకపోవడం వలన వారి జీవితాల అగమ్య గోచరంగా మారినాయని విమర్శించారు. కార్మికుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు ఎంపీలు కరెక్ట్ గా ప్రతినెలా లక్షల లక్షలు జీతాలు పొందుతూ కార్మికుల సమస్యలు మాత్రం అసెంబ్లీలో చర్చించే తీరిక కూడా లేకపోవడం చాలా దుర్మార్గమని విమర్శించారు. ఇది ప్రజా ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ మేము బ్రహ్మాండంగా ఆసుపత్రులకు నిధులు కేటాయిస్తున్నామని డాంబిగాలు పలుకుతున్నదే తప్ప ఆచరణలో శూన్యమని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కార్మికుల జీతభత్యాల విషయంలో కలగజేసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వారి వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలు విడుదల చేయకపోతే ఈ నెల 15వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు దిగుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానికంగా ఉన్నటువంటి పీఓ, కలెక్టర్ చొరవ చూపి వీరి సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏరియా ఆసుపత్రి సిబ్బంది సూపర్డింట్ ముదిగొండ రామకృష్ణకు వినతి పత్రం అందించారు. కార్మికుల ఉద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ... కార్మికుల సమస్యలను అధికార దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎం.శివాజీ, సీఐటీయూ నాయకులు అజయ్ కుమార్, రాఘవయ్య, హాస్పటల్ కార్మిక సంఘ నాయకులు రమ, రమణమ్మ, కృష్ణ, నరేంద్ర, రమేష్, వరలక్ష్మి, అంజలి కుమారి, బయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఏఆర్ ఎస్ఐ ఆత్మహత్య

నవతెలంగాణ-పినపాక



మండల పరిధిలో గల ఈ.బయ్యారంలో ఏఆర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నర్సయ్య గురువారం ఉదయం ఉరి వేసుకుని ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రాలో ఆత్మహత్య చేసుకున్నాడు. నరసయ్య భార్య సునీత ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తుంది. ఏఆర్ ఎస్ఐ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ బయ్యారం పోలీస్ సిబ్బంది ఆయన మృతి పట్ల సంతాపం తెలియజేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజకుమార్, స్థానిక పోలీస్ సిబ్బంది, టీఎస్పీఎస్పీ సిబ్బంది సంతాపం తెలుపుతూ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమైన విషయం అన్నారు.

రిమాండ్‌లో ఉన్న లక్కినేనికి అస్వస్థత

నవతెలంగాణ-ఇల్లందు



నకిలీ విత్తనాల విషయమై రైతుల ఫిర్యాదు మేరకు టేకులపల్లి మండలం పీఏసీఎస్ చైర్మెన్ లక్కినేని సురేందర్‌ను ఇటీవల పీడీ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఇల్లందు సబ్ జైల్లో రిమాండ్‌లో ఉన్నారు. గురువారం అస్వస్థకు గురికాగా ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విరోచనాలు అయ్యాయని, బీపీ, షుగర్ లెవెల్స్ పడిపోయాని వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం పరిస్థితి మెరుగుపడింది. ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

సింగరేణి పరిరక్షణకు పోరాటం తప్పదు

- సింగరేణిలో పెరిగిన రాజకీయ జోక్యం
- కొత్తమైన్స్ విషయంలో కనిపించని ప్రభుత్వ చిత్తశుద్ధి
- ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం



తెలంగాణ గుండెకాయ అయిన సింగరేణి సంస్థ పరిరక్షణకు పోరాటాలు చేయనున్నట్లు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో సిరుల తల్లి సింగరేణి కనుమరుగు కానున్నదని, తెలంగాణ రాష్ట్రంలో బొగ్గు గనుల నిర్వహణ ప్రయివేటువారికి కట్టబెట్టి, ఇతర రాష్ట్రాలో సింగరేణి బొగ్గు తవ్వకాలు చేయడం విడ్డూరమని, గతం కంటే ఇప్పుడు సింగరేణిలో సంస్థలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిందని, దీంతో మచ్చలేని సింగరేణి సంస్థలకు కింది నుండి పై స్థాయిదాకా అవినీతి మరకలే....! అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఘాటుగా విమర్శించారు. గురువారం కొత్తగూడెం బాబు క్యాంపులోని సీపీఐ కార్యాలయంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్‌లు పాల్గొన్న ఈ మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా, గుండెకాయగా ఉన్న సింగరేణికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, లక్ష మందితో కళకళలాడే సింగరేణి నేడు కళ తప్పిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన కొత్త మైన్స్ రాకపోగా, బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. సింగరేణి సిఎండి బలరాం మంచివాడే అయినప్పటికీ ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం నడుచుకుంటున్నారని, సింగరేణిలో గత ప్రభుత్వం లాగే రాజకీయ జోక్యం పెరిగిపోయిందని తీవ్రంగా విమర్శించారు.

అనంతరం సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ.. సింగరేణి నేడు త్రిశంకు స్వర్గంలో ఉన్నదని, అసలు దీనికి బాధ్యులు ఎవరూ లేని పరిస్థితి ఉన్నదని విమర్శించారు. సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు ముందుగా అనే పొడిగింపు ఇవ్వాల్సి ఉండగా గత రెండు నెలలుగా ఎక్స్‌టెన్షన్ దాటవేసుకుంటు వస్తున్నారని, కాలయాపన చేశారన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ పేరుతో కార్మిక సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులకు సొంతింటి పథకానికి 200 గజాల స్థలం, రూ.25 లక్షల వడ్డీ లేని బ్యాంకు రుణాలు ఇప్పిస్తే, కార్మికులకు క్వార్టర్స్ నిర్మించాల్సిన అవసరం ఉండదని సూచించారు. కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో హై పవర్ వేతనాలు ఇస్తుంటే సింగరేణిలో వేతనాలు సరిగా ఇవ్వడం లేదని అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో కేంద్ర కమిటీ నాయకులు, వివిధ బ్రాంచిల కార్యదర్శులు కె.రాజ్ కుమా ర్, ఏం.వెంకటస్వామి, మిర్యాల రంగయ్య, కె.సారయ్య, వైవి.రావు, మద్ది ఎల్లయ్య, బాజీ సైదా, వెంకట్, వై.రాంగోపాల్, అక్బర్ అలీ, మల్లికార్జున్ రావు, రాజా రత్న య్య జి.వీరాస్వామి, రమణమూర్తి, నజీర్ అహ్మద్, రవీందర్, మల్లేష్, సుధాకర్, కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.



రైతుకు భరోసా...రూ.9.92 కోట్లు

- రైతుల ఖాతాల్లో జమ
- ఏడీఏ రవికుమార్

నవతెలంగాణ-అశ్వారావుపేట

నియోజక వర్గంలోని 5 మండలాల్లో ఎకరం లోపు రెవిన్యూ పట్టా ఉన్న 5232 మంది రైతులకు రూ.9 కోట్ల 92 లక్షల ఆయా రైతుల ఖాతాల్లో జమ అయినట్లు వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు పి.రవి కుమార్ గురువారం తెలిపారు. ఈ నిధులను సాగు నిమిత్తం రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండలం	రైతులు	భరోసా
అన్నపురెడ్డిపల్లి	438	83,00,000
అశ్వారావుపేట	1607	3,45,000000
చంద్రుగొండ	671	94,00,000
దమ్మపేట	1532	2,99,00,000
ములకలపల్లి	984	1,70,00,000
మొత్తం	5232	9,92,00,000

యువసేన వాలంటరీ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

- పాల్గొన్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ-పాల్వంచ



పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఖమ్మం సహకారంతో భద్రాద్రి యువసేన వాలంటరీ సర్వీస్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచలో ఆటల పోటీలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భద్రాద్రి యువసేన వాలంటరీ సర్వీస్ ఆర్గనైషన్ అధ్యక్షుడు బానోత్ వెంకట్, కళాశాల ప్రిన్సిపల్ రిబ్బన్ కట్ చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ ఆటల పోటీలో మహిళలకు కబడ్డీ, షటిల్, రన్నింగ్, పురుషులకు వాలీబాల్, రన్నింగ్, షటిల్, నిర్వహించి విజేతలకు బహుమతులతో పాటు మెడల్స్ సర్టిఫికెట్, క్రీడా సామగ్రిలు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గంగిరెడ్డి యుగేందర్ రెడ్డి, జె.అబ్రహం, భద్రాద్రి యువ సేన ఫౌండర్ భూక్యా వెంకటేశ్వర రావ్, ఎ.వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఏకెనామిక్స్ ప్రొఫెసర్, పి.శ్రీనివాస్ రావ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దీప్తి వర్షితను అభినందించిన కలెక్టర్

నవతెలంగాణ-కొత్తగూడెం



ఇంగ్లీషు లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) తెలంగాణా, ఎస్‌సీఈఆర్‌టీ సంయుక్తంగా ఇటీవల భద్రాద్రి జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంగ్లీషు ఒలింపియాడ్, వక్తృత్వ పోటీలలో చుంచుపల్లి మండలంలోని బాబు క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దీప్తి వర్షిత వక్తృత్వ పోటీలు నందు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం విజేతగా నిలిచింది. జనవరి 31న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రశంసా పత్రం అందుకున్న సందర్భంగా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ విద్యార్థినిని అభినందించారు. గురువారం కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని హనుమాన్ బస్తీలో ఒక ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్‌ను పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎల్టా సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ దస్తగిరి కలిసారు. ఆంగ్ల భాషలో ప్రతిభ కనబరిచిన దీప్తి వర్షిత గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా అన్ని పోటీల్లో పాల్గొని మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సావిత్రి, రవికుమార్, జాన్ విక్టర్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల కేసులో ఇరుక్కుంది బీఆర్ఎస్ నేతనే

- కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదు
- అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి
- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు

నవతెలంగాణ-ఇల్లందు



టేకులపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ నేత, పీఏసీఎస్ చైర్మెన్ నకిలీ విత్తన కేసులో ఇరుక్కుని జైలు పాలయ్యారని, ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పట్టణ, మండల అధ్యక్షులు పులి సైదులు, డానియల్, మాజీ మున్సిపల్ చైర్మెన్ అనసూయ, నియోజవర్గ నేతలు మడుగు సామమూర్తి, సూర్యం, నవీన్ తదితరులు అన్నారు. స్థానిక జేకే కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెల్లని రూపాయికి గీతలెక్కువ అన్నారు. రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టి వారిని ఇబ్బందుల పాలు చేశారని అన్నారు. చట్ట ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ విషయాన్ని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, హరిప్రియ సమర్థించడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారని ఈ ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయంగా ఎదుర్కోవడానికి అబద్ధపు ప్రచారాలు చేయటం సరికాదన్నారు. దశాబ్దాలుగా దేశాన్ని రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టులు, రైల్వేలు, విమానాశ్రయాలు, పరిశ్రమలు ఎన్నింటినో నిర్మాణం చేసిన ఘనత ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని పరిపాలించిన పదేళ్లలో లక్షల కోట్లు అప్పులపాలు చేసిందన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకే బాల మేళా

- ఎంఈఓ ప్రసాదరావు

నవతెలంగాణ-అశ్వారావుపేట



విద్యార్థుల్లో నెలకొని ఉన్న అంతర్గత సృజనాత్మకతను వెలికి తీసేందుకే బాల మేళా నిర్వహిస్తున్నామని ఎంఈఓ ప్రసాదరావు తెలిపారు. ఆయన గురువారం మామిళ్ళవారిగూడెం కాంప్లెక్స్ పరిధిలో గల యూపీఎస్ తిరుమలకుంట, ఎంపీపీఎస్ తోగ్గూడెం పాఠశాలలలో బాలమేళా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృజనాత్మక నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. మండల పరిధిలోని గుర్రాల చెరువు, వడ్డె రంగాపురం, వినాయకపురం పాఠశాలల్లో కూడా బాల మేళా ఉత్సవాలను ఒక పండుగ వాతావరణంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు షాహినాబేగం, పద్మావతి, హరిత, వీరేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి శాఖలోని నియామకాలపై స్పష్టతనివ్వాలి

- మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఎండీ.యాకూబ్ పాషా

నవతెలంగాణ-పాల్వంచ

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కింద స్థాపించబడినట్టు చెబుతున్న నేషనల్ రూరల్ డెవలప్ మెంట్ అండ్ రీక్రియేషన్ మిషన్ (ఎన్ఆర్‌డీఆర్ఎం) అనే సంస్థ పరిధిలో ఉమ్మడి రాష్ట్రాల్లో నియామకాలు చేపడుతున్నట్లు వచ్చిన ఉద్యోగ ప్రకటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టతనివ్వాలని మైనారిటీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.యాకూబ్ పాషా గురువారం ఒక ప్రకటనలో కోరారు. గత రెండు రోజుల నుండి పలు దినపత్రికలలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలోని పలు విభాగాల్లో 13,762 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యోగ ప్రకటనలు రావడంతో స్పందించిన నిరుద్యోగులు ఈ ఉద్యోగాలకు ఆన్లైన్ చేసుకోవటానికి ఒకపక్క సిద్ధమవ్వగా, మరో పక్క ఈ ఉద్యోగ నియామక నోటిఫికేషన్ ఫేక్ అని పలు పత్రికా సంస్థల ద్వారా సోషల్ మీడియా వేదికగా ప్రకటనలు వస్తున్నాయని, ఈ నియామకాల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ చేసి స్పష్టతనిచ్చి నిరుద్యోగులకు ఉన్న అనుమానాలను నివత్తి చేయాలని, లేని యెడల రాష్ట్రంలోని నిరుద్యోగుల వివరాలు సైబర్ నేరగాళ్ళ పరిధిలోకి వెళ్ళే ప్రమాదముందని హెచ్చరించారు.

పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందజేయాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందజేయాలని డాక్టర్ రాకేష్ సూచించారు. గురువారం కొత్తగూడెం మండల పరిధిలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సహాయబస్తీ, రామవరం, పాత కొత్తగూడెం, పిపి యూనిట్ సిబ్బందికి డాక్టర్ రాకేష్ ఆధ్వర్యంలో లైన్ డిపార్మెంట్ అందరికీ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం అమలు చేయడంపై మండల స్థాయి టాస్క్ ఫోర్స్ మీటింగ్ స్థానిక కొత్తగూడెం మునిసిపల్ ఆఫీస్‌లో నిర్వహించారు. పట్టణ పరిధిలో గల ప్రభుత్వ ప్రవేటు పాఠశాలలో చదువుతున్న పిల్లలందరికీ ఇంటర్మీడియట్, జూనియర్ కళాశాల చదువుతున్న పిల్లలకు, 19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ నులిపురుగు నివారణ మాత్రలు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాము, డాక్టర్ దుర్గ, డాక్టర్ రిషిత,కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, మండల విద్యాధికారి ప్రభు దయాల్, హెచ్ఇఓ రాంప్రసాద్, కరుణేశ్వరి, శ్రీనివాస్, శారదా అంగన్వాడీ సూపర్ వైజార్స్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వెంటనే అమలు చేయాలి

- మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాము

నవతెలంగాణ-దమ్మపేట



జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము డిమాండ్ చేశారు. గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాజకీయ నాయకులకు, మాఫియాలకు, రౌడీలకు, గుండాలకు సవాలుగా తన కలాన్ని నమ్ముకొని నిజాయతీగా, నిర్భయంగా ప్రజలకు న్యాయం జరిగే విధంగా తెల్లవారక ముందే వార్తలు ప్రజల వద్దకు తీసుకెళ్తున్న విలేకరులకు న్యాయం జరగడం లేదన్నారు. రాష్ట్ర మంత్రులు తక్షణం స్పందించి జర్నలిస్టులందరికీ ఇళ్ళ స్థలాలు ఇచ్చి గౌరవాన్ని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే వారికోసం మాస్‌లైన్ ప్రజాపోరాటాలు చేస్తుందని ఆమన హెచ్చరించారు.

12న జాబ్ మేళా : పీఓ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ భద్రాచలం ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో గల గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రయివేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించే నిమిత్తం ఈ నెల 12న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో నేరుగా ఉపాధి కోసం మెడ్ ప్లస్ నవత రోడ్డు ట్రాన్స్పోర్ట్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు, గిరిజన నిరుద్యోగ యువతకు ఐటిసి ప్రథమం సంస్థ ద్వారా బ్యూటీషియన్ అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ శిక్షణలను రెండు నెలల ఉచిత భోజన వసతితో పాటు శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. విద్యార్హతలు ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇన్ ఫార్మసీ డిప్లొమా, పీజీ, బీటెక్ చదివి ఉండవలెనని ఆయన అన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ గిరిజన యువత విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ జిరాక్స్ సర్టిఫికెట్లతో ఈనెల 12వ తేదీ ఉదయం 9 గంటలకు ఐటీడీఏ భద్రాచలం ప్రాంగణంలో గల యూత్ ట్రైనింగ్ సెంటర్ నందు ఇంటర్వ్యూకి హాజరు కాగలరని పూర్తి సమాచారం కోసం 8179925586, 6302608905 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయి

- ఘనంగా ప్రారంభమైన జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్-2025
- ప్రారంభించిన ఎస్పీ రోహిత్ రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం





క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. గురువారం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్, హేమచంద్రపురంలోని పోలీసు పెరేడ్ మైదానం, క్రీడా మైదానంలో జిల్లా పోలీసుల యాన్యువల్ స్పోర్ట్స్ మీట్-2025 ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ ఈ కార్యక్రమానికి పాల్గొని జిల్లా పోలీస్ శాఖలోని విభాగాల వారీగా చేసిన అద్భుతమైన పెరేడ్‌ను తిలకించారు. అనంతరం యానిమల్ స్పోర్ట్స్ మీట్ ఫ్లాగ్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్, ఎస్పీ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖలో పనిచేసే పోలీస్ అధికారులు, సిబ్బంది నిత్యం తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారన్నారు. విధుల నిర్వహణలో భాగంగా నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి ఆటవిడుపు, మానసికొల్లాసం కోసం ఈ క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ క్రీడలలో ఆసక్తిగల పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ, షటిల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్, 5 కిలోమీటర్ల పరుగు పందెం వంటి క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గెలుపోటములు సహజమని క్రీడాకారులందరూ స్పోర్టింగ్ స్పిరిట్‌తో ఆడాలని అన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది తమ తమ శారీరక సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, మానసికోల్లాసానికి ఏర్పాటు చేసిన ఈ క్రీడలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్ పేరెడ్ ఏర్పాట్లను అద్భుతంగా తయారుచేసిన అధికారులను అభినందించారు. అనంతరం ముందుగా హెూంగార్డ్స్ టీమ్, పాల్వంచ సబ్ డివిజన్ మధ్య జరిగిన వాలీబాల్ మ్యాచ్‌ను టాస్ వేసి ఎస్పీ ప్రారంభించారు.

జీపీలో సమస్యలపై సెక్రటరీలు ప్రత్యేక దృష్టి సారించాలి

- తాగునీటి సమస్య లేకుండా చూడాలి
- డీఎల్పీఓ సుధీర్ కుమార్

నవతెలంగాణ-పినపాక



గ్రామపంచాయతీలో ప్రాథమికంగా ఉండే సమస్యలపై సెక్రటరీలు ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్పిఓ సుధీర్ కుమార్ సెక్రెటరీలకు సూచించారు. గురువారం ఆయన పినపాక మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. ఎంపీఓ వెంకటేశ్వరరావుతో కలిసి సీతారామపురం, పినపాక, సీతంపేట గ్రామపంచాయతీలను పరిశీలించారు. గ్రామపంచాయతీలలో డంపింగ్ యార్డ్, స్మశాన వాటిక, కంపోస్ట్ ఎరువు తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. ప్రతిరోజు సేకరించిన చెత్తలో తడి చెత్తలో పొడి చెత్తను వేరుచేసి కంపోస్ట్ ఎరువుగా తయారు చేయడానికి ఆయన పరిశీలించి తగు సూచనలు, సలహాలు చేశారు. గ్రామ సెక్రటరీలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, పైప్ లీకేజీ పనులు ఉంటే సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత పంచాయతీలది అన్నారు. అనంతరం సీతంపేట, భూపాలపట్నం గ్రామపంచాయతీలలో రికార్డులను పరిశీలించారు. ప్రతిరోజు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మా జీతం మాకు ఇచ్చే వరకూ పోరు ఆగదు

- గ్రామ పంచాయతీ కార్మికుల పొట్ట కొడితే చూస్తూ ఊరుకోం
- ఆరవ రోజు చేరిన కార్మికుల సమ్మె
- పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపిన సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం



మా జీతం మాకు ఇచ్చే వరకు పోరు ఆగదని, గ్రామ పంచాయతీ కార్మికుల పొట్ట కొడితే చూస్తూ ఊరుకోమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె.రమేష్ హెచ్చరించారు. గురువారం ఆరవ రోజుకు చేరిన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపింది. లక్ష్మీదేవిపల్లిలోని దీక్షా శిబిరం వద్దకు చేరుకుని సీఐటీయూ పూర్తి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఏజే.రమేష్ మాట్లాడారు. సీఐటీయూ, కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా ప్రతి నెల రూ.12,500ల ఫిక్స్ వేతనం ఇస్తున్నారని తెలిపారు. రోజంతా కష్ట పడి పనిచేస్తూ, గ్రామాలన్నీ శుభ్రతగా ఉంచుతున్నారని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ, గ్రామాల అభివృద్ధికి తోడ్పడుతున్న కార్మికులకు చాలి చాలని వేతనాలు సరిపోక జీవితాలను వెళ్లదీస్తున్నారని తెలిపారు. కష్ట జీవులకు అధికారులు అండగా ఉండకుండా గత నెల నుండి పాలకవర్గం లేదు అనే తప్పుడు నిర్ణయాలతో జీతాలు తగ్గిస్తూ రూ.9500లు ఇస్తామని చెప్పడం కార్మికుల పొట్ట కొట్టడమే అవుతుందన్నారు. ఇలా అధికారులు తీసుకున్న నిర్ణయం సరైంది కాదని, తప్పుడు నిర్ణయాలతో మా బతుకులు ఆగం చేస్తే ప్రతిఘటన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. లక్ష్మీదేవి పల్లి మండల కేంద్రంలో ఉన్న ఆరు పంచాయతీల కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె సమస్య పరిష్కారం అయ్యేవరకు కొనసాగించే అవకాశం ఉందని అన్నారు. కార్మికుల సమ్మెకు మద్దతు సంపూర్ణంగా ఉంటుందని, దశల వారీగా ఉద్యమాలు చేస్తున్నామన్నారు. స్థానిక శాసన సభ్యుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేద్దామన్నారు. అధికారులు తీసుకున్న నిర్ణయం సరైంది కాదని, చాలి చాలని వేతనాలు అమలు చేస్తే ప్రతిఘటన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు మద్దతు తెలిపిన వారిలో సీఐటీయూ నాయకులు భూక్యా రమేష్ తదితరులు ఉన్నారు.

పాత పద్ధతిలోనే కార్మికులకు జీతాలు చెల్లించాలి

బీజేపీ మండల అధ్యక్షులు మాలోత్ గాంధీ నాయక్

గ్రామ పంచాయతీలలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు పాత పద్ధతిలోని జీతాలు చెల్లించాలని లక్ష్మీదేవిపల్లి మండల బీజేపీ అధ్యక్షులు మాలోత్ గాంధీ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాన సెంటర్‌లో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న కార్మికుల సమ్మె శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి రేకుల షెడ్డు

- ప్రమాద భరితంగా దానవాయిపేట రోడ్డు
- అవస్థలు పడుతున్న ఆదివాసీలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

నవతెలంగాణ-చర్ల



ఒకపక్క రోడ్డు ప్రమాదాలు ఘోరంగా జరుగుతూ ఉంటే మరోపక్క ఆర్ కొత్తగూడెం గ్రామంలో ఓ వ్యాపారి రోడ్డుపైకి రేకుల షెడ్డు నిర్మించడం వలన ఆర్ కొత్తగూడెం నుండి కుర్నపల్లి వెళ్లే బీటీ రోడ్డు ఇరుకుగా మారింది. ఆ దారి వెంట వెళ్లే పలు వాహనాలకు ప్రయాణ అంతరాయం కలుగుతుందని ఆ ప్రాంతవాసులు విమర్శిస్తున్నారు. ఉదయం, సాయంత్రం ఆ రోడ్డు పైనుండి వచ్చే వ్యవసాయ కూలీల ట్రాక్టర్ల రద్దీ వలన మరింత ఇబ్బంది కలుగుతుందని, ఒకపక్క ఆటోలు, మరోపక్క వ్యవసాయ కూలీల ట్రాక్టర్ల వలన ఆర్ కొత్తగూడెం నుండి కుర్నపల్లి వెళ్లడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. కూలీల ట్రాక్టర్లు వచ్చే సమయంలో రద్దీ వలన ఆ రోడ్డుపై ప్రయాణం చాలా కష్టతరంగా ఉందని ఆర్ కొత్తగూడెం, దానవాయిపేట, బోధనెల్లి, కుర్ణపల్లి, బూరుగుపాడు వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ నవతెలంగాణలో వచ్చిన కథనాలకు పంచాయతీ అధికారులు నామ మాత్రంగా చర్యలు తీసుకున్నట్లు మభ్యపెట్టి రోడ్డుపైకి వచ్చిన రేకుల షెడ్లను తొలగించే విధంగా చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేమిటి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీరాజ్ చట్ట ప్రకారం డ్రయినేజీ దాటి రహదారిపైకి ఎటువంటి నిర్మాణాలు రాకూడదని అలా వచ్చినట్లయితే భూ ఆక్రమణ చట్టం ప్రకారం షెడ్లు నిర్మించిన వారిపై చర్యలు చేపట్టవలసి ఉంది. కానీ అలా చేయకుండా పంచాయతీ అధికారులు మీన మీసాలు లెక్కపెట్టడంలో అంతర్గత విషయాలు ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగి పిట్టల్లా ప్రజలు చనిపోతూ ఉంటే రహదారులను సైతం ఆక్రమించి రేకుల షెడ్లు నిర్మించే వారిపై పంచాయతీ అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టి రోడ్డును ఆక్రమించిన రేకుల షెడ్లను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ రైతుకు రైతుభరోసా అందుతుంది

- కాంగ్రెస్ మాట ఇచ్చిందంటే సువర్ణరేఖతో సమానం
- కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం

నవతెలంగాణ-పినపాక



కాంగ్రెస్ మాట ఇచ్చిందంటే మాట తప్పే పార్టీ కాదని, ఆరు నూరైనా ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం అన్నారు. గురువారం ఆయన ఈ బయ్యారం క్రాస్ రోడ్డు గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ బాట ఇచ్చిందంటే అది సువర్ణరేఖతో సమానం అన్నారు. ప్రతి రైతుకు రైతుబంధు అందుతుందన్నారు. ఒక ఎకరా లోపు గల రైతులకు అందరికీ రైతు బంధు నిధులు జమ అయ్యాయని తెలిపారు. కొద్దిరోజుల్లోనే రైతులందరికీ రైతుబంధు అందుతుందన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చని బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలకు ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తుందని మండిపడ్డారు. ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే పాయం హయాంలో నియోజకవర్గం మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. రాబోయే గ్రామపంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ ఢంకా మోగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవాతి శ్రీను, అర్జున్, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం చేసిన ప్రయివేట్ ఎలక్ట్రీషియన్లు

నవతెలంగాణ-చంద్రుగొండ

ప్రయివేట్ ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్న వెంకటాచారి గుండెపోటుతో బుధవారం మృతి చెందడంతో ఆయన కుటుంబానికి గురువారం మండల నూతన ప్రయివేట్ ఎలక్ట్రీషన్ యూనియన్ సభ్యులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబానికి రూ.6000 ఆర్థిక సహాయం అందజేసినట్లు నూతన యూనియన్ అధ్యక్షుడు దాసరి కృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో నూతన యూనియన్ సభ్యులు ఆసిఫ్ పాషా, బడుగు రాములు, లక్ష్మను, చాపలమడుగు సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే చారిత్రకాత్మక నిర్ణయం కులగణన

- స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్
- ఓబీసీ జిల్లా అధ్యక్షులు అల్లాడి నరసింహారావు

నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, విద్య, ఆర్థిక, ఉపాధి, రాజకీయ కులగణన దేశంలోనే ఒక చారిత్రాత్మక నిర్ణయం అని బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్ ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం ఓబీసీ జిల్లా అధ్యక్షుడు అల్లాడి నరసింహారావు ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ జనాభా గణాంకాలపై కుల గణన చేయటం అభినందనీయమన్నారు. సర్వే నివేదికను పూర్తి చట్టబద్ధత కల్పించాలని కమిషన్ ఇచ్చిన నివేదికను మంత్రిమండలి అమల్లోకి తెచ్చిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. బీసీ లందరికీ సమాజంలో సముచితమైన స్థానం కల్పించాలన్న ఆలోచన చేసిన ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా కార్యదర్శి సాయి, కొత్తగూడెం ఓబీసీ పట్టణ అధ్యక్షులు జయప్రకాష్, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు గౌస్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఉస్మాన్, పాల్వంచ మండల అధ్యక్షులు కట్టా సోమయ్య, జూలూరుపాడు మండల అధ్యక్షులు రామకృష్ణ, చంద్రుగొండ మండల అధ్యక్షులు వై.శివ, ఓబీసీ నాయకులు మెంతులు కృష్ణ, ఓరుగంటి శీను, బీరెల్లి భద్రం, సంగు యాలాద్రి, దావతు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా వ్యతిరేక బడ్జెట్ వల్ల దేశ అభివృద్ధికి శాపం

- వేగంగా సరళీకృత విధానాల అమలుకు ఊతం
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన, రాస్తారోకో

నవతెలంగాణ-చర్ల

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆర్థిక విధానాల నిరోధానికి ఊతమిస్తూ బడ్జెట్ రూపకల్పన జరిగిందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చ రామారావు విమర్శించారు. దేశ ప్రజలకు వ్యతిరేక విధానాలను తీసుకొస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ సెంటర్ నందు నిరసన కార్యక్రమం చేపట్టి రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లతో పాటు 26 కార్మిక వ్యతిరేక చట్టాలను ప్రవేశపెట్టిందని, వాటిని తక్షణమే రద్దు చేయాలన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన నల్ల చట్టాన్ని రద్దు చేయాలని, రైతులకు సంబంధించి భారతదేశం కార్మిక వర్గాని కార్మికుల శక్తిని కారుచౌకగా పెట్టుబడుదారులకు దోసి పెట్టి కార్మికులను కట్టు బానిసలుగా నిలబెట్టేందుకు రూపొందించిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్పొరేట్, ప్రయివేటీకరణ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ప్రభుత్వ రంగాన్ని బీజేపీ పాలకులు దెబ్బతీస్తున్నారని, ఖనిజ సంపదను కార్పొరేటర్లకు కట్టబెడుతూ దేశ సంపదను దోచిపెడుతూ ఒక వర్గాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెంచి పోషిస్తున్నదని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే కుట్ర అన్నారు. తెలంగాణకు బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం, రైల్వే నిర్మాణం కోసం బడ్జెట్ కేటాయించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సోంది నారాయణ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు కారం నరేష్, వరదల వరలక్ష్మి, సీఐటీయూ నాయకులు పామర్ బాలాజీ, ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు పొడుపుకంటి సమ్మక్క, తాటి నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బందెల చంటి షారోను తదితరులు పాల్గొన్నారు.

డార్విన్ జీవ పరిణామక్రమ సిద్ధాంత ప్రచారోద్యమ గోడ పత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-కొత్తగూడెం

లక్ష్మీదేవి పల్లి కృష్ణవేణి కాలేజీలో గురువారం జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ వారి ఆధ్వర్యంలో డార్విన్ సిద్ధాంత పరిణామక్రమ ప్రచార ఉద్యమం పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు మండవ సుబ్బారావు, రాష్ట్ర బాధ్యురాలు అడపాల కస్తూరి, ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్ రావు, కార్యదర్శి సిహెచ్.తిరుపాలు, కాలేజీ బాధ్యులు రమణలు మాట్లాడారు. ముందుగా డార్విన్ జీవ పరిణామక్రమ సిద్ధాంత ప్రచారోద్యమ గోడ పత్రికను ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తుందని ప్రజలలో ప్రశ్నించే స్వభావాన్ని శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించుటకు కృషి చేస్తుందని తెలిపారు. డార్విన్ జీవ పరిణామ క్రమంలో జీవులు ఉద్భవించి అనేక రకాలుగా మార్పు చెంది వేల కోట్ల సంవత్సరాల తర్వాత ఈ మానవ రూపం పొందారని వివరించారు. అనంతరం సిహెచ్.తిరుపాల్ తన ఇంద్రజాలంతో విద్యార్థులను ఆకట్టుకున్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని జెకె ఏరియా శాఖ గ్రంథాలయానికి బీఆర్ఎస్ పార్టీ యువ నేత హరిప్రసాద్ యాదవ్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ మెటీరియల్ ఇన్‌చార్జి రుక్మిణికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలని వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నేటి నిరుద్యోగ యువతకు అన్ని రకాల కాంపిటీషన్స్ బుక్స్ గ్రంథాలయంలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. యువత అంకుర్బిత దీక్షతో చదివి విజయాలు సాధించాలని కోరారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణలో సత్తా చాటిన న్యూఇరా విద్యార్థి



నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో నవంబర్ 25, 26న సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించారు. అందులో అండర్ 11-14 విభాగంలో స్కేటింగ్‌లో న్యూఇరా పాఠశాలలో 4వ తరగతికి చెందిన ఎమ్. వివాన్ శ్రేయస్ 500 మీటర్స్, 1000 మీటర్స్‌లో మొదటి స్థానంలో నిలిచి రెండు గోల్డ్ మెడల్స్ సాధించాడు. అలాగే జాతీయ షోటోకాన్ కరాటే చాంపియన్ షిప్లో కూడ అండర్ 12లో కట్టా విభాగంలో కాంస్యం గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఐ.వి.రమణారావు, డైరెక్టర్ డాక్టర్ పి.భూమేశ్వరరావు విద్యార్థిని అభినందించారు. చిన్న వయస్సులోనే వివిధ క్రీడలలో ప్రతిభ కనపరచడం విశేషం మరియు ప్రశంసనీయం అని, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలలో గెలవాలని కొనియాడారు.

2వ ఏఎన్ఎంల పోస్టులు పెంచాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజి. క్లెమెంట్

నవతెలంగాణ- ఖమ్మం

ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) పరీక్ష నోటిఫికేషన్‌కు సంబంధించి కచ్చితంగా పోస్టులు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.జి. క్లెమెంట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులను పెంచడంతోపాటు పరీక్షకు అర్హతలేని వారికి 10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ తోపాటు, 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని రెండవ ఏఎన్ఎంలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకష్ణ, తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల సంఘం (ఏఐటియుసి) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం నాగ శేషమ్మ, ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి, సునీత, సహాయ కార్యదర్శులు సత్యవతి, హేమా పాల్గొన్నారు.

కేసీఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే

స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు దోహదపడతాయి

రేగా కాంతారావు



నవతెలంగాణ- దుమ్ముగూడెం

కెసిఆర్ చేసిన సంక్షేమ అభివృద్ధి, సంక్షేమ పథకాలే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు దోహదపడతాయని పినపాక మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు అన్నారు. భద్రాచలం నియోజకవర్గ పర్యటనలో బాగంగా గురువారం దుమ్ముగూడెం మండలంలోని తురుబాక డబ్ల్యూఎల్ రేగుబల్లి, పర్ణశాల ఎంపీటీసీ పరిధిలో తూరుబాక బి.కొత్తగూడెం సింగవరం దంతెనం, చిన్న బండి రేవు గ్రామ పంచాయతీలలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కొనసాగిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల పల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, వాసురాజు, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు, కోకన్వీనర్ ఎండి జానీ పాషా, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, పీఎసిఎస్ డైరెక్టర్లు బొల్లి వెంకట్రావు, కాలవ పూర్ణయ్య, మాజీ సర్పంచ్‌లు కాటేబోయిన వెంకటేశ్వర్లు, సోడే కొండయ్య, బుక్యా చందు, చర్ల, భద్రాచలం మండల కన్వీనర్లు దొడ్డి తాతారావు అకోజు సునీల్, పార్టీ సీనియర్ నాయకులు తునికి కామేష్, పాల్గొన్నారు.

కులగణనలో తెలంగాణ ఆదర్శం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-వేంసూరు

కుల గణనలో బీసీల రిజర్వేషన్ అమలులో దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సోమిరెడ్డి అన్నారు. గురువారం మర్లపాడు రింగ్ సెంటర్ నందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వెల్ది జగన్మోహన్రావు, డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి, నాయకులు రావుల పుల్లారావు, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, గడ్డం జగన్మోహన్ రెడ్డి, శివ, సత్యనారాయణ, ఫక్రుద్దీన్ నాయుడు, బాపూజీ, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రంగు రామాచారి తదితరులున్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-కల్లూరు

విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు బాలవిజ్ఞాన్‌కేతన్ స్కూల్ రోడ్, మసీదు రోడ్డు, ఎల్లాంకెస్టేట్‌కు విధుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, కావున వినియోగదారులు సహకరించగలరని విద్యుత్ సబ్ డివిజన్ ఏఈ పి.వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలు దహనం

నవతెలంగాణ-కొణిజర్ల

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగం, సంక్షేమ రంగాలకు అవసరమైన మేరకు నిధులు కేటాయింపులు పెంచాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని సింగరాయపాలేం గ్రామంలో తెలంగాణ రైతు సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రైతులు వ్యవసాయ రంగంకు తక్కువ బడ్జెట్ పెట్టడంపై బడ్జెట్ పత్రాలు దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మిద్దె రామారావు, వడ్లమూడి మధు, రామకృష్ణ, మట్టా వెంకటేశ్వరరావు, అనుమోలు వెంకటేశ్వరరావు, బుజ్జి, జాజిరెల్లి వెంకన్న, నాగులు తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-కల్లూరు

రఘునాథగూడెం గ్రామానికి చెందిన కుక్క నర్సమ్మ, నల్లగొర్ల నాగమణి ఇటీవల మరణించగా వారి గృహాలకు వెళ్లి రాష్ట్ర కాంగ్రెస్ డాక్టర్ దయానంద్ విజయ్ కుమార్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంటకల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనందబాబు, కల్లూరు కెన్ డెవలప్మెంట్ చైర్మన్ కాస్త్రాల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ- పెనుబల్లి

బీసీ రిజర్వేషన్ పెంపు పట్ల ముఖ్యమంత్రి చిత్రపటానికి గురువారం కాంగ్రెస్ కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. బీసీలకు 42 శాతం రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విఎం బంజర్ లోని గాంధీ విగ్రహం ఎదుట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, పొంగలేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, నాయకులు సోమరాజు సీతారామరావు, చీకటి రామారావు, కేసరి శ్రీనివాస్‌రెడ్డి, వంగా నిరంజన్, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, అలగోజు చిన్ననరసింహస్వామి, వంగ దామోదర్, రాజబోయిన కోటేశ్వరరావు, గోదా చెన్నారావు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త బానోత్ ఘురు మృతి

నవతెలంగాణ-కారేపల్లి

కాంగ్రెస్ కార్యకర్త కారేపల్లి మండలం ఫైల్‌తండాకు చెందిన బానోత్ ఘురు(42) గురువారం మృతి చెందారు. కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఘురు పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఘురు మృతదేహాన్ని టీపీసీసీ మహిళ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల సందర్శించి మృతదేహంపై కాంగ్రెస్ పతాకాన్ని ఉంచి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బానోత్ సక్రాంనాయక్, తారాచంద్, సూర్య, రవి, దేవు, శంకర్, మంగ్య, రాములు, బాల, శిలివేరు ఆదినారాయణ, గమిడి నరసింహారావు, వీసాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ... రూ.1.50 లక్షలు అపహరణ

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని కలకోట గ్రామంలో ఓ ఇంట్లో దొంగలు పడి రూ 1.50 లక్షల నగదును ఇంటి యజమాని ఉండగానే దొంగలించారు. మోటర్ సైకిల్ పై ముగ్గురు కాషాయ వస్త్రాలు ధరించిన యువకులు కలకోట గ్రామానికి చెందిన ఇజ్జగాని కొండలు ఇంటి వద్దకు గురువారం ఉదయం10 గంటల సమయంలో వెళ్లారు. ఆ సమయంలో కొండలు ఇంటి వద్దనే ఉన్నాడు. ముగ్గురు యువకులు కొండలును మాటల్లో దింపారు. ఒకరు కొండలతో మాట్లాడుతుండగా మరో ఇద్దరూ నెమ్మదిగా పక్కనుంచి కొండలు ఇంట్లోకి వెనుక నుంచి జొరబడ్డారు. బీరువాలో ఉన్న రూ.1.50 లక్షల నగదును అపహరించుకుపోయారు. చోరీకి పాల్పడిన ఇద్దరు యువకులు మరల వారి వద్దకే ఏమీ తెలియనట్లుగా వచ్చారు. ఆ యువకులు రాగానే ఎక్కడికి వెళ్లారు అంటూ కొండలు వారిని ప్రశ్నించడంతో మా బంధువులు వద్దకు వెళ్లి వస్తున్నామని చెప్పారు. కేవలం 5 నిమిషాల వ్యవధిలో ముగ్గురు మోటర్ సైకిల్ ఎక్కి అక్కడ నుంచి పారిపోయారు. కొండల భార్య రాణి తమ బంధువుల గ్రామంలో పెళ్లి కార్యక్రమం ఉండటంతో నగలు వేసుకొని వెళ్లిపోయింది. బీరువాకే తాళం ఉంచి రాణి వెళ్లిపోయింది. దీంతో దొంగలకు అది వరంగా మారింది. మధ్యాహ్న సమయంలో డబ్బులు అవసరం ఉండి కొండలు బీరువా తీశాడు. దీంతో బీరువాలో డబ్బులు కనిపించలేదు. అప్పుడు అసలు విషయం కొండలకు బోధన పడింది. తనతో మాట్లాడిన వారే ఈ చోరీకి పాల్పడి ఉంటారని కొండలు నిర్ధారణకు వచ్చాడు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించారు.

నిరుపయోగంగా గ్రామీణ క్రీడా మైదానాలు

- పశువులకు ఆవాసాలుగా ప్రాంగణాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



నవతెలంగాణ-కొణిజర్ల

గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని 27 పంచాయతీలలో క్రీడా ప్రాంగణాల పేరుతో మైదానాలకు స్వాగతం బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. నిర్వాహణ లోపించి అవి అలంకారప్రాయంగా మిగిలి పోయాయి. ఆనాటి ప్రభుత్వ లక్ష్యం, అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతోంది. కనీస సౌకర్యాలు కరువై, క్రీడా సామాగ్రి లేక మైదానాలు వెలవెలబోతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం, సంబందిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని సౌకర్యాలు కల్పించాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.

పూర్తి స్థాయిలో చేరని క్రీడా సామగ్రి...

గ్రామీణ క్రీడాలను ప్రోత్సహిస్తూ క్రీడాకారులను వెలికి తీసేందుకు తెలంగాణ రాష్ట్ర క్రీడ ప్రాంగణాల పేరుతో జూలై 2022లో క్రీడ మైదానాలను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, వంటి ఆటలు ఆడేందుకు కిట్లు, వ్యాయామ పరికరాలను సమకూర్చింది. మండలంలో ఏర్పాటు చేసిన పలు క్రీడా మైదానాలకు క్రీడా సామగ్రి సమకూర్చకపోవడంతో నిరుపయోగంగా మారాయని పలువురు ఆరోపిస్తున్నారు. అక్కడక్కడ మైదానాలను గ్రామపంచాయతీ పరిధిలో అందుబాటులో లేకుండా ఎక్కడో దూరంగా ఏర్పాటు చేశారు. దీంతో ఎవరు కూడా మైదానాలవైపు కన్నెత్తి చూడటం లేదని వాదనలు వినిపిస్తున్నాయి.

కరువైన అధికారుల పర్యవేక్షణ....

క్రీడా మైదానాల ఏర్పాటుకు ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఏర్పాటుచేశారు గాని వీటి పర్యవేక్షణ మరిచారు. వాటి ఏర్పాటుకు మంజూరైన రూ. లక్షల నిధులు వథా అయ్యాయి. ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు అక్కరకు రాకపోగా పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి జంతువులకు ఆవాసాలుగా, మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా అవుతుందని ఆట స్థలాలు అందుబాటులోకి రాకపోవడంతో గ్రామీణ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి మైదానాలను పునరుద్ధరించి అందుబాటులోకి తేచ్చి ఆటలకు సంబంధించిన పరికరాలు అందించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు
- రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలి
- విద్యా రంగాన్ని విస్మరిస్తున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు



నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న 8200 కోట్లను స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ మహాసభల ప్రారంభ సభలో ముఖ్య అతిధులుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళ నాగరాజు హాజరయ్యి ప్రసంగించారు. విద్యార్థులకు సకాలంలో స్కాలర్షిప్స్ విడుదల చేయడంలో పూర్తిగా విఫలమయిందని, కనీసం చదువులకు విద్యార్థులు దూరమయ్యే పరిస్థితి విద్యార్థులకు ఏర్పడుతుందని, దీని ద్వారా విద్యార్థులు ఏ విధంగా చదువులకు ముందుకు పోగలుగుతారని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకుండా విద్యా వ్యవస్థను నడుపుకునే దుర్మార్గమైన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం హంగులకు ఆర్భాటాలకే కేవలం పరిమితం అవుతున్నారన్నారు తప్ప ఏమాత్రం కూడా విద్యార్థుల సమస్యలను విని పరిష్కరించడానికి ఏమాత్రం కూడా ప్రయత్నం చేయడం లేదన్నారు. విద్యా వ్యవస్థ అభివృద్ధి కావాలంటే విద్యా రంగానికి తగిన ప్రాధాన్యత కల్పిస్తూ ప్రభుత్వాలు పనిచేయాలి కానీ, వారి సొంత రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ప్రభుత్వాలు పని చేసుకుంటున్నది తప్ప విద్యార్థుల కోసం పనిచేయడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జిల్లా మహాసభల్లో విద్యారంగ సమస్యల పైన చర్చించి భవిష్యత్తు విద్యార్థులకు సమస్యల కోసం పోరాటాలను ఈ మహాసభల్లో చర్చించి పరిష్కారం కొరకు పొరడుతామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి కిరణ్, బి వీరభద్రం, జిల్లా నాయకులు భూపేందర్, అభిమన్యు, నాగ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు సహాయ ఉపకరణాలు అందించడానికి ఎంపిక శిబిరాలు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- 10 నుంచి 14 వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహణ

నవతెలంగాణ- ఖమ్మం

జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను అందించుటకు ప్రత్యేక ఎంపిక శిబిరాలను ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న ఖమ్మం ఎన్.ఎస్.పి. క్యాంప్ రోడ్డులోని రోటరీ క్లబ్ లో, 11న సత్తుపల్లి లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, 12న మధిర రైతు వేదికలో, 13న వైరా రైతు వేదికలో, 14న పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం గురువైగూడెం రోడ్డు కూసుమంచి రైతు వేదికలో ప్రత్యేక ఎంపిక శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రత్యేక ఎంపిక శిబిరాలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతాయని అన్నారు. వయోవృద్ధులకు చేతి కర్రలు, వాకర్స్, వినికిడి యంత్రాలు, అలాగే శారీరక దివ్యాంగులకు అవసరమగు చార్జింగ్ బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్, కాలిపర్, కృత్రిమ అవయవాలు అలింకో సంస్థ నిపుణుల సహకారంతో అర్హులకు అందజేయడం కోసం ఎంపిక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్యాటరీ ఆపరేటర్ ట్రై సైకిల్ పొందుటకు 16 సంవత్సరాలు పైబడి 80 శాతం వైకల్యం ఉన్నవారు, వయో వృద్ధులు సంవత్సర ఆదాయం లక్షా 80 వేలు, శారీరక దివ్యాంగులు 2 లక్షల 70 వేలు ఆదాయం మించకుండా ఉండాలని, శిబిరానికి వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, వయస్సు ధృవీకరణ పత్రం, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, బి.పి.ఎల్. రేషన్ కార్డు, వైకల్యం ధృవీకరణ పత్రం వెంట తీసుకొని రావాలని, అర్హత వైకల్యం గల దివ్యాంగులు మాత్రమే హాజరు కావాలని, అర్హత లేని శారీరక దివ్యాంగులు, ఇతర కేటగిరి దివ్యాంగులు వచ్చి క్యాంపు వద్ద ఇబ్బంది పడవద్దని పేర్కొన్నారు.

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ



నవతెలంగాణ -కరకగూడెం

మండల పరిధిలోని చిరుమల్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను గురువారం రాత్రి గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, వసతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనం, స్టోర్ రూమ్, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు భోధన సక్రమంగా భోదించాలని సూచించారు. విద్యార్థులను అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని విలేఖరికి గాయాలు



నవతెలంగాణ-అశ్వాపురం

ద్విచక్ర వాహనం ఢీకొని విలేఖరికి గాయాలైన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్లెలమడుగు గ్రామానికి చెందిన సీనియర్ రిపోర్టర్ కమటం వెంకన్న (మిలట్రీ) మొండికుంట ఆర్ అండ్ బి రోడ్డు సమీపంలోని తన పొలం వద్ద వ్యవసాయ పనులు చూసుకుని మరలా ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్దాం అనుకొని వాహనాన్ని స్టార్ట్ చేశాడు. అదే సమయంలో మొండికుంట వైపు నుంచి అశ్వాపురం వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో కుడికాలు మణికట్టు వద్ద విరిగిపోయింది. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఓ ప్రైవేటు వాహనం ద్వారా గాయపడ్డ ఆయన్ని భద్రాచలంలోని ఆసుపత్రికి తరలించారు.

25 సార్లు రక్తం దానం చేసిన ప్రసాద్



ఎవరికి ఆపద అన్నా చాలు రక్తం అవసరం ఉందని తెలిసిన వెంటనే ఆపద్బాంధవుడులా వెళ్లి రక్తం ఇచ్చి ఆదుకొని శభాష్ ప్రసాద్ అనిపించుకుంటాడు. మండల పరిధిలోని నెల్లిపాక బంజర గ్రామానికి చెందిన నిదాన పల్లి ప్రసాద్ ఇప్పటివరకు 25 సార్లు అత్యవసర పరిస్థితిలో రక్తాన్ని ఇచ్చి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను నిలిపాడు. మొండికుంట గ్రామ సమీపంలోని సువ్వల మోరి వద్ద బుధవారం సాయంత్రం సీనియర్ పాత్రికేయులు కమటం వెంకన్న (మిలట్రీ)కు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన కాలు పూర్తిగా విరిగిపోయి తీవ్రమైన రక్తస్రావం జరిగింది. భద్రాచలంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించగా అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని డాక్టర్ సూచించాడు. రక్తం అత్యవసరం అని డాక్టర్లు తెలపడంతో ఆ మెసేజ్ వాట్సాప్ గ్రూప్ ద్వారా కబురును అందుకున్న ఆయన అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఇచ్చి ప్రాణదాతగా నిలిచి పలువురి మన్ననలు అందుకుంటున్నాడు.

టెండర్లు పిలిచి ప్రూనింగ్ పనులు చేపట్టాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ఏజెన్సీలో తునికాకు టెండర్లు పిలిచి ప్రూనింగ్ పనులు వెంటనే చేపట్టాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల రెండవ పంటైన తునికాకు సేకరణ ఈ ప్రాంత ఆదివాసీలకు ఆదాయాన్ని సమకూరుస్తుందని పిల్లాపాపలతో అడవి బిడ్డలు తునికాకు సేకరించుకొని ఆదాయాన్ని వెనకేసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారెడ్డి శివాజీ, సీతారామరాజు, వెంకన్న, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గొంగడి త్రిషకు కోటి రూపాయల నజరానా

సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించటం చాలా సంతోషకరం

పర్వతనేని వరప్రసాద్



నవతెలంగాణ-దమ్మపేట

గొంగడి త్రిషకు కోటి రూపాయల నజరానా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించటం చాలా సంతోషకరమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ యంగ్ అండ్ డైనమిక్ నాయకులు పర్వతనేని వరప్రసాద్ తెలిపారు. ఇటీవల జరిగిన మహిళల అండర్ -19 ప్రపంచ కప్ లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ గా నిలిచి టీమ్ ఇండియా విజయంలో కీలకపాత్ర పోషించిన గొంగడి త్రిషకి ప్రోత్సాహకంగా కోటి రూపాయల నజరానా ప్రకటించి మరోసారి మానవత్వం చాటుకున్నారని అన్నారని తెలిపారు. ప్రతిభ ఉన్న ప్రతి క్రీడాకారుల్ని ప్రోత్సహించి ముందుకు తీసుకు వెళ్ళటం వల్ల భవిష్యత్తులో వారి ప్రతిభను చూసి మరి కొందరు ముందుకు వచ్చి రాణించాలని కోరుకుంటున్నానన్నారు.

కాసాని ఐలయ్యకి ఘన నివాళులు



నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

స్థానిక కొత్తగూడెం పట్టణంలో గల మంచికంటి భవనం నందు సెంటర్ శాఖ ఆధ్వర్యంలో శాఖ సమావేశం నిర్వహించుకుని కాసాని ఐలయ్య చిత్రపటానికి సీపీఐ(ఎం) సెంటర్ శాఖ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు జి.రాజారావు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్దేశించి శాఖ కార్యదర్శి నందిపాటి రమేష్ మాట్లాడుతూ కార్మిక, పేదల పక్షాన నిరంతరం శ్రమించి ఇల్లు లేని నిరుపేదలకు ఇప్పించిన నాయకుడు కాసాని ఐలయ్య అన్నారు. తన చివరి శ్వాస వరకు ఉద్యమంలో పనిచేస్తూ ఇటీవల మరణించారన్నారు. వారికి విప్లవ జోహార్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజారావు, అన్నవరపు పద్మ, నందిపాటి రజిత, సలీం తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ సామాజిక వర్గాల ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిల్లా మంత్రులు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తొలుత బీసీ సంఘాల నాయకులు ఏఎంసి చైర్మన్ భాగం నీరజాదేవితో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, బీసీ సంఘాల నాయకులు ఆలకుంట నరసింహారావు, లక్కినేని కృష్ణ, పరిమి భరత్, బొల్లం రామారావు తదితరులు ప్రసంగించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన బీసీ కులగణన సర్వే నివేదిక క్యాబినెట్ సమావేశంలో అసెంబ్లీ ఆమోదం తెలిపినందుకు హర్షం వ్యక్తం చేస్తూ, బీసీ కులాలకు సముచిత స్థానం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం ప్రభాకర్, ఏనుగు సత్యంబాబు, కెవిఆర్ వెంకటేశ్వరరావు, రామనరసింహారావు, వీరయ్య, మారేశ్వరరావు పలు బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సీపీఐ(ఎం)ను ఆదరించండి

నవతెలంగాణ-ముదిగొండ

నిరంతరం ప్రజా సమస్యలపై ఉద్యమాలను నిర్వహించే సిపిఐ(ఎం)ను బలపరిచి, ఆదరించాలని పార్టీ మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం ప్రజలను కోరారు. ముదిగొండలో కరపత్రాలతో గడపగడపకు సిపిఐ(ఎం) కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల సారథి, ఐక్య ఉద్యమాల వారధిగా, జాతీయోద్యమ లక్ష్యాలతో పాటు, తెలంగాణ రైతాంగ పోరాట త్యాగాల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని అనునిత్యం, అణగారిన వర్గాల అభ్యున్నతికే పనిచేస్తున్న కష్టజీవుల పార్టీ సిపిఐ(ఎం)మేనన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ శ్రామికుల సమరభేరి ఎర్రజెండా అన్నారు. కరపత్రాలను ఇంటి ఇంటికి పంచుతూ క్షేత్రస్థాయిలో ప్రజలను కలుస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఉద్యమాలను నిర్వహించే కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలవాలని బట్టు పురుషోత్తం చెప్పారు. పార్టీ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ బలాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల సీనియర్ నాయకులు మందరపు వెంకన్న, మండల కమిటీ సభ్యులు రాయల శ్రీనివాసరావు, మందరపు పద్మావతి, గ్రామ రెండో శాఖ కార్యదర్శి మెట్టెల సతీష్, నాయకులు పుచ్చకాయల లక్ష్మయ్య, కట్టకూరి ఉపేందర్, బలంతు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ కులగణనపై బీసీ సమాజం సంతోషం

- బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్

నవతెలంగాణ-సత్తుపల్లి

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బీసీలు అణచివేతకు గురయ్యారని, బీసీ సమాజం ఆ పార్టీని క్షమించదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనను సమర్థవంతగా, సక్రమంగా నిర్వహించడం పట్ల బీసీ సమాజం నుంచి సంతోషం వ్యక్తమవుతోందన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం కులాల వారీగా లెక్కలను తేల్చడం సంతోషకరమన్నారు. బీసీల లెక్కలను తేల్చడమే కాకుండా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం బీసీ వర్గాలకు శుభ పరిణామమన్నారు. సమావేశంలో ఏఎంసీ ఛైర్మెన్ దోమ ఆనంద్‌బాబు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నకేశవరావు, వినకొండ కృష్ణ, మానుకోట ప్రసాద్, దుస్సా వెంకటేశ్వర్లు, విరివాడ నాగభూషణం, మాజీ కౌన్సిలర్లు దూదిపాల రాంబాబు, కంటె నాగలక్ష్మి, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

కోర్టు కానిస్టేబుల్ అభినందించిన సీపీ



నవతెలంగాణ-ముదిగొండ

కీలకమైన హత్య కేసులోని నిందితులు చేసిన నేరం నుండి తప్పించుకోకుండా ప్రాసిక్యూషన్ తరపున వాదించి నిందితులకు శిక్ష పడేలా చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ ఎ.శంకర్ (జిల్లా కోర్టు), ముదిగొండ పోలీస్ స్టేషన్, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆదినారాయణను, గురువారం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఘనంగా సన్మానించారు. 2021లో జరిగిన భార్య హత్య కేసులో మండలంలోని బాణాపురం తండాకు చెందిన చత్తీస్గడ్ రాష్ట్రంలో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ పనిచేస్తున్న తేజావత్ ఉపేందర్ నాయక్, అతను తల్లి,పద్మకు జీవిత ఖైదు విధిస్తూ ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె రాజగోపాల్ బుధవారం తీర్పు వెల్లడించారు. అప్పట్లో నవతెలంగాణ దినపత్రికలో భార్యను హత్య చేసిన భర్త అనే కథనం ప్రచురించిన విషయం కూడా విధితమే. ఈ నేపథ్యంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్‌ను పోలీస్ కమిషనర్ శాలువతో ఘనంగా సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో కేసుల నుండి నిందితులు తప్పించుకోకుండా ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని ఆకాంక్షిస్తూ సిపి సునీల్ దత్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంరూరల్ ఏసిపి బి తిరుపతిరెడ్డి, ముదిగొండ సీఐ వడ్డేపల్లి మురళి పాల్గొన్నారు.

రేషన్ దుకాణాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తహశీల్దార్ రాంప్రసాద్



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

జిల్లా కలెక్టర్ ముజీమ్ల్ ఖాన్ ఆదేశాల మేరకు ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని లెప్రసి కాలనీలో ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్ తెలిపారు.మున్సిపాలిటి పరిధిలోని లెప్రసి కాలనీలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ రాంప్రసాద్, కమిషనర్ అఫ్జాద్ షఫీ ఉల్లా, ఎంపీడీఓ కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని కాలనీ వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెలా కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా కాలనీలోనే రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి నెల కాలనీలోనే ప్రజలు రేషన్ బియ్యం తీసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ పంచాయతీరాజ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-ఎర్రుపాలెం

గత కొన్ని రోజుల నుండి విపరీతమైన కడుపు నొప్పి తో బాధపడుతూ నొప్పిని భరించలేక వివాహిత ఉరి వేసుకుని చనిపోయిన సంఘటన గురువారం చోటుచే సుకుంది స్థానిక ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల మే రకు ఎర్రుపాలెం మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రా మానికి చెందిన వివాహిత ఐలూరి శ్రీలత (33) ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్ కి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలు శ్రీలత తండ్రి శీలం బ్రహ్మా నందరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీస్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీసీ కులగణనకు సంబంధించి కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బీసీల మనోభావాలు దెబ్బతినేలా కులగణన నివేదికను తగలబెట్టినందుకు, ఆయనపై అనేక ఫిర్యాదులు వచ్చాయని క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ జి చిన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ కులగణన నివేదికను తగలబెట్టడం, ఏఐసీసీ అగ్రనేత, ఆల్ ఇండియా కాంగ్రెస్ అధినాయకత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా మీడియాలో పరుష పదజాలం ఉపయోగించడం, పార్టీ ప్రయోజనాలను పక్కన పెట్టి వ్యక్తిగత ఎజెండా నెరవేర్చేందుకు నవీన్ ప్రయత్నిస్తున్నారని నోటీసులో పేర్కొన్నారు. ఈనెల 12లోగా షోకాజ్ నోటీసులకు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. పార్టీ నిబంధనల మేరకు వివరణ ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రూ.కోటి దాటిన రామయ్య ఆదాయం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆదాయం రూ.కోటి దాటింది. చివరిసారిగా డిసెంబర్ 30వ తేదీన రామయ్య హుండి లెక్కింపు చేపట్టగా, 37 రోజుల తర్వాత గురువారం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆలయ ఆవరణలోని చిత్రకోట మండపంలో ఎల్.రమాదేవి నేతృత్వంలో లెక్కింపు చేపట్టారు. ముక్కోటి అధ్యయనోత్సవాలు, సంక్రాంతి సెలవుల సందర్భంగా భారీగా సందర్శకులు రామయ్య దర్శనానికి వచ్చారు. కానుకల రూపంలో హుండీలో రూ.1,13,23,178.00, 109 గ్రాముల బంగారం, 895 గ్రాముల వెండిని రామయ్యకు చెల్లించుకున్నారు. వీటితోపాటు రామయ్యకు విదేశీ కరెన్సీ సైతం భారీగా రాగా, యూఎస్ డాలర్లు 298, సింగపూర్ 155 డాలర్లు, యూఏఈ కరెన్సీ 20, ఆస్ట్రేలియా 85 డాలర్లు, 45 యూరోస్, కెనడా 20 డాలర్లు, విదేశీ నగదును సందర్శకులు సమర్పించారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ.. ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు అత్యంత వైభవం, విజయవంతంగా నిర్వహించుకున్నామని, సంక్రాంతి సెలవులు కూడా కలిసి రావడంతో దేశ నలమూలల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారని తెలిపారు. భక్త రామదాసు జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న వాగ్గేయ ఉత్సవాలు కూడా వైభవంగా కొనసాగాయని, ఆలయ వైదిక సిబ్బంది ఆలయ అధికారుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేశామని చెప్పారు.

రూ.12 కోట్ల నిషేధిత మత్తు పదార్థాల దహనం





నవతెలంగాణ-కంఠేశ్వర్

రూ.12 కోట్ల విలువైన నిషేధిత మత్తు పదార్థాలను దహనం చేసినట్టు నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్ఓ దిలీప్ గురువారం తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలో 154 ఎన్‌డిపిఎస్ కేసుల్లో రూ.12 కోట్ల మత్తు పదార్థాలు పట్టుబడ్డాయి. నిజామాబాద్ ఈఎస్ మల్లారెడ్డి ఆదేశాల మేరకు డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆమోదించిన నిషేధిత మత్తు పదార్థాలైన 1700 కిలోల ఎండుగంజాయి, 64.27 కిలోల అల్ఫాజోలం, 72.2 కిలోల డైజీపాం, ఓ గంజాయి మొక్కను జిల్లాలోని జక్రాన్‌పల్లిలో గల శ్రీ మెడికేర్‌లో దహనం చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఎక్సైజ్ హెచ్ఓ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ ఎస్ఐ ఆత్మహత్య

- కుటుంబ మనస్పర్థలే కారణం..?



నవతెలంగాణ-గోవిందరావుపేట

ఏఆర్ ఎస్ఐ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ ఏ.కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పస్రా గ్రామంలో నివాసముంటున్న సవరణపాక లక్ష్మీనర్సయ్య(38) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బయ్యారం పోలీస్ స్టేషన్ పరిధి ఏఆర్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలున్నాయి. ఈ క్రమంలో లక్ష్మీనర్సయ్య పస్రాలోని తన నివాసంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ధర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి.. కాళేశ్వరంలో కుంభాభిషేక మహోత్సవాలు

- 9న మహాకుంభాభిషేకం
- ప్రత్యేక బస్సులు, ఏర్పాట్లు పూర్తి : ఈఓ శెనిగల మహేష్



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి శతచండి మహారుద్ర సహస్ర ఘటాభిషేక కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అందుకు ప్రత్యేక బస్సులు, ఇతర ఏర్పాట్లు పూర్తయినట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి(ఇవో) శెనిగల మహేష్ తెలిపారు. 42 ఏండ్ల తరువాత జరుగుతున్న ఈ మహోత్సవాలను విజయవంతం చేయడానికి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ఇప్పటికే అన్ని ప్రభుత్వ శాఖాధికారులతో సమావేశం నిర్వహించి సందర్శకుల సౌకర్యార్థం నిరంతరంగా సేవలందించాలని ఆదేశించారు. ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఈ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తుని తపోవన పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా శతచండీ మహారుద్ర సహిత సహస్రఘటాభిషేకము, కుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భూపాలపల్లి నుంచి కాళేశ్వరం వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసిందన్నారు. ఈనెల 7వ తేదీన ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మంగళవాయుద్యాలతో పూజలు, హోమాలు జరగనున్నాయి. మధ్యాహ్నం 3.30గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు మహా రుద్రాభిషేకం, హారతి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి. 8వ తేదీన ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అభిషేకాలు ఉంటాయి. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు చండీహోమం, హారతి తదితర కార్యక్రమాలు ఉంటాయి. 9వ తేదీన ఉదయం 7.30 గంటల నుంచి 10.00 గంటల వరకు ప్రత్యేక పూజలు, ఉదయం 10.42 గంటల నుంచి మహాకుంభాభిషేకం, అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈవో వివరించారు.

పదవీ కాలమంతా

ఉపాధ్యాయ, అధ్యాపకుల కోసమే..

ప్రభుత్వ విద్యాలయాల అభివృద్ధికి ఒత్తిడి | **ఖాళీల భర్తీకి వినతులు**

అన్ని వర్గాల సమస్యలపై మండలిలో వినిపించిన గళం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నేడు నర్సిరెడ్డి నామినేషన్



నవతెలంగాణ-మిర్యాలగూడ

ఈనెల 27న జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ ఉపాధ్యాయ అధ్యాపక సంఘాలు బలపరిచిన అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠికి నామినేషన్ పత్రాలు అందించనున్నారు. అంతకుముందు క్లాక్ టవర్ నుండి కలెక్టరేట్ వరకు 2000 మందితో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు అనంతరం సభ నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. దీనిగాను ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 2019లో ఉపాధ్యాయ అధ్యాపక సంఘాల మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికైన అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆనాటి నుండి ఉపాధ్యాయ అధ్యాపకుల గొంతుకగా నిరంతరం పనిచేస్తూ వచ్చారు. తనకు వచ్చిన చిన్న అవకాశాన్ని కూడా జారవించకుండా ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసమే గళమెత్తి ఉద్యమించారు. తనకు వచ్చిన ఎమ్మెల్సీ పదవిని నీతి, నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే ప్రజా ప్రతినిధులకే ఆదర్శంగా నిలిచారన్న పేరు ఉంది. తన పదవి కాలంలో వచ్చిన సిడిపి గ్రాంటు తొమ్మిది కోట్లు మొత్తం ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి ఖర్చు పెట్టారు. విద్యారంగం తో పాటు వివిధ రంగాల సమస్యలపై మండలి లో తన గొంతును వినిపించారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయ అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం నల్గొండ నుండి ప్రజాభవన్ వరకు నాలుగు రోజులపాటు నడకయాత్ర చేసి ప్రభుత్వం పై ఒత్తిడి ఇచ్చారు. తనకొచ్చే వేతనము, అలవెన్సు ప్రయాణాలు ఇత్యాది ఖర్చులు పోను మిగులు మొత్తం పూర్తిగా ఉద్యమ అవసరాల నిమిత్తం రాష్ట్ర, జిల్లా సంఘాలకు కేటాయిస్తున్నారు. ప్రభుత్వ విద్యా రంగం కుంటుబడడానికి పాలకుల విధానాలే కారణమని నొక్కి చెప్పి, తల్లిదండ్రులను ఆలోచింపచేసే సూచనలు చేసేవారు. మండలి సమావేశాలకు ఏనాడూ గైర్హాజరు కాకుండా తన పదవి కాలం అంతా లభించిన సమయాన్ని ఉపయోగించుకుని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో ఉపాధ్యా, అధ్యాపకులల్లో మంచి పేరు సంపాదించుకున్నారు.

సాధించిన విజయాలు....!

టీఎస్ యుటిఎఫ్, యుఎస్పిసి ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యోగ తదితర ప్రజా సంఘాలు చేపట్టిన పోరాటాలకు మద్దతుగా నిలిచారు. కేజీబీవీ యుఆర్ఎస్ లలో పనిచేస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగులకు వేసే సెలవులతో సహా 12 నెలలు జీతం వచ్చేలా చేయడంలో కృషి చేశారు తెలంగాణ మొదటి పిఆర్సిని కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింప చేయించారు 180 రోజులు ప్రసూతి సెలవులను సాధించడంలోనూ ఎంతో కృషి చేశారు. బేసిక్ పే సాధన కోసం కృషి చేస్తూనే, గత పది సంవత్సరాలుగా మోడల్ స్కూల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారు. ఐదు యాజమాన్యాల గురుకుల పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు నూతన నియమాకాలకు ముందుగానే బదిలీలు, పదోన్నతులు జరిగేలా కృషి చేశారు. ఆ పాఠశాలలో ఉపాధ్యాయులకు శ్రమకు తగిన వేతనాలు ఇవ్వాలని కేర్ టేకర్ల ను నియమించి ఉపాధ్యాయుల పై పని భారం తగ్గించాలని, ఇటీవల సవరించిన అసంబద్ధమైన టైం టేబుల్ సవరించాలని, అనేక పర్యాయలు ప్రాతనిధ్యం చేయడంతో పాటు వారి పోరాటానికి అండగా నిలిచారు. ఎయిడెడ్ టీచర్లకు సకాలంలో వేతనాలు మంజూరు కోసం నిరంతరం పాటుపడుతున్నారు గిరిజన సంక్షేమ శాఖలో కూడా బదిలీలు, ప్రమోషన్లు జరిపించడంతోపాటు పండిట్ పీఈటి, పోస్టుల అప్గ్రేడేషన్, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు నూతన ఉపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయించారు. సిఆర్టి లకు 12 నెలల వేతనం సాధించడంలో విజయం సాధించారు వారికి మినిమం టైం స్కేల్ సాధించడానికి కషి చేస్తున్నారు. బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ విడుదల విషయంలో రెండు సందర్భాల్లో ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష చేసి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ పాఠశాలల గమనం గమ్యం అని పేరుతో నియోజకవర్గంలోని అన్ని జిల్లా కేంద్రాలలో చర్చాగోష్టులు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంచడానికి కృషి చేశారు.

ఐదు నామినేషన్లు దాఖలు

ఈనెల 3 నుంచి నామినేషన్ స్వీకరణ ప్రారంభించగా ఇప్పటివరకు ఐదు నామినేషన్ దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి ఈలా త్రిపాఠి తెలిపారు శుక్రవారం టీఎస్ యుటిఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు అదేవిధంగా బిజెపి బలపరిచిన తపస్ (టిపియూఎస్) నుండి సర్వోత్తమ రెడ్డితో పాటు మరికొందరు నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాం :

ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను ప్రచారాన్ని ముమ్మరం చేశాం. ఇప్పటికే ఓటర్లను వ్యక్తిగతంగా రెండుసార్లు కలిసి ఓట్లను అభ్యర్థించాం. ప్రభుత్వ పాఠశాలలో గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులను అధ్యాపకులను వ్యక్తిగతంగా కలిసి ఓట్లను అభ్యర్థిస్తున్నాం. ఓటర్ల నుండి విశేష స్పందన లభిస్తుంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గుణ గుణాలను శక్తి సామర్థ్యాలను ఉపాధ్యాయ అధ్యాపకులు చర్చించుకుంటున్నారు. నీతి నిజాయితీ నిబద్ధత కలిగిన నర్సిరెడ్డికి ఉపాధ్యాయ, అధ్యాపకులు మద్దతు తెలుపుతున్నారు. ఈ నియోజకవర్గం లో యుటిఎఫ్ కు బలమైన నాయకత్వం ఉండడంతో పాటు అన్ని మండలాల్లో కమిటీలు ఉండడం మా అభ్యర్థి గెలుపుకు ఉపయోగపడుతుంది.

- బక్కా శ్రీనివాస్ చారి
(జిల్లా అధ్యక్షులు టీఎస్ యూటీఎఫ్)

గుండెల్లోకి దూసుకుపోయేలా పాటలు అల్లాలి

- కళ అద్భుతమైన జీవన శైలి : సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ
- ముగిసిన సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాలు





నవతెలంగాణ -మహబూబ్‌నగర్

నేటి తరం కవులు, రచయితలు, కళాకారులు.. పేదలు, కష్టజీవులు, కార్మికులు, శ్రామిక వర్గాల గుండెల్లోకి దూసుకుపోయేలా పాటలు అల్లాలని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాలు గురువారం విజయవంతంగా ముగిసినట్టు సాంస్కృతిక ఉత్సవాల వేదిక ప్రధాన కార్యదర్శి వి.కురుమూర్తి ప్రకటించారు. సభకు అధ్యక్షులు బెక్కెం జనార్దన్ అధ్యక్షత వహించగా, సుద్దాల అశోక్‌తేజ మాట్లాడారు. నాన్న సుద్దాల హనుమంతు పేరుతో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో పిల్లలు పాడుతున్న పాటలు, నాటికల ప్రదర్శన చూస్తుంటే పిల్లలు కాదు పిడుగుల్లా కనిపిస్తున్నారని అన్నారు. ఈ పాలమూరు నేలలో ఎన్నో కష్టాలు, కన్నీళ్ల నుంచి కళాకారులు, కవులు పుట్టారని గుర్తుచేశారు. ఆనాడు నిజాం నిరంకుశ సర్కార్‌కు వ్యతిరేకంగా పాటల రూపంలో ఎలుగెత్తిన చైతన్యం.. నేటి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కనిపించిందన్నారు.

రాజకీయ పాలకులకు ఇష్టం లేకపోయినా కళారంగం నుంచి ప్రశ్నించే గొంతుకలకు ఎమ్మెల్సీలుగా అవకాశం ఇవ్వడం చూస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఆనాడు ఆదినారాయణ రెడ్డి, నేడు గోరటి వెంకన్న ఈ జిల్లాకు చెందిన వ్యక్తులు కావడం గర్వంగా ఉందన్నారు. సురవరం ప్రతాప్‌రెడ్డి కవిత్వం మొదలుకొని పల్లె గేయాల వరకు పాడుతున్న అనేకమంది కళాకారులు, కవులు ఇక్కన్నుంచే వచ్చారని చెప్పారు. కళ ఒక అద్భుతమైన జీవనశైలి అని, వ్యక్తులు వెళ్లిపోయినా వారి జ్ఞాపకాలు తరతరాలుగా నిలిచిపోతాయని తెలిపారు. నాన్న సుద్దాల హనుమంతు నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పాటలు రాసి గళం విప్పిన సుద్దాల అనే గ్రామం నుంచి సామాన్య వ్యక్తిగా "పాల బుగ్గల పిల్లగాడా.. పశువులు గాసే మొనగాడా" లాంటి పాటలు వింటూ పెరిగానని గుర్తు చేసుకున్నారు. ఇప్పటివరకు రెండు వేల సినిమాల్లో మూడు వేలకు పైగా పాటలు రాశానని, ప్రతి పాటలో సమాజాన్ని మేల్కొల్పే సారాంశం ఉంటుందని తెలిపారు. పాలమూరు గడ్డపై జరుగుతున్న ఈ ఉత్సవాలను చూస్తుంటే 43 సంవత్సరాల తర్వాత సుద్దాల హనుమంతు లక్ష్యం ఇంకా బతికే ఉందని అనిపిస్తోందన్నారు. నా పాట.. నా మాటతో స్ఫూర్తి పొంది పది సంవత్సరాల తర్వాత విద్యార్థులు కవులు, కళాకారులుగా, రచయితలుగా ఎదిగి లక్షల మందితో సెల్ఫీలు దిగే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతిరోజూ మీ ప్రాంతంలో.. మీ కండ్ల ముందు జరుగుతున్న సంఘటనలకు కవులు స్పందించి అందులో నుంచి ప్రజల గుండెల్లోకి దూసుకుపోయేలా పాటలు రాయాలని సూచించారు. నేటి యువత అత్యున్నత లక్ష్యాలు ఎంచుకొని ప్రజాస్వామ్యబద్ధంగా సమాజాన్ని మేల్కొల్పేందుకు ముందుకు రావాలన్నారు. టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడారు.

తెలంగాణలో మొట్టమొదటిసారిగా ఇక్కడ ప్రారంభించిన ఈ ఉత్సవాలను ప్రతి ఏడాదీ నిర్వహిస్తామని వేదిక ప్రధాన కార్యదర్శి వి.కురుమూర్తి తెలిపారు. రెండ్రోజులు జరిగిన జానపద నృత్యాలు, వెస్ట్రన్ డ్యాన్స్, కోలాటం, బతుకమ్మ జానపద గేయాలు, ఏకపాత్రాభినయం లఘు నాటికలు, చిత్రలేఖనం, కవి సమ్మేళనం తదితర అంశాల్లో సీనియర్ జూనియర్ విభాగాలలో విజేతలను మెడల్స్‌తో సత్కరించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాల వేదిక గౌరవ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ రామ్మోహన్, గౌరవ సలహాదారు ఎస్.జగపతిరావు, డాక్టర్ ప్రతిభ, వేదిక ఉపాధ్యక్షులు ఎం.కురుమయ్య, ఆర్.ప్రమోద్ కుమార్, వి.పద్మ, కార్యదర్శులు ప్రశాంత్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 18 నామినేషన్లు

నవతెలంగాణ - కరీంనగర్/నల్లగొండ ప్రతినిధులు

మెదక్- నిజామాబాద్- కరీంనగర్- ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 12మంది, టీచర్స్ ఎమ్మెల్సీకి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థుల నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నామినేషన్లు స్వీకరించారు. గురువారం నాటికి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు కలిపి మొత్తం 28 మంది నామినేషన్ దాఖలు చేశారు. ఇందులో 21 మంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి, ఏడుగురు టీచర్స్ ఎమ్మెల్సీకి నామినేషన్ వేశారు.

నల్లగొండలో మూడు నామినేషన్లు

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికకు గురువారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్టు నల్లగొండ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. గురువారం నామినేషన్లు వేసిన వారిలో ప్రజావాణి పార్టీ తరపున లింగిడి వెంకటేశ్వర్లు ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా అర్వ స్వాతి, చాలిక చంద్రశేఖర్లు చెరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఉన్నారు.

ఖరీదుదారుల నిలువుదోపిడీ

నష్టపోతున్న మిర్చిరైతులు

- క్వింటా రూ.25వేలకు కొనుగోలు చేయాలి : రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్
- ఎనుమాముల మార్కెట్‌లో నాయకులను అడ్డుకున్న పోలీసులు



నవతెలంగాణ-కాశిబుగ్గ

మార్కెట్ అధికారులు, ఖరీదుదారులు కుమ్మక్కై మిర్చి రైతులను నిలువునా దోచుకుంటున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. తెలంగాణ రైతు సంఘం నాయకులు గురువారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డును సందర్శించారు. రైతులతో మాట్లాడి ధరల వివరాలు తెలుసు కున్నారు. ఈ సందర్భంగా మూడ్ శోభన్ మాట్లాడుతూ.. మిర్చి సాగు చేస్తున్న రైతులకు సరైన ధర లేదని, భవిష్యత్‌లో మంచి ధర వస్తుందన్న ఆశ లేకపోవడంతో తక్కువ ధరకే అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా మిర్చిని రూ.25వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మిర్చి సాగులో తామరపురుగు, తెగుళ్ల తీవ్ర నష్టం చేస్తుంటే మరోవైపు ధరలు పడిపోవడం రైతులను అప్పుల్లోకి నెడుతోందని అన్నారు. గతేడాది రూ.25వేల ధర పలికిన క్వింటా మిర్చి.. ప్రస్తుతం రూ.10 నుంచి రూ.13వేలే ఉండటంతో రైతులపై అప్పుల భారం పెరిగిందని తెలిపారు.

తెలంగాణ రైతు సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి ఇసంపల్లి బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మిర్చి సాగు 4 లక్షలా 50వేల ఎకరాల విస్తీర్ణం నుంచి 2లక్షలా 34వేల ఎకరాల విస్తీర్ణానికి పడిపోయిందన్నారు. అందులో 40శాతం పంట తెగులుతో దెబ్బతిన్నగా, 60శాతం పంట విస్తీర్ణంలో దిగుబడి వచ్చినా కనీసం మద్దతు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి.. ప్రస్తుతం 15 నుంచి 20 క్వింటాళ్లు మాత్రమే వస్తోందని చెప్పారు. అంతర్జాతీయ ఎగుమతి లేదనే పేరుతో రెండు సంవత్సరాలుగా పండిన పంట కోల్డ్ స్టోరేజ్‌లలో మూలుగుతోందన్నారు. మిర్చి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. అనంతరం రైతు సంఘం నాయకులు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలేపాక నిర్మలను కలిసి మార్కెట్ సమస్యలపై, మిర్చి ధరలపై చర్చించారు.

అడ్డుకున్న పోలీసులు

ఎనుమాముల మార్కెట్ సందర్శనకు వచ్చిన తెలంగాణ రైతు సంఘం నాయకులను పోలీసులు గేట్ వద్ద అడ్డుకున్నారు. అనుమతి తీసుకుని మార్కెట్‌లోకి వెళ్లాలనడంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఒకానొక దశలో పోలీసులకు, నాయకులకు మధ్య తోపులాట జరిగింది. చివరికి ఎనుమాముల సీఐ రాఘవేందర్ జోక్యం చేసుకొని మార్కెట్ సందర్శనకు రైతు సంఘం నాయకులను అనుమతించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల కృష్ణారెడ్డి, నాయకులు చల్లా నరసింహారెడ్డి, కొంగర నరసింహస్వామి, కడెం రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

ప్రయివేటీకరణకు ఆజ్యం

- విద్యపై రాష్ట్రాల నియంత్రణకు అడ్డుకట్ట
- యూనివర్సిటీలపై 'షట్‌డౌన్' కత్తి
- హెచ్ఈసీఐ బిల్లుపై పార్లమెంటరీ ప్యానెల్

న్యూఢిల్లీ : మోడీ సర్కారు ప్రతిపాదించిన భారత ఉన్నత విద్యా కమిషన్ (హెచ్ఈసీఐ-హెకీ) బిల్లుపై పార్లమెంటరీ ప్యానెల్ ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ బిల్లు.. విద్యపై రాష్ట్రాల నియంత్రణను తొలగిస్తుందనీ, ప్రయివేటీకరణకు ఆజ్యం పోస్తుందని వివరించింది. ఈ మేరకు డీమ్డ్, ప్రయివేటు విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలలో విద్యా ప్రమాణాల సమీక్ష, అక్రిడిటేషన్ ప్రక్రియ, పరిశోధన, పరీక్ష సంస్కరణలు, విద్యా వాతావరణంపై విద్యకు సంబంధించి రాజ్యసభలో తన నివేదికను పార్లమెంటరీ ప్యానెల్ సమర్పించింది. దేశంలో మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల కొరతను పేర్కొంటూ సంస్థలను మూసివేయటానికి అధికారం కలిగి ఉన్న హెచ్ఈసీఐను ఏర్పాటు చేయాలని విద్యా మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన విషయం విదితమే.కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని విద్యపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన నివేదికను సమర్పించింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ), ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ), నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) స్థానంలో హెచ్ఈసీఐని ఒకే నియంత్రణ సంస్థగా సృష్టించే పురోగతిని నివేదిక పరిశీలించింది. "ప్రతిపాదిత హెచ్ఈసీఐ బిల్లు గణనీయమైన అధికారాలను కలిగి ఉంటుంది. ఇందులో డిగ్రీ ప్రదానం చేసే అధికారాన్ని మంజూరు చేయటం, ప్రమాణాలను పాటించటంలో విఫలమైన సంస్థలను మూసివేయటం వంటివి ఉంటాయి. ఇది రాష్ట్ర నియంత్రణను తొలగిస్తుంది. మౌలిక సదుపాయాలు లేదా అధ్యాపకుల కొరతతో బాధపడుతున్న గ్రామీణ ప్రాంతాల్లోని సంస్థలను మూసివేయటానికి దారి తీస్తుంది. ఇది, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పరోక్షంగా ప్రయివేటీకరణకు ఆజ్యం పోస్తుంది" అని వివరించింది. ఏకీకృత నియంత్రణ సంస్థకు సంబంధించి అన్ని రాష్ట్రాలకూ తగిన ప్రాతినిథ్యం ఉండేలా విద్యా మంత్రిత్వ శాఖ నిర్ధారించాలనీ, అదనపు కేంద్రీకరణ ఉండొద్దని ప్యానెల్ సూచించింది. 90 శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులను విద్యావంతులను చేసే రాష్ట్ర విశ్వవిద్యాలయాలు జాతీయ, రాష్ట్ర స్థాయి నిబంధనల మధ్య ఎలా చిక్కుకున్నాయో కమిటీ నొక్కి చెప్పింది. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల నియామకం అంశంలో యూజీసీ ముసాయిదా నిబంధనలపై ఆరు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల విద్యా మంత్రులు ఇప్పటికే అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం విదితమే. ప్రభుత్వ విశ్వ విద్యాలయాలలో వైస్-ఛాన్సలర్ల(వీసీ) నియామకంలో రాష్ట్రాలకు కీలక పాత్రను అప్పగించాలని వారు కేంద్రాన్ని, యూజీసీని కోరారు. ఈ మేరకు తెలంగాణ, కేరళ, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, జార్ఖండ్ మంత్రులు బెంగళూరులో సమావేశమై.. సహకార సమాఖ్యవాదం స్ఫూర్తితో రాష్ట్రాల సహకారంతో నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలనీ, నియమాలను రూపొందించాలని డిమాండ్ చేస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు.

సంచారజాతి కుటుంబంపై దాడి

- వీడీసీ పేరుతో ట్రాక్టర్‌తో ఇల్లు నేలమట్టం
- మహిళలు, చిన్న పిల్లలకు గాయాలు
- నిజామాబాద్ జిల్లా నల్లవెల్లిలో ఘటన
- సంచార ఓడ్ కుల జిల్లా కమిటీ పరామర్శ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో వీడీసీ పేరుతో కొందరు సంచార ఓడ్ సామాజిక తరగతికి చెందిన కుటుంబంపై దాడిచేసి ట్రాక్టర్‌తో ఇంటిని కూల్చేశారు. వారిని భయభ్రాంతులకు గురి చేశారు. గ్రామానికి చెందిన సాంబారి మురళి సొంత స్థలానికి దారి కావాలని వీడీసీ సభ్యులైన పూదరి మనోహర్, తాళ్ల సాయిలు, ఆగ్గు జలంధర్, బండారి దామోదర్ తదితరులతో కలిసి బ్లేడ్ ట్రాక్టర్‌తో సంచార జాతివారి రేకుల ఇంటిని కూల్చేశారు. తమ ఇంటిని ఎందుకు కూల్చుతున్నారని అడ్డు వచ్చిన చవాన్ లక్ష్మిపై గొంతు నులిమి దాడి చేయగా.. బట్టలు చినిగిపోయాయి. స్పృహ కోల్పోయింది. తాళిబొట్టు తెగిపోయింది. 'పూటకు దిక్కులేని బతకడానికి వచ్చిన వారితో మాటలేంది..?, గాడుదుల లం...లు, లం.. కొడుకులు.. చంపేసినా అడిగే దిక్కు ఉండదు..' అంటూ బెదిరింపులకు పాల్పడ్డారని బాధితురాలు చవాన్ లక్ష్మి వాపోయింది.

బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలి

దాడి విషయం తెలుసుకున్న ఓడ్ కుల జిల్లా కమిటీ సభ్యులు గురువారం నల్లవెల్లి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబీకులను పరామర్శించారు. ఈ ఘటనపై వెంటనే పోలీసులు చర్యలు తీసుకొని సంచార కుటుంబానికి రక్షణ కల్పించాలని ఓడ్ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ శరత్ డిమాండ్ చేశారు. గ్రామంలో 35 సంవత్సరాల నుంచి కూలీ పనులు చేసుకుని జీవిస్తున్న సంచార కుటుంబంపై వీడీసీ పేరుతో కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం ఇంటిని కూల్చడం సరికాదన్నారు. అంతేకాక మహిళపై ఇష్టారాజ్యంగా దాడి చేసి అవమానించడమే కాక రెండేండ్ల బాలుడికి సైతం గాయాలయ్యేలా దౌర్జన్యం చేసిన వీడీసీ సభ్యులపై, సహకరించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసు శాఖ వెంటనే స్పందించి ఈ ఘటనకు పాల్పడిన వారిని అరెస్టు చేసి ఆ కుటుంబానికి రక్షణ కల్పించాలని, లేకుంటే ఓడ్ కుల సంఘం ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్, కలెక్టర్, మానవ హక్కుల కమిషన్, జాతీయ సంచార జాతుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పరామర్శించిన వారిలో జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి జాదవ్ రాజు, ఉపాధ్యక్షులు జాదవ్ నారాయణ, కార్యదర్శి సాలూంకే సుధీర్, సంబాజీ, లక్ష్మణ్, మాదు, రామ్‌దాస్ తదితరులున్నారు.





లవీనా... భర్త, ఇద్దరు పిల్లలతో హాయిగా సాగిపోతున్న ఆమె జీవితంలో క్యాన్సర్ ప్రవేశించింది. కుటుంబాన్ని ఓ కుదుపు కుదిపేసింది. ఆమెనే కాదు భర్తను కూడా క్యాన్సర్ చుట్టుముట్టింది. ఇక వారి బాధలు వర్ణనాతీతం. అన్ని ఇబ్బందుల్లోనూ పిల్లలను కాపాడుకోవాలనే ఆమె సంకల్పం ముందు క్యాన్సర్ ఓడిపోయింది. ఆ వ్యాధిని ధైర్యంగా జయించి ఇప్పుడు ఏకంగా లక్షల టర్నోవర్‌లో వ్యాపారం చేస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఆమె పరిచయం...

అచంచల సంకల్పం ఆమె సొంతం

ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నగరానికి చెందిన లవీనా ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈమె భర్త కూడా ఓ ప్రైవేట్ ఉద్యోగి. వీరికి ఇద్దరు పిల్లలు. హాయిగా సాగిపోతున్న వారి జీవితంలోకి క్యాన్సర్ మహమ్మారి ప్రవేశించి ఒక్క కుదుపు కుదిపేసింది. 2010లో ఆ జంటకు క్యాన్సర్ సోకినట్టు నిర్ధారణ అయ్యింది. లవీనాకు రొమ్ము



క్యాన్సర్ కాగా, ఆమె భర్తకు నోటి క్యాన్సర్ వచ్చింది. మధ్యతరగతికి చెందిన వారికి చికిత్స తీసుకోవడం అత్యంత భారంగా మారింది. ఒక వైపు చికిత్సకు అయ్యే ఖర్చు, మరో వైపు కుటుంబ పోషణ, పిల్లల చదువులు ఇవన్నీ ఎలా నెట్టుకురావాలో అర్థంకాక ఆవేదన చెందారు.

దొరికిన చోటల్లా అప్పులు చేసి

క్యాన్సర్ బారి నుండి ఏదో రకంగా బయట పడి తమ పిల్లల్ని చూసుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. స్నేహితులు, బంధువులు, తెలిసిన వాళ్ళ దగ్గర ఎంత దొరికితే అంత అప్పు చేసి చికిత్స చేయించుకున్నారు. అవి తీర్చగలమనే నమ్మకం కూడా అప్పట్లో వారికి లేదు. కానీ వ్యాధిని జయించాలనే సంకల్పం మాత్రం ఉంది. ఎంతో బాధతో కూడుకున్న కీమోథెరపీ, రేడియోథెరపీలు చేయించుకొని చివరకు కోలుకున్నారు. కానీ ఆర్థిక సమస్యలు మాత్రం చుట్టుముట్టాయి. కనీసం తిండి కూడా లేని పరిస్థితి. కుటుంబాన్ని ఎలా పోషించాలో అర్థం కాలేదు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక చివరకు చనిపోవాలని కూడా నిర్ణయించుకున్నారు.

సరదాగా నేర్చుకున్న కళతో...

లవీనా ఎలాగో క్యాన్సర్ నుండి కోలుకొని మామూలు స్థితికి వచ్చింది. కానీ ఆమె భర్తకు మాత్రం నోటి క్యాన్సర్ కారణంగా వైద్యులు మాట రావడానికి ఇంకా టైం పడుతుందని చెప్పారు. కష్టాల



నుండి బయట పడేందుకు ఉన్న ఇంటిని సైతం అమ్మేసుకున్నారు. లవీనానే ధైర్యం చేసి కుటుంబాన్ని పోషించుకోవడం కోసం ఉపాధిని వెదుక్కొనే పనిలో పడింది. అలాంటి పరిస్థితుల్లోనే ఆమెకు చిన్నప్పుడు సరదాగా నేర్చుకున్న ఫుడ్ కోర్సు గుర్తుకొచ్చింది. అలా సరదాగా నేర్చుకున్న ఆహార సంరక్షణ కోర్సు ఇలా తమ బతుకులు బాగు చేసుకునేందుకు ఉపయోగపడుతుందని ఆమె అస్సలు ఊహించలేదు. ఆ కోర్సులో భాగంగా మురబ్బా, ఊరగాయలు, జామ్‌లు తయారు చేయడం నేర్చుకున్న కళే ఇప్పుడు తనకు జీవనాధారం అని భావించింది. అదే సమయంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆహార సంరక్షణకు సంబంధించిన వందరోజుల ఉపాధి అభివృద్ధి కార్యక్రమం నిర్వహించింది. లవీనా వెంటనే అందులో చేరి శిక్షణ తీసుకుని సర్టిఫికేట్ అందుకుంది.

లవీనాస్ ట్రిప్టి ఫుడ్స్

లవీనా ఎంతో ఆసక్తితో శిక్షణ అయితే పూర్తి చేసింది. కానీ వ్యాపారం ప్రారంభించేందుకు ఆమె వద్ద కేవలం 15 వందల రూపాయలు మాత్రమే ఉన్నాయి. అయినా ఆమె ఏ మాత్రం అధైర్య పడలేదు. వాటినే పెట్టుబడిగా పెట్టి 'లవీనాస్ ట్రిప్టి ఫుడ్స్' అనే పచ్చళ్ళ ఫుడ్‌స్టార్టప్‌ని ప్రారంభించింది. స్వయంగా ఇంట్లో తయారు చేసి స్క్వాష్, జామ్‌లు, ఊరగాయలు విక్రయించడం మొదలుపెట్టింది. అయితే అమ్మకాలు అంత సులభంగా జరగలేదు. తయారు చేయడం ఈజీనే కానీ వాటిని ప్రజల వద్దకు చేరేలా చేయడం ఆమెకు చాలా కష్టంగా మారింది. అసలు వ్యాపార కిటుకేంటో తెలియక చాలాకాలం అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. తన ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయడం, వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడం ఆమెకు ఓ పెద్ద టాస్క్‌లా మారింది.

బతుకు పోరాటంలో...

స్థానికంగా జరిగే కిట్టి పార్టీల ద్వారా తన



వ్యాపారం గురించి ప్రచారం చేయడం మొదలుపెట్టింది. శ్యాంపుల్ బాటిల్స్ ఇవ్వడం వంటివి చేయడంతో మెల్లగా అమ్మకాలు మొదలయ్యాయి. అలా ఒకరి నుంచి ఒకరికి ఆమె స్వయంగా తయారు చేసే పచ్చళ్లు, జామ్‌ల గురించి తెలియడంతో వ్యాపారం ఊపందుకుంది. లాభాలు రావడం మొదలైంది. ఆ లాభాలతో అప్పులు తీర్చడమే కాకుండా కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసింది. అయితే లవీనా చేస్తున్న ఈ బతుకు పోరాటంలో ఆమె కొడుకు తన చదువును పక్కన పెట్టి తల్లి వ్యాపారంలో చేదోడుగా నిలవాల్సి వచ్చింది. తన కొడుకు అందించిన సహకారం వల్లనే తన వ్యాపారం ఈ రోజు ఈ స్థాయికి చేరిందని ఆమె గర్వంగా చెబుతున్నారు. ప్రస్తుతం ఆమె వ్యాపారం 34 లక్షల రూపాయల టర్నోవర్‌తో దూసుకుపోతోంది.

ఆశతో పోరాడితే...

లవీనా కొడుకు కిన్షుక్ మాట్లాడుతూ సీఏ చేయాలనేది నా కల. కానీ ఆర్థిక పరిస్థితుల వల్ల చేయలేకపోయాను. నా కుటుంబాన్ని ఆదుకోవడానికి బంధువులు ఎవరూ ముందుకు రాకపోవడంతో మా అమ్మ ప్రారంభించిన వ్యాపారంలో సాయం చేసేందుకు నేను ముందుకు వచ్చాను. ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేసేందుకు ఇంటింటికి తిరిగేటప్పుడు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాం. వ్యాపారం నిర్వహించడం అంత సులభం కాదని అర్థం చేసుకున్నాను. మాట్లాడలేని నా తండ్రి కూడా నాలో స్ఫూర్తి నింపారు' అంటూ గుర్తు చేసుకున్నాడు. అచంచలమైన సంకల్పం, ఆశతో పోరాడితే గెలుపు తలుపు తప్పక తెరుచుకుంటుందనడానికి ఈ 50 ఏండ్ల క్యాన్సర్ వారియర్ లవీనా జీవితమే ఓ ఉదాహరణ.

పచ్చి పాలతో ఫేస్ ప్యాక్

ఏ వాతావరణంలోనైనా, చర్మానికి సంరక్షణ చాలా అవసరం. కాలుష్యం వల్ల చర్మం పొడిబారిపోతుంది. ఇలాంటి చర్మానికి పచ్చిపాలతో చేసుకునే ఫేస్ ప్యాక్ సంరక్షణ నిస్తుంది.

పచ్చి పాలు చర్మానికి చాలా మంచివి. దీనితో ముఖాన్ని శుభ్రం చేసుకోవచ్చు. ఎండిపోయినట్లుగా ఉండి, నిర్జీవంగా కనిపిస్తున్న చర్మం గలవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఎందుకంటే పచ్చి పాలు చర్మాన్ని తేమగా



ఉంచుతాయి. ఇందుకోసం అవసరమైన పదర్థాలేమిటో చూద్దాం.

రెండు స్పూన్ల పచ్చి పాలు, అర స్పూను పసుపు పొడి, ఒక స్పూను చక్కెర, కొద్దిగా కాఫీ పొడి, గోధుమ పిండి.

ప్యాక్ తయారీ విధానం

ఈ ఫేస్ ప్యాక్ తయారు చేయడానికి, ముందుగా ఒక గిన్నెలో పచ్చి పాలు తీసుకోండి. అందులో పసుపుకొమ్ముల నుంచి తీసిన ఒరిజినల్ పసుపు అర చెంచా, ఒక చెంచా చక్కెర వేసి కలుపుకోండి.

చక్కెర కరిగాక అందులో కాఫీ, గోధుమ పిండి వేసి బాగా కలపండి.

కాస్త ఎక్కువసేపు తిప్పడం వల్ల బాగా కలిసి మిశ్రమం గట్టి పేస్ట్‌లా మారుతుంది. దీన్ని ముఖంపై అప్లయి చేసుకోవాలి.

అలా వేసుకున్న ఫేస్ ప్యాక్‌ను కనీసం 15 నుండి 20 నిమిషాల పాటు ఉంచుకోవాలి.

ఆ తర్వాత చన్నీళ్లతో కడుక్కోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే... ముఖం కాంతివంతంగా అవుతుంది.

మోడీ మౌనమేల?

(మొదటిపేజీ తరువాయి)

స్పందించడం లేదని అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. దేశ పౌరులను బానిసల తరహాలో చేతులకు బేడీలు వేసి, అమానవీయ పరిస్థితుల్లో బహిష్కరించడం సరికాదన్నారు. ఈ పరిస్థితుల నుంచి పిల్లలను, మహిళలను రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు.

మనవాళ్లను బహిష్కరిస్తున్నారని ముందుగానే తెలిసినప్పుడు, కేంద్ర సర్కార్ ఎందుకు స్పందించలేకపోయిందని కాంగ్రెస్ ఎంపీ గుర్జీత్ సింగ్ ఔజ్లా మండిపడ్డారు. అంతకుముందు... అమెరికా నుంచి అమానవీయంగా భారతీయుల్ని బహిష్కరించడంపై చర్చకు పట్టుబడుతూ ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభలో వాయిదా తీర్మానం ఇచ్చారు.

దేశ ప్రజల్ని మరింత అమానవీయంగా చూడకుండా, స్వదేశంలో, విదేశాలలో ప్రతి భారతీయుడి గౌరవాన్ని నిలబెట్టడానికి ఈ సమస్యపై అత్యవసరంగా పరిష్కరించాలని తీర్మానంలో పొందుపరిచారు.

స్తంభించిన లోక్‌సభ...రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్

భారతీయుల తరలింపులో అమెరికా పాల్పడిన అమానవీయతకు వ్యతిరేకంగా లోక్‌సభలో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. గురువారం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టాయి. ప్రధాని మోడీ స్పందించాలని, భారతీయుల ఆత్మగౌరవాన్ని కాపాడాలంటూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు హెూరెత్తించారు. దీంతో సభ వెంటనే మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో పరిస్థితిలో ఎటువంటి మార్పు రాకపోవడంతో సభను మధ్యాహ్నం 3.30 గంటలకు వాయిదా వేశారు. మళ్లీ తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో సభ నేటి (శుక్రవారం)కి వాయిదా పడింది. మరోవైపు రాజ్యసభ కూడా ఇదే తీరులో కొనసాగింది. రాజ్యసభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్షాల ఆందోళనతో మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన నేపథ్యంలో విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్ ప్రకటన చేశారు. అయితే ఈ ప్రకటనను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.

అక్రమ వలసదారులను పంపడం కొత్తేమీ కాదు: జై శంకర్

అక్రమ వలసదారులను స్వదేశానికి పంపడం కొత్తేమి కాదని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జై శంకర్ అన్నారు. ఇది ఆ దేశ ప్రామాణిక విధానమని అన్నారు. విమానంలో వారిని తిరిగి తీసుకువస్తున్న తరుణంలో వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించడం మాత్రం సరికాదని మంత్రి అభిప్రాయపడ్డారు. విదేశాల్లో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్టు తేలితే తమ పౌరులను తిరిగి తీసుకు రావడం అన్ని దేశాల ప్రాథమిక బాధ్యత అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. అయితే ఇలా దేశం నుంచి వెనక్కి పంపుతున్న వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించకుండా ఉండాలని, అమెరికా అధికారులతో తాము సంప్రదింపులు జరుపుతున్నట్టు ఆయన తెలిపారు. ఇక బహిష్కరణకు గురైన వారు అందించిన సమాచారం ఆధారంగా ఏజెంట్లు, ఏజెన్సీలపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ అంశంపై అమెరికా ప్రభుత్వంతో చర్చిస్తున్నామన్నారు. ఇదే సమయంలో చట్టబద్ధమైన ప్రయాణికులకు వీసాలను సులభతరం చేయడంతోపాటు అక్రమ వలసదారులపై కఠిన చర్యలు తీసుకోవడం ఉండాలన్నారు. అయితే మహిళలు, చిన్న పిల్లలతో ఈ విధంగా వ్యవహరించడం లేదని తమకు సమాచారం అందిందని తెలిపారు.

ట్రంప్ మళ్లీ యూటర్న్

(మొదటిపేజీ తరువాయి)

కరోలిన్ లీవిట్ బుధవారం వేర్వేరు ప్రాంతాల్లో విలేకరులతో మాట్లాడుతూ పునర్నిర్మాణ పనుల కోసం గాజాలో నివసిస్తున్న సుమారు 18 లక్షల మంది పాలస్తీనియన్లను తాత్కాలికంగా తరలించాలన్నదే ట్రంప్ ఉద్దేశమని వివరణ ఇచ్చారు.

యుద్ధ భూమిగా మారిన గాజా నుండి పాలస్తీనియన్లను శాశ్వతంగా తరలిస్తామని, అక్కడ అమెరికా దళాలను మోహరించి పెద్ద ఎత్తున పునర్నిర్మాణ పనులు చేపడతామని ట్రంప్ కొద్ది రోజుల క్రితం ప్రకటించారు. ఈ ప్రతిపాదనపై పాలస్తీనియన్లు మండిపడ్డారు. ఒకవేళ తమను అరబ్ దేశాలకు తరలిస్తే తిరిగి ఎన్నటికీ గాజాలో అడుగు పెట్టలేమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా విదేశాంగ మంత్రిగా తొలి విదేశీ పర్యటనలో ఉన్న రుబియో తాజా పరిణామాలపై స్పందిస్తూ ట్రంప్ ప్రతిపాదన చాలా ఉదారంగా ఉన్నదని చెప్పారు. ఇజ్రాయిల్, హమాస్ మధ్య పదిహేను నెలల పాటు కొనసాగిన యుద్ధంలో గాజా శిథిలాల కుప్పగా మారిందని, వాటిని తొలగించి తిరిగి పునర్నిర్మాణ పనులు చేపట్టాలన్నదే ట్రంప్ ఉద్దేశమని తెలిపారు. పనులు పూర్తయ్యే వరకూ పాలస్తీనియన్లు ఎక్కడో అక్కడ నివసించాల్సి వస్తుందని ఆయన గ్వాటెమాలా సిటీలో విలేకరులకు చెప్పారు. మరోవైపు వాషింగ్టన్‌లో లీవిట్ విలేకరులతో మాట్లాడుతూ గాజా శిథిలాల దిబ్బగా మారిందని అన్నారు. అక్కడి ప్రజలను తాత్కాలికంగా ఖాళీ చేయించాల్సిన అవసరం ఉన్నదని ట్రంప్ స్పష్టంగా చెప్పారని తెలిపారు. ప్రస్తుతం గాజా మానవులకు నివాసయోగ్యం కాదని అన్నారు.అమెరికా రక్షణ మంత్రి హెగ్‌సేథ్ పెంటగాన్‌లో ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూతో సమావేశమయ్యారు. గాజాలో పునర్నిర్మాణ పనులను పరిశీలించేందుకు తమ సైన్యం సన్నద్ధంగా ఉన్నదని చెప్పారు. ఇదిలావుండగా గాజా నుండి పాలస్తీనియన్లను ఖాళీ చేయిస్తే మధ్యప్రాచ్యంలో సుస్థిరతకు ప్రమాదం ఏర్పడుతుందని ఈజిప్ట్, జోర్డాన్‌తో పాటు ఆ ప్రాంతానికి చెందిన ఇతర అమెరికా మిత్రపక్షాలు హెచ్చరించాయి. ఘర్షణలు మరింత విస్తరిస్తాయని తెలిపాయి. సమస్య పరిష్కారం కోసం అమెరికా, దాని మిత్ర దేశాలు దశాబ్దాల తరబడి చేస్తున్న ప్రయత్నాలకు విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి. స్వతంత్ర పాలస్తీనాకు తాము కట్టుబడి ఉన్నామని సౌదీ అరేబియా మరోసారి పునరుద్ఘాటించింది. కాగా రిపబ్లికన్ సెనెటర్, ట్రంప్ సన్నిహితుడు లిండ్సే గ్రహం సైతం దేశాధ్యక్షుని ప్రతిపాదనను వ్యతిరేకించారు. ఇది మరిన్ని సమస్యలకు దారి తీస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

మనోళ్లపై అమానుషం..

న్యూఢిల్లీ : అమెరికాలో చట్టవిరుద్ధంగా ప్రవేశించిన 104 మంది భారతీయులను అక్కడి అధికారులు తిరిగి వెనక్కి పంపిన తీరు గర్హనీయమని, అది ఆమోదయోగ్యం కాదని సీపీఐ (ఎం) విమర్శించింది. భారతీయుల చేతులకు సంకెళ్లు వేసి వారిని కదలనీయకుండా కట్టడి చేశారని, అమెరికా సైనిక విమానంలో దీర్ఘకాల ప్రయాణం చేయించారని మండిపడింది. తన పౌరుల పట్ల ఇంత అమానుషంగా ప్రవర్తిస్తుంటే మోడీ ప్రభుత్వం పిరికిపందలా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. మరింత మంది భారతీయులను విడతల వారీగా స్వదేశానికి పంపే అవకాశం ఉన్నందున వారి పట్ల మానవీయంగా, గౌరవప్రదంగా వ్యవహరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సూచించింది.

డ్రైవర్ నిర్లక్ష్యం..చిన్నారి మృతి

(మొదటిపేజీ తరువాయి)

పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హయత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పెద్ద అంబర్‌పేట హనుమాన్ హిల్స్‌లో నివాసం ఉంటున్న బొబ్బిలోగామ రిత్విక(4) పెద్ద శ్రీ చైతన్య స్కూల్‌లో ఎల్‌కేజీ చదువుతున్నది. రోజూలాగే బాలిక గురువారం సాయంత్రం 3 గంటలకు స్కూల్ ముగియగానే ప్రయివేటు ఓమ్నీ వ్యాన్‌లో ఇంటి వద్దకు చేరుకుంది. వ్యాన్ దిగి వెళ్లే క్రమంలో డ్రైవర్ గణేష్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడపడంతో ముందు టైరు బాలిక తలపై నుంచి వెళ్లింది. దాంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

నేషన్ ఫస్ట్ మా విధానం

రాజ్యసభలో ప్రధాని మోడీ

ప్రతిపక్షాలపై విమర్శలకే సమయం

న్యూఢిల్లీ : నేషన్ ఫస్ట్ తమ విధానమని ప్రధాని మోడీ అన్నారు. సమాజంలో కాంగ్రెస్ కులమత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. గురువారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడానికి ఎక్కువ సమయం కేటాయించారు. తమ విధానాలలో "నేషన్ ఫస్ట్" అనే స్ఫూర్తిని పరిగణించామని పేర్కొన్నారు. 2014 తరువాత దేశం ఒక కొత్త నమూనాను చూసిందని చెప్పారు. కాంగ్రెస్ స్వార్థపూరిత రాజకీయాలు అందరినీ మోసం చేశాయని విమర్శించారు. తాము బాబా సాహెబ్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లి పేదలకు సహాయం చేశామని అన్నారు. కాంగ్రెస్ దానిని గతంలో తీవ్రమైన సంక్షోభంగా మార్చిందని పేర్కొన్నారు. 2014లో తమ ప్రభుత్వం ఈ ఆలోచనను పూర్తిగా మార్చేసిందని, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికవృద్ధికి తాము ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. ఆ క్రమంలో మొదటిసారి వ్యాపారంలోకి వస్తున్న వారికి ముద్ర పథకంతో ఎలాంటి హామీ లేకుండా రుణం ఇస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రపతి ప్రసంగం స్ఫూర్తిదాయకంగా, ప్రభావవంతంగా, భవిష్యత్తు పనుల కోసం మనందరికీ మార్గదర్శకంగా ఉందన్నారు. చరిత్రను పరిశీలిస్తే కాంగ్రెస్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను ద్వేషించిందని, ఆయనపై



ఎంత కోపంగా ఉందో మనకు తెలుస్తుందని అన్నారు. బాబా సాహెబ్‌ను భారతరత్నకు ఎప్పుడూ అర్హులుగా పరిగణించలేదన్నారు. కానీ ప్రస్తుతం ఈ దేశ ప్రజలు బాబా సాహెబ్ భావాలను గౌరవించారని, ఈ సమయంలో కాంగ్రెస్ తప్పక జై భీమ్ అనాల్సి వస్తుందని ఎద్దేవా చేశారు. వాళ్ల ఎప్పటికప్పుడు రంగులు మార్చుకుంటారని ఎద్దేవా చేశారు. దేశానికి తొలి ప్రభుత్వ సమయంలో నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్నారని, ఆ క్రమంలో ముంబయిలో కార్మికుల సమ్మె జరిగిందని అన్నారు. అందులో ప్రముఖ గీత రచయిత మజ్రూహ్ సుల్తాన్‌పురి బానిస అనే పాటను పాడారని, దీంతో నెహ్రూ ఆయనను జైల్లో పెట్టారని విమర్శించారు. ఆ క్రమంలో ప్రముఖ నటుడు బలరాజ్ సాహ్నీ ఊరేగింపులో పాల్గొన్నారని, ఆయనను కూడా జైల్లో పెట్టారని పేర్కొన్నారు. లతా మంగేష్కర్ సోదరుడు హృదయనాథ్ మంగేష్కర్ ఆల్ ఇండియా రేడియోలో వీర్ సావర్కర్‌పై ఒక కవిత పఠించాలని అనుకున్నారని, దీని కారణంగా ఆయనను ఆకాశవాణి నుంచి బహిష్కరించారని తెలిపారు. వీరి సమయంలో దేశం అత్యవసర పరిస్థితిని కూడా చూసిందన్నారు. రాజ్యాంగాన్ని తుడిచి పెట్టారని, రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కారని పేర్కొన్నారు. ఇదంతా వారి అధికారం, ఆనందం కోసమే జరిగిందని అన్నారు. అత్యవసర పరిస్థితి సమయంలో ప్రముఖ కళాకారుడు దేవ్ ఆనంద్‌ని ఎమర్జన్సీకి మద్దతు ఇవ్వమని కోరారని, దేవ్ ఆనంద్ నిరాకరించారని వివరించారు. దాంతో దూరదర్శన్‌లో దేవ్ ఆనంద్ సినిమాలు నిషేధించారని అన్నారు. ఆ తరువాత కిషోర్ కుమార్ కాంగ్రెస్ తరపున పాడటానికి నిరాకరించారని, దీంతో కాంగ్రెస్ పార్టీ ఆల్ ఇండియా రేడియోలో కిషోర్ పాటలను నిషేధించిందని తెలిపారు.

సీఎం రేవంత్‌కు వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రశంసలు

తెలంగాణ భాగస్వామ్యం ఎందరికో స్ఫూర్తి నిచ్చిందని వ్యాఖ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని సమర్థవంతమైన నాయకత్వంతో అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని వరల్డ్ ఎకనామిక్‌ఫోరం అభినందించింది. ఈ మేరకు ఫోరం అధ్యక్షులు బోర్గే బ్రెండే, మేనేజింగ డైరెక్టర్ మిరెక్ డెసెక్ సీఎంకు లేఖ రాశారు. "వరల్డ్ ఎకనామిక్ ఫోరంకు మీ మద్దతు, సహకారానికి ధన్యవాదాలు, గతేడాది ప్రారంభించిన హెల్త్ టెక్, లైఫ్ సైన్సెస్‌లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. "కొలాబ్రేషన్ ఫర్ దీ ఇంటిలిజెంట్ ఏజ్" అనే థీమ్‌తో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశం 2025లో మీ చురుకైన భాగస్వామ్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. రాబోయే పదేండ్లలో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే మీ విజన్‌తో సదస్సులో పాల్గొన్న వారు స్ఫూర్తి పొందారు. ఆధునిక సాంకేతికత, ప్రతిభ, స్వచ్ఛమైన ఇంధనం, స్థిరమైన వృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడానికి రైజింగ్ తెలంగాణ 2050 యొక్క లక్ష్యాన్ని నెరవేర్చడానికి కంట్రీ స్ట్రాటజీ డైలాగ్‌లో మీ ఉపన్యాసం పలువురిని ఆకర్షించింది. 2047 నాటికి హైదరాబాద్‌ను భారతదేశంలోని మొట్టమొదటి నెట్-జీరో కార్బన్ నగరంగా చేయాలనే మీ ఆలోచనలను పలువురు స్వాగతించారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నాం. ఫోరమ్ కమ్యూనిటీ తరపున, దావోస్‌లో మీ భాగస్వామ్యం, విలువైన సహకారానికి ధన్యవాదాలు" అని సీఎంను లేఖలో వారు అభినందించారు.

జనగణనలో జాప్యం

(మొదటిపేజీ తరువాయి)

అరుణాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతా(యూటీ) లు 2022 వరకు నివేదికలను ప్రచురించాయని కొన్ని కథనాల సమాచారం. 2023 నివేదికను కలిగి ఉన్న ఏకైక రాష్ట్రంగా మిజోరం ఉన్నది.

కులగణనకు పెరిగిన డిమాండ్.. లెక్క చేయని మోడీ సర్కారు

2020-21లో నిర్వహించాల్సిన జనగణన తొలుత కరోనా మహమ్మారి కారణంగా ఆలస్యమైంది. అయితే, అదే తరుణంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్షాల నుంచి 'సామాజిక న్యాయం' డిమాండ్ వినిపించింది. అంటే, దేశంలో కులాలవారీగా జనగణను నిర్వహించాలని పట్టుబట్టాయి. ఎన్నికల్లో, పార్లమెంటులోనూ తమ గళాన్ని వినిపించాయి. కాంగ్రెస్, దాని మిత్రపక్ష పాలిత రాష్ట్రాలు కొన్ని కుల గణన జరిపాయి. దీంతో కులగణన డిమాండ్ ప్రాధాన్యతను సంతరించుకున్నది. హిందూత్వ ఎజెండాతో రాజకీయాలు చేసే బీజేపీకి.. ఇది ఒక తలనొప్పిగా మారింది. దీంతో జనగణన ప్రక్రియను కేంద్రం నిలిపివేసినట్టు కనిపిస్తున్నదని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. "కులాల సంఖ్యను లెక్కించటానికి మార్గాలు, చర్యలపై గత కొన్ని నెలలుగా చర్చలు జరుగుతున్నాయి. అయితే, బీజేపీ నేతృత్వంలోని కేంద్రంలో గల ఎన్డీఏ సర్కారు.. జనగణన విషయంలో ముందుకెళ్లటం లేదు. ఎస్సీ, ఎస్టీ కాకుండా.. స్వతంత్ర భారతంలో కులాలవారీగా జనాభాను లెక్కించలేదు" అని ఒక కీలక అధికారి చెప్పారు. 2011లో, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం జనగణన నుంచి వేరుగా సామాజిక, ఆర్థిక, కుల గణన (ఎస్ఈసీసీ) కింద మొట్టమొదటి కుల గణనను నిర్వహించింది. కానీ ఆ ఫలితాలు బహిర్గతం కాకపోవటం గమనార్హం.

ఈ ఏడాదీ లేనట్టే..!

మోడీ సర్కారు ఈ ఏడాది కూడా జనాభా లెక్కలను జరిపేలా లేదని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. జనాభా గణనను జరపాలంటే.. గతేడాది నవంబర్‌లోనే ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసి ఉండాలని చెప్తున్నారు.

అలాగే, కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు జరగకపోవటాన్ని కూడా వారు ఎత్తిచూపుతున్నారు. "దేశంలో జనాభా కూర్పు, జనాభా మార్పులను అర్థం చేసుకోవటానికి కొత్త జనాభా గణన చాలా అవసరం" అని మద్రాసు విశ్వవిద్యాలయంలో ని సెంటర్ ఫర్ పాపులేషన్ స్టడీస్ హెడ్ ఇంచార్జ్ డి. సత్యవన్ అన్నారు. దేశంలో డేటా లేకుండా విధానాల అమ లు జరుగుతున్నదని ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మైగ్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ చైర్మెన్ ఎస్.ఇరుదయ రాజన్ తెలిపారు.

ఆసక్తి చూపని కేంద్రం

జనగణన విషయంలో మోడీ సర్కారు ఆసక్తి చూపటంలేదనీ, 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన జనభా లెక్కల ప్రక్రియ జరగలేదని గుర్తు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక ప్రభుత్వం సమయానికి జనగణనను నిర్వహించటంలో విఫలం కావటం ఇదే మొదటిసారి అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం(ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన) నుంచి 10-12 కోట్ల మంది వ్యక్తులు మినహాయించబడిన విషయాన్ని ఆయన చెప్పారు. సామాజిక-ఆర్థిక కుల గణనను తప్పించుకుంటున్నదనటానికి ఇదే నిదర్శనమని జైరాం రమేశ్ అన్నారు.



ఇక నుంచి 15 పాయింట్లే!

బ్యాడ్మింటన్ స్కోరింగ్‌లో కొత్త ప్రయోగం

కౌలాలంపూర్ (మలేషియా) : కమర్షియల్, కార్పొరేట్ రంగు పులుముకున్న క్రీడలు జనాకర్షణ కోసం సరికొత్త ప్రయోగాలు చేస్తున్నాయి. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బిడబ్ల్యూఎఫ్) సైతం అదే తరహాలో ఆలోచన చేస్తోంది. గేములను మరింత రక్తి కట్టించేందుకు, మ్యాచ్‌లో ఉత్కంఠ పెంచేందుకు, అభిమానులకు చేరువ అయ్యేందుకు స్కోరింగ్ సిస్టమ్‌ను మార్చే ఆలోచనలో ఉంది. ప్రస్తుతం బ్యాడ్మింటన్‌లో ప్రతి మ్యాచ్‌లో మూడు గేములు, ప్రతి గేమ్‌లో 21 పాయింట్లు స్కోరింగ్ పద్దతి నడుస్తోంది. మూడు గేముల ఫార్ములాను కొనసాగిస్తూ పాయింట్లను 15కు కుదించనున్నారు. బిడబ్ల్యూఎఫ్ గ్రేడ్ 3 టోర్నమెంట్లలో ఆరు నెలల పాటు ఈ స్కోరింగ్ పద్దతిని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు.

అనంతరం ఫలితాల నివేదికను 2026 వార్షిక సర్వ సభ్య సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదం కోరనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు కొత్త స్కోరింగ్ పద్దతిని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు.

ఆడుతూ పాడుతూ..!

- గిల్, అయ్యర్, అక్షర్ అర్థ సెంచరీలు
- మూడు వికెట్లతో మెరిసిన రానా, జడేజా

తొలి వన్డేలో భారత్ ఘన విజయం



నాగ్‌పూర్ వన్డేలో ఇంగ్లాండ్‌పై భారత్ 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. శుభ్‌మన్ గిల్ (87), శ్రేయస్ అయ్యర్ (59), అక్షర్ పటేల్ (52) అర్థ సెంచరీలతో 249 పరుగుల లక్ష్యాన్ని భారత్ అలవోకగా ఛేదించింది. మరో 68 బంతులు ఉండగానే 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. భారత్, ఇంగ్లాండ్ రెండో వన్డే కటక్‌లో ఆదివారం జరుగనుంది.

నవతెలంగాణ-నాగ్‌పూర్

శుభ్‌మన్ గిల్ (87, 96 బంతుల్లో 14 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (59, 36 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (52, 47 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. 249 పరుగుల ఛేదనలో కెప్టెన్ రోహిత్ శర్మ (2), ఓపెనర్ యశస్వి జైస్వాల్ (15) నిరాశపరిచినా.. ఈ ముగ్గురు బ్యాటర్లు అదరగొట్టారు. 38.4 ఓవర్లలోనే ఛేదనను ముగించి భారత్‌కు 4 వికెట్ల తేడాతో విజయాన్ని అందించారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 47.4 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. అరంగేట్ర బ్యాటర్ జాకబ్ బెతెల్ (51, 64 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ జోశ్ బట్లర్ (52, 67 బంతుల్లో 4 ఫోర్లు) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లు హర్షిత్ రానా (3/53), రవీంద్ర జడేజా (3/26) మూడేసి వికెట్లతో మెప్పించారు. తొలి వన్డేలో విజయంతో భారత్ 1-0తో సిరీస్‌లో ముందంజ వేసింది.

ఆ ముగ్గురు మెరువగా.. :

249 పరుగుల ఛేదనలో ఓపెనర్లు నిరాశపరిచారు. అరంగేట్రంలో యశస్వి జైస్వాల్ (15) మూడు ఫోర్లతో దూకుడు ప్రదర్శించినా వికెట్ నిలుపుకోలేదు. రోహిత్ శర్మ (2) మళ్లీ విఫలమయ్యాడు. 19 పరుగులకే భారత్ ఓపెనర్లను కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో శ్రేయస్ అయ్యర్ (59), శుభ్‌మన్ గిల్ (87) కీలక భాగస్వామ్యం నిర్మించారు. 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 30 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన శ్రేయస్ అయ్యర్ మిడిల్ ఆర్డర్‌పై ఒత్తిడి తొలగించాడు. మరో ఎండ్‌లో గిల్ సమయోచిత ఇన్నింగ్స్ ఆడాడు. ఏడు ఫోర్లతో 70 బంతుల్లో అర్థ సెంచరీ అందుకున్నాడు. అయ్యర్, గిల్ మూడో వికెట్‌కు 94 పరుగులు జోడించగా.. అక్షర్ పటేల్ (52)తో కలిసి గిల్ సెంచరీ భాగస్వామ్యం నమోదు చేశాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో దంచికొట్టిన అక్షర్ పటేల్ 46 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. ఈ జోడీ నాల్గో వికెట్‌కు 108 పరుగులు జోడించింది. కెఎల్ రాహుల్ (2) నిరాశపరిచినా.. హార్దిక్ పాండ్య (9 నాటౌట్), రవీంద్ర జడేజా (12 నాటౌట్) లాంఛనం ముగించారు.

అంతకుముందు ఇంగ్లాండ్‌కు ఓపెనర్లు సాల్ట్ (43), డకెట్ (32) మంచి ఆరంభం అందించారు. 75/0తో ఉన్న ఇంగ్లాండ్‌ను మనోళ్లు సూపర్ ఫీల్డింగ్‌తో 77/3తో ఒత్తిడిలో పడేశారు. జోశ్ బట్లర్ (52), బెతెల్ (51) అర్ధ సెంచరీలతో ఇంగ్లాండ్ కోలుకున్నా.. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టారు. ఆ జట్టును 47.4 ఓవర్లలో 248 పరుగులకే ఆలౌట్ చేశారు.




స్కోరు వివరాలు :

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ : 248/10 (జోశ్ బట్లర్ 52, జాకబ్ బెతెల్ 51, రవీంద్ర జడేజా 3/26, హర్షిత్ రానా 3/53)

భారత్ ఇన్నింగ్స్ : 251/6 (శుభ్‌మన్ గిల్ 87, శ్రేయస్ అయ్యర్ 59, అక్షర్ పటేల్ 52, ఆదిల్ రషీద్ 2/49)

కమిన్స్, హాజిల్‌వుడ్ అవుట్

ఐసీసీ 2025 చాంపియన్స్ ట్రోఫీ



కాన్‌బెర్రా (ఆస్ట్రేలియా) : ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ చాంపియన్స్, అగ్ర జట్టు ఆస్ట్రేలియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి కంగారూ జట్టులో ఇద్దరు కీలక పేసర్లు దూరం అయ్యారు. కెప్టెన్ పాట్ కమిన్స్, పేసర్ జోశ్ హాజిల్‌వుడ్ చాంపియన్స్ ట్రోఫీకి దూరమైనట్టు సీఏ (క్రికెట్ ఆస్ట్రేలియా) అధికారికంగా వెల్లడించింది. పాట్ కమిన్స్ చీలమండ గాయంతో, జోశ్ హాజిల్‌వుడ్ హిప్ గాయంతో, మిచెల్ మార్ష్ వెన్నునొప్పితో బాధపడుతున్నారు. ఈ మేరకు సీఏ సెలక్షన్ కమిటీ చైర్మెన్ జార్జ్ బెయిలీ తెలిపాడు. చాంపియన్స్ ట్రోఫీ తుది జట్టు ఖరారు చేసేందుకు ఫిబ్రవరి 12 ఆఖరు గడువు. జనవరి 13న ప్రకటించిన జట్టులో ఆస్ట్రేలియా సెలక్షన్ కమిటీ కనీసం నాలుగు మార్పులు చేయాల్సి ఉంది. గాయాలతో కమిన్స్, హాజిల్‌వుడ్ సహా మిచెల్ మార్ష్ దూరం కాగా.. ఆల్‌రౌండర్ మార్కస్ స్టోయినిస్ అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం శ్రీలంకతో వన్డే సిరీస్‌లో పోటీపడనున్న ఆస్ట్రేలియా.. ఫిబ్రవరి 12న ఆఖరు మ్యాచ్ ఆడనుంది. శ్రీలంకతో సిరీస్‌కు ముగ్గురు సీమర్లను జట్టులోకి ఎంపిక చేశారు. సీన్ అబాట్, స్పెన్సర్ జాన్సన్, బెన్ సహా తన్వీర్ సంగా, ఆల్‌రౌండర్ కూపర్, బ్యాటర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్‌లు శ్రీలంకతో వన్డే సిరీస్‌లో బరిలోకి దిగుతున్నారు.

వన్డేలకు స్టోయినిస్ వీడ్కోలు

ఆసీస్ ఆల్‌రౌండర్ అనూహ్య నిర్ణయం



మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా) : ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ముంగిట ఆస్ట్రేలియాకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఓ వైపు గాయాలతో కీలక ఆటగాళ్లు దూరం కాగా.. ఆల్‌రౌండర్ మార్కస్ స్టోయినిస్ అనూహ్యంగా రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. ఆస్ట్రేలియా చాంపియన్స్ ట్రోఫీ జట్టులో స్టోయినిస్ సభ్యుడు. ఇటీవల ఎస్ఏ20లో డర్బన్ జెయింట్స్ తరఫున ఆడిన స్టోయినిస్ గాయం బారిన పడ్డాడు. శ్రీలంకతో వన్డే సిరీస్‌కు ఆసీస్ జట్టు ద్వీపదేశానికి బయల్దేరాల్సి ఉండగా.. స్టోయినిస్ వీడ్కోలు ప్రకటన చేయటం గమనార్హం. 35 ఏండ్ల స్టోయినిస్ 71 వన్డేల్లో 26.69 సగటుతో 1495 పరుగులు చేశాడు. 2017 ఆక్లాండ్ వన్డేలో న్యూజిలాండ్‌పై అజేయ 146 శతక ఇన్నింగ్స్ స్టోయినిస్ కెరీర్ అత్యుత్తమం. స్టోయినిస్ 43.12 సగటుతో 48 వికెట్లు సైతం తీసుకున్నాడు. 2023 వన్డే వరల్డ్‌కప్ విజయంలో మార్కస్ స్టోయినిస్ కీలక భూమిక పోషించాడు. వన్డేలకు దూరమైనా.. టీ20 ఫార్మాట్‌లో కొనసాగుతానని స్టోయినిస్ తెలిపాడు. 'ఆస్ట్రేలియాకు ప్రాతినిథ్యం వహించటం నమ్మశక్యం కాని ప్రయాణం. జాతీయ జట్టు తరఫున ఆడిన ప్రతి క్షణం గొప్పగా భావించాను. ఈ నిర్ణయం అంత సులువు కాదు. కానీ వన్డేల నుంచి తప్పుకునేందుకు ఇదే సరైన సమయం అనిపించింది. ఇక నుంచి నా ఫోకస్ పూర్తిగా టీ20 ఫార్మాట్‌పైనే కొనసాగుతుంది' అని మార్కస్ స్టోయినిస్ వెల్లడించాడు.

క్రీడల్లోనూ ట్రంప్ మార్క్

మహిళల క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లు నిషేధం



వాషింగ్టన్ డిసి (యుఎస్ఏ) : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్రీడల్లోనూ దూకుడు చూపిస్తున్నాడు. మహిళల క్రీడల్లో ట్రాన్స్‌జెండర్ల ప్రాతినిథ్యంపై గతంలోనే గళం విప్పిన ట్రంప్.. తాజాగా మహిళా క్రీడాకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాడు. అమెరికాలో మహిళల క్రీడాంశాల్లో ఇక నుంచి ట్రాన్స్‌జెండర్లను అనుమతించరు. ఈ మేరకు డొనాల్డ్ ట్రంప్ బుధవారం వైట్‌హౌస్‌లో కార్యనిర్వాహక ఆదేశాన్ని (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్) జారీ చేశారు. మహిళల క్రీడల్లో పోటీపడే అర్హత బయలాజికల్ లింగ ప్రామాణికంగానే నిర్ణయించాలని.. ఇతర ఏ అంశాలను పరిగణనలోకి తీసుకోవద్దని ట్రంప్ తన ఆదేశంలో స్పష్టం చేశారు. ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌తో అమెరికాలో ఇక అన్ని క్రీడా సంఘాలు ట్రాన్స్‌జెండర్లను మహిళల క్రీడాంశాల్లో అనుమతించలేవు.

ఐఓసీపై ఒత్తిడి :

ట్రంప్ ఆదేశంతో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)పై ఒత్తిడి పెరగనుంది. 2028 లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లోనూ ట్రాన్స్‌జెండర్లను మహిళల క్రీడాంశాల్లో అనుమతించకూడదని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఈ దిశగా ఐఓసీపై ఒత్తిడి తీసుకురావాలని సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కు ఆదేశాలు జారీ చేశారు. ట్రాన్స్‌జెండర్ల అంశంలో ఐఓసీకి ఎటువంటి మార్గదర్శకాలు లేవు. అంతర్జాతీయ క్రీడా సమాఖ్యలు తమకు తోచినట్టు నిర్ణయాలు తీసుకునే అధికారం ఐఓసీ ఇచ్చింది. స్విమ్మింగ్‌లో కఠిన నిబంధనలు ఉంటే.. ట్రయథ్లాన్‌లో సరళంగా ఉన్నాయి. ట్రంప్ ఒత్తిడితో ఐఓసీ త్వరలోనే ఈ అంశంలో స్పష్టమైన నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

రేపటి నుంచి ఓపెన్ చెస్ టోర్నీ



హైదరాబాద్ : బొడిగ బాలయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ ఓపెన్ చెస్ టోర్నమెంట్ రేపటి నుంచి ఆరంభం కానుంది. చెర్లపల్లిలోని ఈసీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో బాలురు, బాలికల అండర్-7, 9, 11, 13, 15 విభాగాల్లో పోటీలు జరుగుతాయి. ఏడు రౌండ్ల పాటు జరుగనున్న ఈ పోటీలను ఫిడె రూల్స్ ప్రకారం స్విస్ ఫార్మాట్‌లో నిర్వహిస్తున్నామని తెలంగాణ చెస్ సంఘం అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. టోర్నమెంట్‌లో పోటీపడేందుకు ఆసక్తిగల ప్లేయర్లు 7337578899, 7337399299 నంబర్లను సంప్రదించవచ్చు.



ఫిల్మ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సినీ అవార్డులు

- ప్రతి ఏటా ఫిబ్రవరి 6న తెలుగు సినిమా పుట్టినరోజు వేడుక..
- పరుచూరి గోపాలకృష్ణకు జెండా రూపకల్పన బాధ్యత

ఫిబ్రవరి 6వ తేదీని.. తెలుగు సినిమా పుట్టిన రోజుగా నిర్వహించాలని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయించింది. ఇకపై ప్రతి యేడాది ఈ రోజును తెలుగు సినిమా పుట్టిన రోజుగా జరుపనున్నారు. ప్రభుత్వం అందించే అవార్డులతో పాటు, ఛాంబర్ తరపు నుంచి వివిధ కేటగిరీల్లో అవార్డులు కూడా అందించనున్నారు. తెలుగు సినిమా పుట్టినరోజున ప్రతి సినిమా నటుడు ఇంటిపై, థియేటర్ల వద్ద ప్రత్యేకంగా జెండా ఆవిష్కరించాలని కూడా ఛాంబర్ నిర్ణయించింది. ఈ జెండా రూపకల్పన బాధ్యతను రచయిత పరిచూరి గోపాలకృష్ణకు అప్పగించింది.

తొలి తెలుగు టాకీ సినిమాకు సంబంధించి వివరాలను ఎంతో రీసెర్చ్ చేసి 'భక్త ప్రహ్లాద' గురించి తెలిపిన సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ కృషిని గుర్తు చేసుకుంటూ, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్ భూషణ్ ఆధ్వర్యంలో ఇదే వేదికపై ఆయన రచించిన 'మన సినిమా ఫస్ట్ రీల్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఛాంబర్ ప్రెసిడెంట్ దామోదర ప్రసాద్ మాట్లాడుతూ,'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ తరపున తెలుగు సినిమా దినోత్సవం మొదటిసారి చేయబోతున్నాం. సినిమా అనేది మా అందరికీ తల్లి లాంటిది. తెలుగు సినిమా ఛాంబర్ మదర్ బాడీ ఇక నుంచి ప్రతి సంవత్సరం చేయాలని డిసైడ్ చేశాం. మొదటి ఏడాది కాబట్టి ఈసారి నార్మల్‌గా చేస్తున్నాం. నెక్స్ట్ ఇయర్ నుంచి గ్రాండ్‌గా నిర్వహించబోతున్నాం. పాత తరం కళాకారులకు మరిన్ని సన్మానాలు చేస్తాం. ఈ రోజును గురించి పాతికేళ్ల పాటు రీసెర్చ్ చేసి మొదటి తెలుగు టాకీ సినిమా డేట్‌ను ఖచ్చితంగా గుర్తించి ప్రపంచానికి తెలియజేసిన సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ్‌కి థ్యాంక్స్ చెబుతున్నాను' అని అన్నారు.

నటులు, నిర్మాత మురళీ మోహన్ మాట్లాడుతూ, 'ఎప్పటి నుంచో చేసుకోవాల్సిన పండగ. ఇప్పటికైనా నిర్వహిస్తున్నందుకు సంతోషం. మనం గర్వంగా చెప్పుకోదగ్గ వ్యక్తుల్లో ఎల్వీ ప్రసాద్ ఆద్యుడు అని చెప్పాలి. ఆయనతో పాటు ఎందరున్నా.. ఎల్వీ ప్రసాద్ హిందీ, బెంగాలీ చిత్రాల్లోనూ నటించారు, దర్శకుడుగానూ రాణించి సినిమా స్థాయిని పెంచారు. సినీ నటులు ఎప్పుడు ప్రేక్షకుల హృదయాల్లో ఉంటారు. ఫిబ్రవరి 6న తెలుగు సినిమా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉంది. మద్రాసులో ఉన్నప్పుడు మేం సినిమా కులమని గర్వంగా చెప్పుకునేవాళ్లం. అలాంటి సినిమాకు సంబంధించి ప్రతి సంవత్సరం పండగ చేసుకోవాలి. సినిమా పరిశ్రమలో అన్ని విభాగాల వాళ్ల సమన్వయం చేసుకుని నిర్వహిస్తే ఇంకా బావుంటుంది' అని తెలిపారు.

నవచిత్రం

నయా టైటిల్‌తో రిలీజ్



హీరో సిద్ధు జొన్నలగడ్డ నటించిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కృష్ణ అండ్ హిజ్ లీల'. కరోనా కారణంగా ఓటీటీలో నేరుగా విడుదలైన ఈ సినిమా విశేష ఆదరణ సాధించింది. రవికాంత్ పెరెపు దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సంజయ్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్, సీరత్ కపూర్, షాలిని వడ్నికట్టి కీలక పాత్రల్లో నటించారు.

ఈ పాపులర్ చిత్రాన్ని ప్రేమికుల రోజున థియేటర్లలో విడుదల చేయడానికి రానా దగ్గుబాటి సిద్ధంగా ఉన్నారు. డిజిటల్‌లో మాత్రమే విడుదలైన ఈ చిత్రం ఈనెల 14న కొత్త ట్విస్ట్‌తో థియేటర్లలోకి రానుంది. ఈ సినిమా టైటిల్‌ను 'ఇట్స్ కాంప్లికేటెడ్'గా మార్చారు. ఈ కొత్త టైటిల్ మరింత ఆసక్తిని జోడించడమే కాకుండా, సినిమా కంటెంట్‌కి పర్ఫెక్ట్‌గా యాప్ట్ అయ్యింది.

ఈ విషయాన్ని తెలియజేస్తూ రానా దగ్గుబాటి, సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు రవికాంత్ పెరెపు ఓ హిలేరియస్ వీడియోని రిలీజ్ చేశారు. ఓటీటీలోనే కాకుండా థియేటర్లలో కూడా ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి సంగీతం : శ్రీచరణ్ పాకాల కెమెరా : షానియల్ డియో, సాయి ప్రకాష్ ఉమ్మడిసింగు.

ఆద్యంతం నవ్వించే 'లైలా'



విశ్వక్ సేన్ నటించిన లేటెస్ట్ మూవీ 'లైలా'. ఈ సినిమాను దర్శకుడు రామ్ నారాయణ్ పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ,'ట్రైలర్ అందరికీ నచ్చిందని అనుకుంటున్నా. థియేటర్లలో మీరు నవ్వి నవ్వి మీ ఛాతీ చపాతీ కావాలని డిసైడ్ అయ్యాం. కచ్చితంగా 'లైలా' మిమ్మల్ని బాగా నవ్విస్తుంది. ట్రైలర్ బయటకు వచ్చింది కాబట్టి.. నాకంటే ట్రైలర్ ఎక్కువ మాట్లాడాలని అనుకుంటున్నా. 'లైలా' నుంచి నెక్స్ట్ 'అటక్ పటక్' సాంగ్ రిలీజ్ అవుతుంది. ఆ సాంగ్ నేనే రాశా. అది కూడా మీకు నచ్చుతుంది. ఈనెల 14న అందరం థియేటర్లలో కలుద్దాం' అని చెప్పారు.

ఇదే వేడుకలో మీడియా అడిగిన పలు ప్రశ్నలకు టీమ్ సమాధానమిచ్చింది.

లైలా టార్గెట్ ఏంటి?

డైరెక్టర్ రామ్ నారాయణ్ : ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడమే.

ట్రైలర్‌లో కొన్ని వల్గర్ డైలాగ్స్ ఉన్నాయి. మీ కామెంట్?

విశ్వక్ సేన్ : ప్రతి సినిమా ఒకేలా తీయలేం కదా.. ఇదొక వెరైటీ సినిమా. అందుకే ఇలా ట్రై చేశాం. పైగా నేను ఈ సినిమాలో లేడీ గెటప్ వేసింది ఎంటర్‌టైన్ చేయడానికి. మా ఇంటెన్షన్ కేవలం మిమ్మల్ని నవ్వించడమే. అందులో భాగంగానే కొన్ని డైలాగ్స్ ఉన్నాయి. యూత్‌కు పవర్‌ప్యాక్‌గా సినిమా ఉంటుంది.

ఈ సినిమాలో మీ రోల్ ఏలా ఉంటుంది?

కామాక్షి భాస్కర్ల : నా క్యారెక్టర్ చాలా సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. కామాక్షి అంటే చాలా ఇంటెన్స్ రోల్స్ చేస్తుందనే మార్క్ ఉంది. ఆ మార్క్‌కు తగ్గట్లే ఇందులో నా పాత్ర ఉంటుంది. ఆ క్రెడిట్ అంతా డైరెక్టర్ రామ్ నారాయణ్‌దే.

విశ్వక్ సేన్‌తో మీ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ఎలా ఉంది?

డాన్స్ మాస్టర్ భాను : ఈ సినిమాలో అన్ని పాటలు నేను చేశాను. ఫస్ట్ సాంగ్ సోనూ మోడల్ పెద్ద హిట్ అయింది. అలాగే లాస్ట్ సాంగ్ కోయి కోయిని కూడా హిట్ చేశారు. ప్రతి సాంగ్ సందర్భానుసారం ఉంటుంది.



మన ఇంటి కథ..

సిద్ధార్థ్ హీరోగా శ్రీ గణేష్ దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ తెరకెక్కుతోంది. 'మావీరన్' నిర్మాత అరుణ్ విశ్వ శాంతి టాకీస్‌పై తెలుగు- తమిళంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

గురువారం ఈ చిత్ర ఫస్ట్ లుక్ టైటిల్ టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి '3 బిహెచ్‌కె' అనే ఆసక్తికర టైటిల్ పెట్టారు. సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని బ్యూటీఫుల్ ఫ్యామిలీగా కనిపించిన ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై పాజిటీవ్ వైబ్స్ క్రియేట్ చేసింది. 'ఇది మన ఇంటి కథ ..ఈ ఇంట్లోనే చిన్న చిన్నగా చాలా కథలు ఉన్నాయి. ఇది మసాల డబ్బా కాదు.. అమ్మ గారి చిన్న బ్యాంక్. ఇది నాన్న గారి సెంటిమెంటు బీరువా' అంటూ సిద్ధార్థ్ వాయిస్‌తో మొదలైన టైటిల్ టీజర్ ఫీల్ గుడ్ మూమెంట్స్‌తో చాలా క్యూరియాసిటీని పెంచింది. సిద్ధార్థ్ కూల్ అండ్ చార్మ్ లుక్‌తో ఆకట్టుకున్నారు. శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు ప్రజెన్స్ కూడా అలరించింది. ఫ్యామిలీ ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా రూపొందుతోందని టీజర్ చూస్తే తెలుస్తోంది. సమ్మర్‌లో ఈ సినిమా ప్రేక్షకులు ముందుకు రానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

మీతా రఘునాథ్, చైత్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: శ్రీ గణేష్, నిర్మాత : అరుణ్ విశ్వ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్.సిబి మారప్పన్, ఫోటోగ్రఫీ డైరెక్టర్: దినేష్ కృష్ణన్ బి, జితిన్ స్టానిస్లాస్, సంగీతం: అమృత్ రామ్‌నాథ్, ఎడిటర్: గణేష్ శివ, డైలాగ్స్: రాకేందు మౌళి, ఆర్ట్ డైరెక్టర్: వినోద్ రాజ్‌కుమార్ ఎన్.

పవర్‌స్టార్ ముఖ్య అతిథిగా..



'తలసేమియా భాదితుల కోసం ఈ నెల 15న మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసాం. ప్రతి టికెట్ పై వచ్చే రూపాయి తలసేమియా భాదితులకు అందిస్తాం. ప్రేక్షకులు ఖర్చు చేసిన ప్రతి ఒక్క రూపాయి తిరిగి సమాజ సేవకే ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ముఖ్య అతిథులుగా రాబోతున్నారు' అని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ అద్వర్యంలో ఈనెల 15న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఎన్టీఆర్ ట్రస్ట్ యూఫోరియా మ్యూజికల్ నైట్ షో జరగనుంది.

ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో నారా భువనేశ్వరి మాట్లాడుతూ,'జెనిటిక్ డిజార్డర్ తలసేమియాతో చాలా మంది పిల్లలు, పెద్దలు బాధపడుతున్నారు. ఇది తీవ్రంగా వచ్చినప్పుడు రక్త మార్పిడి వెంటనే జరగాలి. దీనికి చాలా రక్తం అవసరం. బ్లడ్ డొనేట్ చేస్తే చాలా మంది జీవితాలు నిలబడతాయి. ఆ బాధితుల కోసం తమన్ కూడా ఒక్క నిమిషం ఆలోచించకుండా వెంటనే మ్యూజికల్ నైట్‌కి వస్తా అన్నారు. అంతేకాదు ఈ షోని ఫ్రీగా చేస్తా అని గొప్ప హృదయంతో చెప్పారు. బుక్ మై షోలో టికెట్స్ అందుబాటులో ఉంటాయి' అని తెలిపారు.

'తలసేమియా బాధితుల కోసం ఏర్పాటు చేసిన ఇటువంటి షోని నిర్వహించడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను. చాలా మంచి ఆలోచనతో మొదలైన కార్యక్రమం ఇది. ప్రేక్షకులు టికెట్‌పై పెట్టే ప్రతి రూపాయి తలసేమియా బాధితుల సహాయార్థం వెళ్తుంది' అని సంగీత దర్శకుడు తమన్ చెప్పారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886